www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 219 | మంగళవారం 30-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

ఆర్థిక సమత్వం



న్యూఢిల్లీ :
భారత్‌ను 2019 నాటికి స్వచ్ఛదేశంగా మారుద్దామని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పిలుపునిచ్చారు. 2018 సంవత్సరం నవభారత నిర్మాణానికి నాంది పలకబోతోందని ఆయన అన్నారు. 2019లో గాంధీజీ 150వ జయంతి ఉత్సవాలు జరుపుకోబోతున్నామని, అప్పటికల్లా దేశాన్ని స్వచ్ఛభారత్‌గా తీర్చిదిద్దడం ద్వారా గాంధీజీకి ఘనంగా నివాళులు అర్పించాలని సూచించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. రాష్ట్రపతిగా కోవింద్ తొలిసారి పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించారు. ఎన్‌డీఏ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించిన పథకాలన్నింటినీ రాష్ట్రపతి వల్లె వేశారు. నవ భారత్ కల సాకారానికి 2018 సంవత్సరం గొప్ప అవకాశం అని అన్నారు. 'ఆర్థిక, సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం స్థిరపడలేదని బాబా సాహెబ్ అంబేద్కర్ చెబుతుండేవారు. నవ భారత కలలను సాకారం చేసుకునేందుకు ఈ 2018 ముఖ్యమైన సంవత్సరం. మన దేశం యువకుల దేశం. యువత కోసం ప్రభుత్వం స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, స్కిల్ ఇండియా, ప్రధానమంత్రి ముద్ర యోజన లాంటి ఎన్నో పథకాలను తీసుకొచ్చింది' అని అన్నారు. దేశంలో సామాజిక, ఆర్థిక సమానతకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతికి ప్రయత్నిస్తోందని చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి ముద్ర యోజన ద్వారా ఇప్పటి వరకు 3 కోట్ల మందికి లబ్ధి చేకూరిందని తెలిపారు. రామగుండంలో ఎరువుల కర్మాగారాన్ని పునరుద్ధరిస్తున్నామని స్పష్టం చేశారు. బ్యాంకింగ్ వ్యవస్థకు, పేదరికానికి మధ్య ఉన్న అంతరాన్ని తొలగించామని ఘనంగా చెప్పారు. పేదలు, ఉన్నత వర్గాల మధ్య ఉన్న అంతరాన్ని తొలగించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. దేశంలో అవినీతిని - మిగతా 2 లో

- అదే మోడీ ప్రభుత్వ లక్ష్యం
- నవభారత్ నిర్మాణానికి నాంది
- అవినీతిపై పోరాటం కొనసాగుతుంది
- ప్రభుత్వ పథకాలు వల్లెవేసిన రాష్ట్రపతి
- ఇదే ఆయన మొదటి బడ్జెట్ ప్రసంగం

ఆశలపల్లకిలో జీడీపీ

నేడు 6.75%..
రేపు 7.75% వృద్ధి

- ఆర్థిక వ్యవస్థ వేగవంతం
- వచ్చే ఏడాది జీడీపీ 7 నుంచి 7.5 శాతం
- జీఎస్టీతో పెరిగిన పన్ను చెల్లింపుదార్లు
- మందగించిన పారిశ్రామిక వృద్ధి
- టెలికాంపై టారిఫ్ వార్ ప్రభావం
- ఆర్థిక సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ :
ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ మనదేనని ఆర్థిక సర్వే తెలిపింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి గానూ.. 6.75శాతం వృద్ధి రేటు నమోదు అయ్యే అవకాశముందని ఆర్థిక సర్వేలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి గానూ.. వృద్ధిరేటు 7 నుంచి 7.5శాతం ఉండొచ్చని అంచనా వేశారు. దేశంలో అమలవుతున్న వస్తు సేవల పన్ను (జీఎస్టీ), బ్యాంకులకు పెట్టుబడులు సమకూర్చడం వంటి భారీ సంస్కరణ వల్ల ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతోందని.. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ మరింత బలోపేతమయ్యే అవకాశముందని సర్వేలో పేర్కొన్నారు. జీఎస్టీ, దివాలాచట్టం అమలు, ఎఫ్‌డీఐల నిబంధనలను మరింత సరళం చేయడం, ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు కోలుకోవడం వంటి కారణాలతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థం నుంచి ఆర్థికాభివృద్ధి వేగవంతమైందని - మిగతా 2 లో

కోడిపందేలపై హైకోర్టు ఆగ్రహం



కోర్టుకు హాజరైన సీఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :
సంక్రాంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల్లో కోడిపందేల నిర్వహించడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. తాము ఆదేశాలు ఇచ్చినప్పటికీ.. అడ్డుకోవడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేసింది. కోడిపందేలపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, జస్టిస్ ఎంఎస్ కే జైశ్వాల్‌తో కూడిన ధర్మాసనం సోమవారం - మిగతా 2 లో

గ్రూప్-1లో భారీ మార్పులు?

- ప్రిలిమ్స్‌లో రెండు పేపర్లు
- మెయిన్స్‌లో సంస్కరణలు
- ఇంటర్వ్యూకు 100 మార్కులు
- కసరత్తులో ఏపీపీఎస్సీ..!
- నూతన విధానాలతో అభ్యర్థుల గాబరా

3 లో



ఏసీబీ వలకు
మరో టౌన్ కంట్రీత్రీ

- పట్టుబడిన వుడా అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్ ప్రదీప్‌కుమార్
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలో 12 ప్రాంతాల్లో సోదాలు
- రూ.50 కోట్లపైగానే అక్రమాస్తులు
- విశాఖ మధురవాడలో విలువైన స్థలాలు

విశాలాంధ్రబ్యూరో-అమరావతి/విశాఖ :
అవినీతి నిరోధక శాఖకు (ఏసీబీ) మరో అవినీతి టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి చిక్కాడు. పక్కా ప్రణాళికతో తనతోపాటు కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లతో ఆస్తులను కొనుగోలు చేశాడు. పదోన్నతి పొందిన కొద్ది రోజులకే పాపం పండటంతో ఏసీబీకి చిక్కాడు. ఆదాయానికి మించి ఆస్తులను కూడబెట్టారనే ఫిర్యాదు మేరకు విశాఖ పటణాభివృద్ధి సంస్థ (వుడా) అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్ పసుపర్తి ప్రదీప్‌కుమార్‌పై - మిగతా 11 లో

ఇక జల సంరక్షణ ఉద్యమం

- వచ్చే నెల నుండే ప్రారంభం
- 116 రోజులపాటు నీటి నిర్వహణ పనులు
- చెరువుల నుంచి చెక్‌డ్యాంల వరకు మరమ్మతులు
- పూర్తయిన తర్వాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు
- ఫిబ్రవరి 5కల్లా వైకుంఠపురం బ్యారేజీ డీపీఆర్
- జలవనరుల శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
జలవనరుల సంరక్షణతో ఇప్పటి వరకు రాష్ట్రంలో రూ. 400 కోట్ల విలువైన విద్యుత్ ఆదా చేశామని, ఇదే స్ఫూర్తితో సమర్థ నీటి నిర్వహణ పనులను వచ్చే నెల నుంచి 116 రోజుల పాటు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాలు పెంచడం ద్వారా వ్యవసాయ విద్యుత్ వినియోగంలో మిగులు సాధించడం ప్రభుత్వ విజయంగా అభివర్ణించిన ముఖ్యమంత్రి 'నీరు-ప్రగతి' కింద కాలువలు, చెరువులు పటిష్ట పరచడంతో పాటు చెక్ డ్యాంలకు మరమ్మతులు వంటి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నిర్దేశించారు. నీటి నిర్వహణ కమిటీలను తక్షణం నియమించి ఈ పనుల పర్యవేక్షణ బాధ్యతను అప్పగించాలని చెప్పారు. లక్ష్యం పూర్తయిన వెంటనే జూన్‌లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో జలవనరుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో సగటున 10.45 మీటర్ల లోతున భూగర్భ జలాలు ఉన్నాయని అధికారులు వివరించగా, వంద మీటర్ల కన్నా దిగువకు భూగర్భ జలాలు ఉన్న ప్రాంతాలపై మొదటగా దృష్టి పెట్టి, అక్కడ నీటి మట్టం పెరిగేందుకు కృషి చేయాలని - మిగతా 11 లో

బొండా భూ వివాదంపై
చంద్రబాబు సీరియస్

- భూ వివాదాలపై నిఘా నివేదిక
- సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశం
- ఉమా అనుచరుల నుంచి బెదిరింపులు : బాధితుడు సురేష్

11లో



ఒకేసారి ఎన్నికలు...!

లోక్‌సభకు, అసెంబ్లీలకు రెడీ కావాలని మోడీ పిలుపు

న్యూఢిల్లీ:
లోక్‌సభకు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిపేందుకు తగిన వాతావరణం కల్పించవలసిందిగా ఎన్‌డీఏ నాయకులను ప్రధానమంత్రి నరేంద్రమోడీ కోరారు. బీజేపీ,మిత్రపక్షాల నాయకులతో కూడిన సమావేశంలో ప్రధాని మాట్లాడారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో మోడీ ప్రసంగాన్ని హర్షిస్తూ సమావేశం తీర్మానించింది. అలాగే రిపబ్లిక్ డే ఉత్సవాలకు 10మంది ఆసియన్ దేశాల అధినేతలు - మిగతా 2 లో

ఇదీ లోకం!



సీపీఐ విజయనగరం జిల్లా కార్యదర్శి కామేశ్వరరావు

సహాయ కార్యదర్శులుగా రమణ, అశోక్



విశాలాంధ్ర బ్యూరో-విజయనగరం :
భారత కమ్యూనిస్టు పార్టీ విజయనగరం జిల్లా కార్యదర్శిగా పి.కామేశ్వరరావు ఎన్నికయ్యారు. జిల్లా సహాయ కార్యదర్శులుగా ఒమ్మి రమణ, బుగత అశోక్‌లు ఎన్నికయ్యారు. గజపతినగరంలో శని, ఆదివారాల్లో 12వ జిల్లా మహాసభలు జరిగాయి. చివరిరోజు ప్రతినిధుల సభలో 49 మందితో జిల్లా కమిటీ ఏర్పాటైంది. కమిటీ జిల్లా కార్యదర్శిని, సహాయ కార్యదర్శులతోపాటు మొత్తం 12 మందితో కూడిన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కామేశ్వరరావు జిల్లా కార్యదర్శిగా ఎన్నికకావడం వరుసగా ఇది ఐదోసారి. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కామేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐని జిల్లాలో బలీయమైన శక్తిగా రూపొందించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. 110 మందితో కూడిన జిల్లా ప్రతినిధుల సభ జిల్లా కమిటీని ఎన్నుకుందని చెప్పారు. జిల్లా కమిటీలో కొత్తగా 17 మందిని, కార్యవర్గంలోకి కొత్తగా ముగ్గురిని తీసుకున్నామని చెప్పారు.

అసెంబ్లీలో అన్నీ సమస్యలే

- విప్‌లకు ఛాంబర్లు లేవు
- ఎత్తు పెంచాలంటే వాస్తు భయం
- సిబ్బంది కొరత
- లైబ్రరీ ఏర్పాటు ఆవశ్యకత



విశాలాంధ్ర-అమరావతి :
చట్టాలు చేసే శాసనసభలో అన్నీ సమస్యలే. సిబ్బంది కొరత, విప్‌లకు ఛాంబర్లు, వాహనాలకు పార్కింగ్, గ్రంధాలు ఉండాల్సిన లైబ్రరీ, సిబ్బందికి అవసరమైన క్యాంటిన్, ఇతర వసతులు కరవయ్యాయి. మార్చి మొదటి వారం నుండి బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. సమావేశాల సమయంలో విప్‌లది కీలకపాత్ర. అయితే శాసనసభ, శాసన మండలి చీఫ్ విప్‌లతో సహా నలుగురు విప్‌లకు ఛాంబర్లు లేవు. శాసనసభ చీఫ్ విప్‌గా ఉన్న కాల్వ శ్రీనివాసులు క్యాబినెట్‌లో మంత్రిగా చేరారు. ఆయనకు గతంలో కేటాయించిన ఛాంబర్‌ను శాసనసభ అధికారులు వినియోగిస్తున్నారు. కాల్వ స్థానంలో చీఫ్ విప్‌గా నియమితులైన పల్లె రఘునాధరెడ్డికి, శాసనమండలి చీఫ్ విప్‌గా ఉన్న పయ్యావుల కేశవ్‌లకు ఇప్పటివరకు ఛాంబర్లు కేటాయించలేదు. వీరితో పాటు శాసనసభ విప్‌లుగా ఉన్న సర్వేశ్వరరావు, నాయుడు, శాసన మండలి విప్‌లు డొక్కా మాణిక్యవరప్రసాద్, బుద్ధా వెంకన్నల పరిస్థితి కూడా అంతే. ఇదిలా ఉంటే శాసనసభలో బీజేపీ ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్‌రాజుకు ఓ గదిని కేటాయించారు. ఆ గదికి బాత్రూం లేదు. 'బాత్రూం లేని బాత్రూం అంత ఛాంబర్‌ను నాకు ఇచ్చారు. మా పార్టీ పెద్దలెవరన్నా వస్తే పరువు పోతుందేమోనని ఆయన గతంలోనే ఆవేదన వెలిబుచ్చారు. ఇక శాసనసభ, శాసన మండలికి సంబంధించి పీఏసీ, ఎథిక్స్, బీసీ, ఎస్సీ, ఇతరత్రా 15కు పైగా కమిటీలు ఉంటాయి. ఆ కమిటీల ఛైర్మన్‌లు, సభ్యులు ఆయా శాఖలకు సంబంధించిన సమావేశాలు నిర్వహిస్తుంటారు. ఈ కమిటీ ఛైర్మన్‌లకు ప్రత్యేక ఛాంబర్‌లు ఉంటాయి. కానీ ప్రస్తుతం ఆ వసతులు ఇక్కడ లేవు. గతవారం జరిగిన పీఏసీ సమావేశం తర్వాత పీఏసీ అధ్యక్షుడు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, - మిగతా 2 లో

కమ్యూనిస్టు నేత అన్సిలోవ్ మృతి



మాస్కో : కమ్యూనిస్టు పార్టీ నాయకుడు విక్టర్ యువనోవిచ్ అన్సిలోవ్ మృతిచెందారు. ఆయన వయస్సు 73 సంవత్సరాలు. 1945లో క్రసనోడర్ ప్రాంతంలో ఆయన జన్మించారు. మాస్కో స్టేట్ యూనివర్సిటీలో జర్నలిజం విభాగంలో ఆయన డిగ్రీ పొందారు. ప్రభుత్వ టెలివిజన్ విభాగాలలో, సోవియట్ యూనియన్ రేడియో విభాగంలోనూ ఆయన అనేక సంవత్సరాలు పనిచేశారు. 1991లో లేబర్ రష్యా ఉద్యమాన్ని ఆయన ప్రారంభించారు. తుది శ్వాస విడిచేవరకు ఆయన ఈ ఉద్యమంలోనే కొనసాగారు. ఎల్సిన్ పాలనాకాలంలో ఈ ఉద్యమం ప్రముఖపాత్ర వహించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక ప్రదర్శనలను నిర్వహించారు. ప్రతిపక్ష విప్లవం సందర్భంగా కమ్యూనిస్టు ఉద్యమాన్ని పునరుజ్జీవింపచేసేందుకు ఆయన ఎన్నో విలువైన సేవలను అందించారు. పెట్టుబడిదారీ వ్యవస్థపైన నిరంతర పోరాటం సాగించారు. కమ్యూనిస్టు ఉద్యమంలో విభేదాలు ఉన్నప్పటికి అన్పిలోవ్‌కు పార్టీకి ఎంతో గౌరవం ఉంది.

హోండురస్ అధ్యక్షుడిగా హెర్నాండెజ్



తెగుసిగల్పా : హోండురస్ అధ్యక్షుడుగా జువాన్‌ఆర్లాండోహెర్నాండెజ్ పదవీ బాధ్యతలను స్వీకరించారు. అధ్యక్షుడుగా పనిచేయడం ఆయన ఇది రెండవసారి. పదవీ స్వీకారం అనంతరం హెర్నాండెజ్ మాట్లాడుతూ దేశంలో కొనసాగుతున్న రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు వివిధరంగాలలో అనేక ముఖ్యమైన సంస్కరణలను తీసుకురానున్నట్లు చెప్పారు. సమాజాన్ని ప్రక్షాళనచేసే దిశగా తాను చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. దేశ భవిష్యత్తుకోసం సమిష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎవరూ తమ భావాలను, ఆకాంక్షలను, ఆశలను వదులుకోవాలని తాను కోరడంలేదన్నారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు కొనసాగేందుకు సమన్వయపరిచే టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేయనున్నట్లు అధ్యక్షుడు తెలిపారు. అందుబాటులో ఉండే ధరలకు ఆహార వస్తువులను విక్రయించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేస్తానని అన్నారు. మీ టేబుల్‌పై ఆహారం పథకంకింద వివిధ మార్కెట్ల ద్వారా ఆహార పదార్థాలను అందిస్తామని అన్నారు. మెరుగైన జీవనంకోసం మంత్రులంతా తక్షణం తమ కృషిని రెట్టింపు చేయాలని కోరారు. సంక్షోభంనుంచి బయటపడేందుకు సూచనలు చేయవలసిందిగా ప్రతిపక్షాలతోను తాను సంప్రదింపులు జరుపుతానని అన్నారు.

విశాలాంధ్ర ప్రపంచం

హవానాలో జోస్‌మార్టి విగ్రహావిష్కరణ



హవానా : క్యూబా జాతీయనేత జోస్‌మార్టి విగ్రహాన్ని దేశ అధ్యక్షుడు రాల్‌కాస్ట్రో ఇక్కడ ఆవిష్కరించారు. ప్రస్తుతం న్యూయార్క్ సెంట్రల్ పార్కులో ఉన్న జోస్‌మార్టి విగ్రహాన్ని పోలిన విగ్రహాన్నే తయారుచేసి ఇక్కడ ఏర్పాటు చేశారు. రాల్‌కాస్ట్రోతోపాటు క్యూబా ప్రథమ ఉపాధ్యక్షుడు మిగుల్‌డియాజ్‌కనెల్ ఇతర స్థానిక ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు న్యూయార్క్ ప్రభుత్వ ప్రతినిధులు ఇంకా అమెరికాకు చెందిన అనేకమంది ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.హవానా చరిత్రకారుడు యుసెబియోలియల్ మాట్లాడుతూ న్యూయార్క్ సెంట్రల్ పార్కులో విగ్రహాన్ని అమెరికా కళాకారుడు అన్నాహయత్ హంటింగ్‌టన్ ఎంతో నైపుణ్యంతో రూపొందించారని అన్నారు. ఈ విగ్రహాన్ని 1958లో పూర్తిచేసి ఆవిష్కరించినట్టుగా ఆయన తెలిపారు. క్యూబా ప్రభుత్వ విజ్ఞప్తి మేరకే ఆ కళాకారులు విగ్రహాన్ని రూపొందించి అమెరికాకు బహుమతిగా అందించారని అన్నారు. రాజకీయ విభేదాల కారణంగా సెంట్రల్ పార్కులో ఆ విగ్రహాన్ని 1965 వరకు ఆవిష్కరించలేకపోయారు. ప్రస్తుతం అక్కడ జోస్‌మార్టి విగ్రహం లాటిన్ అమెరికా నేతలైన సైమన్ బొలీవర్, జోస్‌డిశాన్‌మార్టిన్ తదితరులు విగ్రహాలకు సమీపంలోనే ఉన్నదని ఆయన చెప్పారు. బ్రాంక్స్ మ్యూజియం ఆఫ్‌ది ఆర్ట్స్ ఛైర్మన్ జోసఫ్‌మిజ్జి మాట్లాడుతూ ఈ విగ్రహావిష్కరణలో పాల్గొనడం తాను గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపారు. జోస్‌మార్టి 1883 జనవరి 28వ తేదీన జన్మించారు. యువకుడిగా ఉన్నప్పుడే స్పెయిన్ వలసపాలననుంచి క్యూబా విముక్తికోసం పోరాటం జరిపారు. అయితే ఈ పోరాటంలో ఆయన 42 ఏళ్ల వయసులోనే మృతిచెందారు. ఆయన 165వ జయంతిని పురస్కరించుకుని ఈ వారంలో క్యూబా అంతటా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



ఉధృతంగా సెయిన్ నదీ ప్రవాహం

పారిస్ : ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగరంలో వర్షాలు భారీగా కురవడంతో నగరంగుండా ప్రవహించే సెయిన్ నది పోటెత్తింది. నదీ ప్రవాహం ఉగ్రరూపం దాల్చడంతో పరిసర ప్రాంతాల్లోని 1500 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నగరంలోని 240 కమ్యూన్ల ప్రాంతంలో నీరు భారీగా నిలిచివుంది. అయితే క్రమక్రమంగా నీరు తగ్గిపోతుందని పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు తెలిపారు. 2016లోను ఎడతెరిపిలేని వర్షాలు నగరాన్ని ముంచెత్తాయి. నగరమంతా అల్లకల్లోలమయిపోయింది. సెయిన్ నదిలో నీరు 6.1 మీటర్ల ఎత్తున ప్రవహించింది. ఈసారి కూడా ఎడతెరిపిలేని వర్షాలు ఈనెల 29వరకు కురుస్తూనే ఉన్నాయి.

కాబూల్ రక్షణ వర్సిటీపై ఉగ్ర దాడి

11 మంది మృతి, 16మందికి గాయాలు



కాబూల్ : ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్ నగరంలోని సైనిక అకాడమీ సమీపంలోగల సైనిక స్థావరం వద్ద ఉన్న రక్షణ యూనివర్శిటీపై ఉగ్రవాదులు దాడి జరిపారు. ఈ దాడిలో 11 మంది సైనికులు మృతిచెందారు. మరో 16 మంది గాయపడ్డారని రక్షణమంత్రిత్వశాఖ ప్రతినిధి బీబీసీకి తెలిపారు. ఈ దాడిలో 5గురు ఉగ్రవాదులు పాల్గొన్నట్లు ఆయన చెప్పారు. 5గురు ఉగ్రవాదుల్లో 4గురిని కాల్చివేశారు. ఒకరిని అరెస్టు చేశారు. తామే ఈ దాడికి కారకులమని ఐఎస్ ఉగ్రవాదసంస్థ ప్రకటించినట్టుగా అమక్ వార్తాసంస్థ తెలిపింది. సైనిక స్థావరం సమీపంలోగల మార్షల్‌ఫహీం జాతీయ రక్షణ విశ్వవిద్యాలయంపై ఈ దాడి జరిగింది. కొద్దిరోజుల క్రితమే తాలిబన్ మిలిటెంట్లు ఆంబులెన్స్‌లో బాంబులనువుంచి పేల్చిన ఘటనలో దాదాపు 100మంది మృతిచెందిన ఘటనను మరువకముందే మరోదాడి జరిగింది. అటు తాలిబాన్లు ఇటు ఐఎస్ ఉగ్రవాదులు కాబూల్‌ను లక్ష్యంగా పెట్టుకుని దాడులకు పాల్పడుతున్నారు. పాకిస్తాన్‌పైన అమెరికా ఒత్తిడి పెరగడంవల్లనే ఇటీవల ఉగ్రవాదులు తమ దేశంలోని పలుచోట్ల దాడులను పెంచారని ఆఫ్ఘన్ ఇంటిలిజెన్స్ సర్వీసెస్ అధిపతి అభిప్రాయపడ్డారు. పాకిస్తాన్‌లో ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నారని విమర్శిస్తూ ట్రంప్ ఇటీవల ఆదేశానికి రక్షణ సహాయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆఫ్ఘనిస్తాన్‌లో తరచుగా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్నాయి.

సింగిల్ మార్కెట్‌కి లేబర్ వ్యతిరేకం



లండన్ : యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగిన తరువాత సింగిల్ మార్కెట్‌లో కొనసాగేందుకు లేబర్ పార్టీ వ్యతిరేకంగా ఉన్నది. ఆ పార్టీనేత జెరిమికార్బిన్ ఐటివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ అంశాన్ని స్పష్టం చేశారు. ఈయూ నుంచి వైదొలగేందుకు సంబంధించిన బిల్లు ఈ వారంలో లార్డ్స్ సభ ఆమోదానికి వెళ్లనున్నది. సింగిల్ మార్కెట్‌లో ఉండాలా లేక కస్టమ్స్ యూనియన్‌లోనే ఉండాలా? అన్న అంశంపై బ్రిటన్ మంత్రివర్గంలో విభేదాలున్నాయి. బ్రిటన్ పారిశ్రామిక సమాఖ్య మాత్రం కస్టమ్స్ యూనియన్‌లో కొనసాగేందుకు అనుకూలంగా యున్నది. మరోవైపు బ్రెగ్జిట్‌పై చర్చలు జరుపుతున్న వారు సింగిల్ మార్కెట్టుకు సానుకూలంగా ఉంది. లేబర్ పార్టీ మాత్రం కస్టమ్స్ యూనియన్‌లో కొనసాగేందుకు కూడా విముఖత వ్యక్తం చేసింది. కస్టమ్స్ యూనియన్‌కు సంబంధించిన నియమ నిబంధనలపై బ్రిటన్‌కు ఎక్కువ ఆధిపత్యం ఉండాలని లేబర్ పార్టీ కోరుతున్నది. ఈయూ సభ్యత్వం లేకుండా యూరోపియన్ యూనియన్ ఎకనమిక్ ఏరియా, యూరోపియన్ ఫ్రీట్ ట్రేడ్ అసోసియేషన్‌లో చేరిన నార్వే తరహా బ్రెగ్జిట్‌ను తాము ఆమోదించబోమని కార్బిన్ స్పష్టం చేశారు. ఈ ఏడాది మార్చిలోపు ఎలాగైనా యూరోపియన్ యూనియన్ నుండి వైదొలగేందుకు చర్చలను సఫలీకృతం చేసుకోవాలని ప్రధానమంత్రి థెరిసామె లక్ష్యంగా పెట్టుకున్నారు. కార్బిన్ బీబీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మహిళలుగా మార్పు చెందిన వారికి మహిళా పోస్టులలోనే ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. ఇందుకు సంబంధించిన ఉద్యమాన్ని చేపట్టేందుకు 20వేల పౌండ్లను సమీకరించినట్టు కార్బిన్ చెప్పారు.

ఈయూతో ఎన్నో సమస్యలున్నాయి

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య

వాషింగ్టన్ : యూరోపియన్ యూనియన్‌తో తమకు ఎన్నో సమస్యలున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికా, ఈయూ మధ్య వాణిజ్యయుద్ధం జరగవచ్చునని ఆయన హెచ్చరించారు. పారిస్ వాతావరణ ఒప్పందంలో తాము మళ్లీ చేరవచ్చునని ట్రంప్ అంటూనే ప్రస్తుత ఒప్పందంకంటే భిన్నమైన ఒప్పందం వుంటే చేరతామని అన్నారు. ప్రస్తుత ఒప్పందం భయంకరమైందని అమెరికాకు విధ్వంసకరమైందని గతంలో చెప్పిన మాటలనే మళ్లీ చెప్పారు. యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగేందుకు తానైతే మరోవిధంగా చర్చలు జరిపేవాడినని ఆయన అన్నారు. ఈయూ నుంచి బ్రిటన్ వైదొలగిన తరువాత ఆదేశంతో అనేక వాణిజ్య ఒప్పందాలను తాము కుదుర్చుకుంటామని చెప్పారు. ఆదివారం ఆయన ఐటివి విలేకరి పియర్స్ మోర్గాన్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక అంశాలను ప్రస్తావించారు. మహిళలంటే తనకు ఎంతగానో గౌరవం ఉందని అన్నారు. పారిస్ ఒప్పందంనుంచి వైదొలగుతున్నట్టు 2017 జూన్‌లో ట్రంప్ ప్రకటించినపుడు ప్రపంచంలోని అనేక దేశాలు ఆయన వైఖరిని ఖండించాయి. 2015లో పారిస్ ఒప్పందం కుదిరింది. 195 దేశాలు ఒప్పందంపై సంతకాలు చేశారు. వాతావరణంలో కాలుష్యాన్ని, భూతాపాన్ని ఈ శతాబ్ది చివరినాటికి రెండు డిగ్రీల సెల్సియస్‌కు మించకుండా నియంత్రించేందుకు కర్బనపు వాయువుల విడుదలను తగ్గిస్తామని అనేక దేశాలు స్వచ్ఛందంగానే వాగ్దానం చేశాయి. స్వచ్ఛమైన గాలి, నీరు కావాలని తాను నమ్ముతున్నానని అయితే పారిస్ ఒప్పందం తమ దేశానికి విధ్వంసకరమైందని మరోసారి ఆయన విరుచుకుపడ్డారు. ప్రస్తుతానికి తాము ఈ ఒప్పందంనుంచి పూర్తిగా వెలుపలే ఉన్నామని అన్నారు. ఒప్పందంలో మార్పులు చేస్తే తిరిగి అందులో చేరతామన్నారు.

ఆర్థిక సమత్వం

(మొదటిపేజీ తరువాయి)

నిర్మూలించేందుకు ప్రభుత్వం చేస్తున్న పోరాటం కొనసాగుతోందని రాష్ట్రపతి కోవింద్ అన్నారు. ఆధార్ గురించి కూడా రాష్ట్రపతి ప్రస్తావించారు. ఆధార్.. దళారీ విధానాన్ని రూపుమాపుతోందని, పేదల హక్కులకు ఎంతగానో దోహదపడుతోందని ప్రశంసించారు. ఆధార్ వల్ల రూ.57వేల కోట్లను మోసగాళ్ల చేతుల్లోకి వెళ్లకుండా ఆపగలిగామన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన జవాన్లకు నివాళులర్పించారు.

ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదించాలి

బడ్జెట్ సమావేశాల్లో ట్రిపుల్ తలాక్ బిల్లుకు ఆమోదం లభిస్తుందని ఆశిస్తున్నట్టు రాష్ట్రపతి తెలిపారు. ముస్లిం మహిళల ఏళ్ల నాటి ఆవేదన నుంచి విముక్తి కోసం తలాక్ బిల్లును ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ప్రధానమంత్రి ఉజ్వల్ యోజనతో మహిళల కష్టాలు తొలగిపోయాయని చెప్పారు. మహిళల్లో సామాజిక, ఆర్థిక సమానత్వం తీసుకొచ్చామన్నారు. మెటర్నిటీ బెన్‌ఫిట్ బిల్లుతో మహిళలకు అండగా నిలిచామన్నారు. స్వయం సహాయక బృందాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. బాలికల సంరక్షణ కోసం బేటీ బచావో - బేటీ పఢావో కార్యక్రమం అమలు చేస్తున్నామని వెల్లడించారు.

రైతుల ఆదాయం రెట్టింపు..!

2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్రపతి పునరుద్ఘాటించారు. వ్యవసాయంలో ఖర్చు తగ్గిందని, దిగుబడి పెంచడమే తమ లక్ష్యమని చెప్పారు. సాగునీటి పారుదల వ్యవస్థను విస్తరించి రైతులకు చేయూతనిస్తామని భరోసా ఇచ్చారు. ప్రధాన్‌మంత్రి కిసాన్ యోజన పథకం రైతులకు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు వెళ్లకుండా ప్రభుత్వం నిరోధించగలిగిందని తెలిపారు. బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీని గ్రామాలకు విస్తరిస్తున్నామని కోవింద్ వెల్లడించారు. భారత్ నెట్ పథకం ద్వారా రెండు లక్షల గ్రామాలు బ్రాడ్ బ్యాండ్‌తో అనుసంధానమయ్యాయని, రెండున్నర లక్షల పంచాయతీల్లో ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక పురోభివృద్ధికి గరీబ్ వికాస్ కౌన్సిల్ యోజన పథకం అమలు చేస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు. పీఎం జీవన్ జ్యోతి కింద 18 కోట్ల మందికి బీమా కోసం రూ. 2 వేల కోట్లు వ్యయం చేస్తున్నట్లు ప్రకటించారు. 82 శాతం గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. కొత్తగా 3 లక్షల ఎల్‌పీజీ కెనెక్షన్లు ఇచ్చామన్నారు. జన్‌ధన్ యోజన పథకం ద్వారా 21 కోట్ల బ్యాంకు ఖాతాలు తెరిపించామని, అటల్ పెన్షన్ యోజన సామాన్యులకు ఎంతో ఉపయోగపడిందన్నారు. 2022 నాటికి దేశంలోని ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకొచ్చారు. కొత్తగా 4 కోట్ల మందికి విద్యుత్ సౌకర్యం కల్పించామని తెలిపారు. ఆరోగ్య సేవలు చౌకగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్రపతి స్పష్టం చేశారు. మూడు వేల వరకు జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. పేదలకు అందుబాటు ధరలోకి 800 రకాల మందులు తీసుకువచ్చామన్నారు. మిషన్ ఇంద్రధనుష్‌తో చిన్నారులకు టీకాలు వేస్తున్నామని, తక్కువ ధరకు మెడిసిన్స్ దొరికేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 9 లక్షల మంది దివ్యాంగులకు అవసరమైన పరికరాలు అందించామని చెప్పారు. రూ. 1750 కోట్లతో ఖేల్ ఇండియా పేరుతో కొత్త పథకం తీసుకువచ్చామని తెలిపారు. అటల్ ఇన్నోవేషన్ ద్వారా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశామన్నారు.

ఆశలపల్లకిలో జీడీపీ

(మొదటిపేజీ తరువాయి)

'ఆర్థిక సర్వే' తెలిపింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రపతి ప్రసంగం అనంతరం అరుణ్‌జైట్లీ 2018 ఆర్థిక సర్వేను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. భారత ఆర్థిక వ్యవస్థకు జీఎస్టీ కొత్త ఊపునిచ్చిందన్నారు. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత పరోక్ష పన్నులు చెల్లించేవారి సంఖ్య 50శాతం పెరిగిందని సర్వేలో వెల్లడించారు. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో ఎక్కువమంది జీఎస్టీలో నమోదు చేసుకున్నట్లు సర్వే తెలిపింది. గతంతో పోలిస్తే యూపీ, పశ్చిమ బెంగాల్ నుంచి ఎక్కువ మంది పన్ను చెల్లింపుదారులున్నట్లు పేర్కొంది. జీఎస్టీ అమలు తర్వాత పారిశ్రామిక వృద్ధిరేటులో కొంత మందగమనం కనిపించినట్లు సర్వే వెల్లడించింది. ఆర్థిక సర్వే ప్రవేశపెట్టిన అనంతరం లోక్‌సభ ఫిబ్రవరి 1కి వాయిదా పడింది.

2016 నవంబరు నుంచి దాదాపు 18లక్షల మంది వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు నమోదయ్యారని తెలిపారు. సాంఘిక భద్రతకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయనీ, ముఖ్యంగా ఈపీఎఫ్‌వో, ఈఎస్‌ఐసీల చెల్లింపులు కేవలం 31శాతం మాత్రమే ఉండేవనీ, జీఎస్టీ అమల్లోకి వచ్చాక వీటి చెల్లింపుల వాటా 53శాతం పెరిగిందని తెలిపారు. ఎగుమతులు, పొరుగు రాష్ట్రాలతో ఎక్కువ వ్యాపారాలు చేసే రాష్ట్రాలు ఆర్థికంగా పరిపుష్టంగా ఉన్నట్లు తేలింది. భారత ఎగుమతుల్లో దిగ్గజ కంపెనీలదే సింహభాగం. కానీ ఇతర దేశాల దిగ్గజ కంపెనీలు ఆయా దేశాల ఎగుమతుల్లో పొందుతున్న వాటాతో పోలిస్తే మాత్రం ఇది చాలా తక్కువ. భారత దిగ్గజ కంపెనీల ఎగుమతుల వాటా 30శాతం ఉంటే.. బ్రెజిల్ (72), జర్మనీ(68) మెక్సికో (67), అమెరికా(55)ల కంటే చాలా తక్కువని జైట్లీ తెలిపారు. రెడీమేడ్ దుస్తులపై రాష్ట్ర పన్నులు తగ్గడంతో ఎగుమతులు పెరిగాయని, ఈ పెరుగుదల దాదాపు 16శాతం వరకు ఉందని చెప్పారు. భారత్‌లో తల్లదండ్రులకు మగపిల్లలు కావాలని కోరిక ఎక్కువని, వారు అనుకున్నంత మంది మగపిల్లల్ని కనే వరకూ సంతానోత్పత్తిని కొనసాగిస్తున్నారనీ, దీంతో స్త్రీ పురుష నిష్పత్తి పడిపోతున్నదని ఆర్థిక సర్వే పేర్కొంది.

పన్ను వసూళ్ల వివాదాల కేసుల్లో ప్రభుత్వం విజయం సాధిస్తున్న శాతం చాలా తక్కువగా ఉందనీ, 30శాతం కంటే తక్కువ కేసుల్లో విజయం సాధిస్తోందని తెలిపింది. చిన్నకారణాలతో వివాదాల చిక్కుముడులు పడుతున్నాయి. కేసుల మొత్తం విలువలో 1.8శాతం విలువ కోసం 66 శాతం కేసులు నడుస్తున్నాయని పేర్కొన్నది. పొదుపు పెరిగినంత మాత్రాన ఆర్థిక వ్యవస్థలో వృద్ధి నమోదు కావడంలేదు. పెట్టుబడులు పెరిగితేనే వృద్ధి నమోదవుతోందనీ, ఇతర ప్రజాస్వామ్య దేశాలతో పోల్చుకుంటే భారత్‌లో రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాలు వసూలు చేస్తున్న పన్నులు చాలా తక్కువగా ఉంటున్నాయనీ, ఈవిషయంలో బ్రెజిల్, జర్మనీలు మనకన్నా ముందున్నాయని తెలిపింది. భారత్‌లో వ్యవసాయంపై వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా ఉందనీ, భారీగా ఉష్ణోగ్రతలు, కరవు నెలకొన్నాయనీ, నీటి పారుదల వసతులతో సంబంధం లేకుండా ఇటువంటి పరిస్థితులు నెలకొన్నాయని ఆర్థిక సర్వే తెలిపింది.

ఒత్తిడిలో టెలికం రంగం

దేశీయ టెలికాం రంగం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోందని 2017-18 ఆర్థికసర్వే విశ్లేషించింది. ముఖ్యంగా టెలికాం రంగంలోకి కొత్తగా ప్రవేశించిన రిలయన్స్ జియో మార్కెట్ సంక్షోభానికి కారణమైందని పేర్కొంది. ఇతర కారణాలతోపాటు టారిఫ్ వార్ టెలికాం సేవల సంస్థలను దెబ్బతీసిందని చెప్పడం విశేషం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్త టెలికాం విధానం తీసుకొస్తోందని చెప్పింది. దీని రూపకల్పన ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంది. 2018 లో ప్రభుత్వం ఈ కొత్త విధానాన్ని విడుదల చేయనుందని సర్వే వెల్లడించింది. రెగ్యులేటరీ, లైసెన్సింగ్ విధానాలు, కనెక్టివిటీ, సేవల నాణ్యత, వ్యాపార సరళీకరణ, 5జీ సేవలు, ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ లాంటి కొత్త టెక్నాలజీపై ఈ కొత్త విధానం దృష్టిపెట్టాలని సర్వే సూచించింది.

భారీ రుణాలు, టారిఫ్ వార్, అసంబద్ధమైన స్పెక్ట్రం చార్జీలు టెల్కోలను దెబ్బతీశాయని వ్యాఖ్యానించింది. టెలికాం మార్కెట్‌లో తక్కువ ధరలతో ఎంట్రీ ఇచ్చిన రిలయన్స్ జియో వల్ల మార్కెట్‌లో సంక్షోభం ఏర్పడిందనీ, దీని కారణంగా ఇతర కంపెనీల ఆదాయం పడిపోయిందని తెలిపింది. ఈ సంక్షోభం పెట్టుబడిదారులు, రుణదాతలు, భాగస్వాములతోపాటు టెలికాం కంపెనీల వెండార్స్‌ను తీవ్రంగా ప్రభావితం చేసిందని సర్వే పేర్కొంది. అయితే హేతుబద్ధమైన స్పెక్ట్రం వేలం, ఇతర ఖర్చుల హేతుబద్ధీకరణ ద్వారా దీన్ని నియంత్రించాలని సర్వే సిఫార్సు చేసింది.

ఒకేసారి ఎన్నికలు...!

(మొదటిపేజీ తరువాయి)

హాజరుకావడాన్నికూడా సమావేశం ఆహ్వానించింది. ఒకేసారి ఎన్నికల నిర్వహణపై విస్తృతంగా చర్చలు జరపాలని బీజేపీ, మిత్రపక్షాల నాయకులను కోరారు. ఒకేసారి ఎన్నికలపైనే ఆయన ఎక్కువగా దృష్టిపెట్టారు. దేశంలో ఎక్కడోఒకచోట పదేపదే ఎన్నికలు జరగడంతో అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోతున్నాయని ప్రధాని వాదించారు. ఇలా ఎన్నికల నిర్వహణకు భారీగా ఖర్చు అవుతుందని కూడా అన్నారు. ఎన్‌డీఏ సమావేశం తరువాత బీజేపీ పార్లమెంటరీ కార్యవర్గసమావేశం జరిగింది. పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా, మోడీ పాల్గొని బడ్జెట్ సమావేశాలకు పార్టీ ఎంపీలంతా విధిగా రావాలని ప్రత్యేకించి కోరారు. వివాదాస్పదమైన ట్రిపుల్ తలాఖ్ బిల్లు, ఓబీసీ చట్టంచేసేందుకు బిల్లును ఆమోదించవలసి ఉంది.

తలాక్ బిల్లు ఆమోదానికి సహకరించండి

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలో ట్రిపుల్ తలాక్‌పై బిల్లు ఆమోదానికి సహకరించాలని రాజకీయ పక్షాలన్నింటికీ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సోమవారం వినయపూర్వక అభ్యర్థన చేశారు. ముస్లిం మహిళలకు ఇది నూతన సంవత్సర కానుక అని అన్నారు. పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ, ప్రజల అంచనాలను చివరి సమావేశాల్లో బిల్లు ఆమోదం పొందలేకపోయిందన్నారు. ఈ అంశంపై రాజకీయాలు ఉండవని, ఇది ముస్లిం మహిళ హక్కులకు సంబంధించినదని ప్రధాని చెప్పారు. అయితే ముస్లిం మహిళ(వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లు-2017 లోక్‌సభలో ఆమోదం పొందింది. కానీ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపాలని అనేక విపక్ష పార్టీలు డిమాండు చేయడంతో రాజ్యసభలో పెండింగ్ పడింది.

మోడీ మాట్లాడుతూ సోమవారం నుంచి ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు చాలా ముఖ్యమైనవి. ఎందుకంటే, ప్రపంచ సమాజం మొత్తం భారతదేశ ఆర్థిక వ్యవస్థపై అత్యంత ఆశావహంగా ఉందని అన్నారు. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్, అంతర్జాతీయ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీల ద్వారా ముందుకు సాగిన భారత వృద్ధిపై ఒక సానుకూల అభిప్రాయం ఉందని ఆయన పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ వేగవంత వృద్ధికి బడ్జెట్ కొత్త శక్తిని అందిస్తుందన్నారు. సామాన్యుడి ఆశలు, ఆకాంక్షలను నెరవేరుస్తుందన్నారు.

బడ్జెట్ నుంచి సామాన్యుడు ఎలా ప్రయోజనం పొందగలడో నిర్ధారించడానికి, స్టాండింగ్ కమిటీలో చర్చకు వీలైనంత సాయం చేయాలని రాజకీయ పక్షాలన్నింటికి ప్రధాని విజ్ఞప్తి చేశారు. 'దళితులు, అణగారిన వర్గాల ప్రజలు, ఏ ప్రయోజనాలు పొందని వారికి మన లక్ష్యం చేరుకోవాలి' అని తెలిపారు. 'బడ్జెట్ నుంచి గ్రామీణులు, పేదలు, రైతులు, కార్మికులు ఎలా గరిష్ట ప్రయోజనం పొందుతారో చూడాలి. ఇందుకు ఒక వివరణాత్మక చర్చ చేపడితే సానుకూల సలహాలు అందుతాయి' అని మోడీ పేర్కొన్నారు.

అన్నీ సమస్యలే

(మొదటిపేజీ తరువాయి)

సభ్యుడుగా ఉన్న విష్ణుకుమార్‌రాజు, వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కేటాయించిన ఛాంబర్‌లో కూర్చుని మీడియాతో చిట్‌చాట్ చేశారు. అది యాదృచ్ఛికమే అయినప్పటికీ విష్ణుకుమార్‌రాజు వైసీపీ సభ్యుల కార్యాలయంలో కూర్చుని మాట్లాడటాన్ని కొందరు ఆక్షేపించారు. ఛాంబర్ల కొరత కారణంగా ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయి. అసెంబ్లీలో గదుల కొరత తీవ్రంగా ఉండటంతో ఛాంబర్లు కేటాయించలేక పోతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అసెంబ్లీపై మరో అంతస్తు వేయాలంటే వాస్తు సమస్యతో వేయటం లేదని సచివాలయంలో ప్రచారం సాగుతోంది. ముఖ్యమంత్రి ఉండే 1వ బ్లాకుకు అసెంబ్లీ ఈశాన్యంలో ఉంది. వాయువ్యంలో ఉన్న ముఖ్యమంత్రి కార్యాలయం ఎత్తు పెంచకుండా అసెంబ్లీ పెంచకూడదని వాస్తు నిపుణులు చెప్పటంతో అసెంబ్లీ భవనంపై మరో నిర్మాణం చేపట్టే పరిస్థితి లేదని చెప్పుకుంటున్నారు. అలా అని మరో నిర్మాణం చేపట్టాలంటే స్థలం లేదు. దీనికి ఎలాంటి వాస్తు దోషాలు తలెత్తుతాయోనన్న ఆందోళన సిబ్బందిలో ఉంది. శాసనసభ ఆవరణలో ఉన్న వాహనాల పార్కింగ్ ప్రదేశం సరిపోవటం లేదు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వాహనాలు బయటే పార్క్ చేస్తున్నారు. మంత్రులు, విప్‌లు, ముఖ్యమైన అధికారుల వాహనాలు అసెంబ్లీ ఆవరణలో పార్క్ చేయాలంటే సాధ్యం కావటం లేదు. ఇక సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుండే శాసనసభ, శాసనమండలికి సిబ్బంది సమస్య ఉంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఉభయసభల్లో 845 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా విభజన అనంతరం ఏపీ చట్ట సభలకు 490 మంది సిబ్బంది ఉండాలి. అయితే విభజన చట్టం ప్రకారం విభజన సమయానికి చట్ట సభల్లో ఉన్న ఉద్యోగుల్లో 160 మందిని ఏపీ సభలకు కేటాయించారు. వారిలో ఎక్కువ మంది తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వటంతో చాలామంది అక్కడే ఉండిపోయారు. ప్రస్తుతం 70 మంది ఉద్యోగులు, 40 మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉభయసభల విధులు నిర్వహిస్తున్నారు. విభజన సమయం నుండి ఏపీ శాసనసభకు ఇప్పటివరకు కార్యదర్శి లేరు. ఇన్‌ఛార్జిల ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఉభయసభలలో 22 మంది తెలుగు రిపోర్టర్లకు 12 మంది, 12 మంది ఇంగ్లీష్ రిపోర్టర్లకుగాను ఇద్దరు ఉన్నారు. వీరికి తోడు సెక్షన్ ఆఫీసర్లు, ఏఎస్‌ఓలు, అదనపు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, క్లర్కుల పోస్టులు నాల్గవ తరగతి ఉద్యోగ ఖాళీలు ఉన్నాయి. 490 మంది చేయాల్సిన పనిభారం మొత్తం ప్రస్తుత సిబ్బంది మోస్తున్నారు. ఇక భారతదేశంలోని చట్టసభల్లో ఉన్న గొప్ప లైబ్రరీల్లో ఉమ్మడి ఏపీ శాసనసభ లైబ్రరీ ఒకటని చెప్పుకుంటారు. ఆ లైబ్రరీలో ఎన్నో విలువైన గ్రంధాలు ఉన్నాయి. అయితే ఆ లైబ్రరీలో ఏపీకి రావాల్సిన గ్రంధాలు ఇప్పటివరకు చేరలేదు. వాటన్నింటినీ జిరాక్స్‌లు చేసి లైబ్రరీ ఏర్పాటు చేయాలన్న సూచనలను స్పీకర్ కోడెల శివప్రసాదరావు వెలగపూడి అసెంబ్లీ భవన ప్రారంభ దినాల్లోనే చేశారు. ఇప్పటివరకు లైబ్రరీ ఏర్పాటుకు అవసరమైన గ్రంధాల సేకరణ జరగలేదు. అలాగే సిబ్బంది కోసం ప్రత్యేక క్యాంటీన్ అవసరం. ప్రస్తుత అసెంబ్లీ ఆవరణలో క్యాంటిన్ ఏర్పాటు చేసే పరిస్థితులు కన్పించటం లేదు. టీ తాగాలంటే సచివాలయంలోని 3వ బ్లాక్‌కు వెళ్లాల్సిందే. అక్కడ ఇష్టం లేకపోతే మూడు కిలోమీటర్లు వెళ్లాలి. ఇలా అసెంబ్లీలో సమస్యలు తాండవిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అసెంబ్లీలో సిబ్బంది నియామకం, ఛాంబర్ల ఏర్పాటుతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని సభ్యులు కోరుతున్నారు.

హైకోర్టు ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

విచారణ జరిపింది. ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యారు. డీజీపీల సదస్సు ఉన్నందున డీజీపీ మాలకొండయ్యకు వ్యక్తిగత హాజరు నుంచి గతంలోనే మినహాయింపు నిచ్చింది. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కోడిపం దేలకు సంబంధించి ఎన్ని కేసులు నమోదయ్యాయి, నిందితులు ఎవరు, ఉభయ జిల్లాల్లో 806 చోట్ల జరిగిన కోడి పందేలను ఎవరు నిర్వహించారు అన్న దానిపై పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. వివరాలు సమర్పించేందుకు కొంత సమయం కావాలని సీఎస్, డీజీపీ కోరడంతో న్యాయ స్థానం అంగీకరించింది. గత ఏడాది పశ్చిమగోదావరి జిల్లాలో కోడిపందేలను అడ్డుకోవడంలో విఫలమైన తహశీల్దార్లు, ఎస్‌ఐలపై ఏం చర్యలు తీసుకున్నారో తెలపాలని కోర్టు ఆదేశించింది. కోడిపందేల నిర్వహణలో ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. బహిరంగంగా పందేలను ప్రోత్సహిస్తున్నారని వ్యాఖ్యా నించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. తదుపరి విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపును ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోరగా హైకోర్టు అనుమతించింది.

మరో 6 నెలలు ప్రత్యేకాధికారుల పాలనే

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలోని విశాఖ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు గుంటూరు, కర్నూలు, ఒంగోలు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లకు మరో ఆరు నెలలపాటు ప్రత్యేకాధికారుల పాలనను కొనసాగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులిచ్చింది. ఈ ఏడాది జూన్ 30 వరకు ప్రత్యేకాధికారులను కొనసాస్తూ మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్ కరికాల వలవెన్ ఆదేశాలిచ్చారు. అలాగే కందుకూరి మున్సిపాల్టీ, రాజంపేట, నెల్లిమర్ల, రాజాం నగర పంచాయతీలకూ ప్రత్యేకాధికారులను ఆరు నెలలపాటు కొనసాగించనున్నారు. గతంలో వీటికి ఆయా రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్‌డీఓ) స్పెషలాఫీసర్లుగా ఉండగా, వారి స్థానంలో మున్సిపల్‌శాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం స్పెషలాఫీసర్‌గా నియమించింది.

దేవాదాయశాఖలో కారుణ్య నియామకాలు

• అచేతనస్థితిలో ఉంటే కుటుంబ సభ్యులకు • ప్రభుత్వ ఉత్తర్వులు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా దేవాదాయశాఖలోనూ కారుణ్య నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం అంగీకరించింది. అచేతనస్థితిలో ఉన్న ఉద్యోగులు, అర్చకులు పదవీ విరమణ చేస్తే వారి కుటుంబ సభ్యులకు కారుణ్య విధానంలో ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు దేవాదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ మన్మోహన్ సింగ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవాదాయశాఖలోని రెగ్యులర్ అడ్మినిస్ట్రేటివ్ ఉద్యోగులు, ఆలయాలు, చారిటబుల్ ట్రస్టులలో, దేవాదాయశాఖ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు అచేతన స్థితిలో (మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్) ఉండి పదవీ విరమణ చేస్తే వారి కుటుంబ సభ్యులకు కారుణ్య విధానంలో ఉద్యోగాలు ఇస్తారు. ఆయా విభాగాల్లో ఉన్న ఖాళీల ఆధారంగానే నియామకాలు చేపడతామని ప్రభుత్వం స్పష్టం చేసింది.



రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ నిరసన నేడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశ వ్యాప్తంగా దళిత, మైనార్టీ, మహిళలపై బీజేపీ, ఆరెస్సెస్ మతోన్మాద శక్తుల దాడులకు నిరసనగా మంగళవారం నిరసన దినోత్సవాల్ని పాటించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రంగన్న పిలుపునిచ్చారు.విజయవాడ దాసరి భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని హరిస్తూ మదమెక్కిన మతోన్మాధులను పెంచి పోషిస్తోందని విమర్శించారు.దళిత, మైనార్టీ, మహిళల భావస్వేచ్ఛా వ్యక్తులపై దాడులు చేస్తూ పొట్టన పెట్టుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.హిందుత్వ మతోన్మాధాన్ని వ్యతిరేకిస్తూ వ్యాఖ్యలు చేసిన దబోల్కర్, కాల్బర్గిని దారుణంగా ఒకే పద్ధతిలో హత్య చేశారని పేర్కొన్నారు.ఇదే క్రమంలో ఇటీవల జర్నలిస్టు గౌరీ లంకేష్‌ను హత్యచేసి ప్రజాస్వామ్య వాదులకు హెచ్చరికలు జారీ చేశారని తెలిపారు.దేశవ్యాప్తంగా హిందూ మతాన్ని వ్యతిరేకించిన వారందర్నీ వరుస వారీగా బీజేపీ, ఆరెస్సెస్ శక్తులు హతమారుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ దాడుల నుంచి దేశాన్ని పరిరక్షించాలనే నినాదంతో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమన్ని ఏఐఎస్ఎఫ్ శ్రేణులు, విద్యార్థులు జయప్రదం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర కార్యదర్శి చరణ్, నగర నాయకులు మల్లేష్ ప్రసన్న పాల్గొన్నారు.

పీఏసీఎస్ పాలకవర్గాల పదవీకాలం ఆరు నెలలు పొడిగింపు

ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్), జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌లు (డీసీసీబీ)లతోపాటు ఆప్కాబ్ పాలకవర్గాల పదవీకాలాన్ని మరో ఆరు నెలలుపాటు ప్రభుత్వం పొడించింది. ఇటీవల సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు సహకార పాలకవర్గాల పదవీ కాలన్ని ఆరు నెలలపాటు పొడిగించింది. ఈ మేరకు వ్యవసాయ, సహకారశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని సహకార సంఘాలకు 2013 జనవరి 31, ఫిబ్రవరి నాలుగు తేదీలలో ఎన్నికలు జరిగాయి. అలాగే అదే ఏడాది ఫిబ్రవరి 18న తొమ్మిది డీసీసీబీలు కొలువుదీరగా, ఫిబ్రవరి 27న ఆప్కాబ్ పాలకవర్గం ఏర్పడింది. ఈ నేపథ్యంలో పీఏసీఎస్ పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 31, ఫిబ్రవరి మూడో తేదీతో ముగియనుండగా, తొమ్మిది డీసీసీబీల కాలం ఫిబ్రవరి 17, ఆప్కాబ్ పాలకవర్గం పదవీకాలం ఫిబ్రవరి 26తో ముగియనున్నాయి. సహకార చట్టంలో సవరణలు తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు వెళ్లేకంటే పాలకవర్గాల పదవీకాలాన్ని ఆరు నెలలపాటు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే వ్యవసాయ, సహకారశాఖ పాలకవర్గాల పదవీకాలాన్ని ఆరు నెలలపాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1,900 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని అన్ని పీఏసీఎస్‌లను మూడేళ్లలో కంప్యూటరీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలంటే పాలకవర్గాలను కొనసాగించటమే మేలని నిపుణులు ప్రభుత్వానికి నివేదించారు. నాబార్డు నిబంధనల ప్రకారం అన్ని రికార్డులు కంప్యూటీకరించాల్సి ఉంది. అలాగే పీఏసీఎస్‌లో ఖాతాలను అప్‌గ్రేడ్ చేయాలని ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో సహకార చట్టం 1964 ప్రకారం పాలకవర్గాల పదవీకాలాన్ని ఆరు నెలలపాటు ప్రభుత్వం పొడిగించింది.

ఫ్యాప్టో ధర్నాలు విజయవంతం - ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపా ధ్యాయ సంఘాల(ఫ్యాప్టో) ఆధ్వర్యాన సోమ వారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు విజయవంతమైనట్లు రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.జోసెఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగులో వున్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా దశల వారీగా ఆందోళనలు నిర్వహిం చామన్నారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడ కోసం ఐక్యంగా ఉద్యమించామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యా యుల సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. లేకుంటే తమ ఆందోళనల్ని ఉధృతం చేస్తామని ఎస్టీయూ నేతలు హెచ్చరించారు.

రైతు సాధికార సంస్థ అదనపు డైరెక్టర్‌గా విజయకుమార్

విశాలాంధ్ర అమరావతి : రైతు సాధికార సంస్థ అదనపు డైరెక్టర్‌గా వ్యవసాయశాఖ సలహాదారుడు టి. విజయకుమార్‌ను నియ మిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏర్పాటైన రైతు సాధికార సంస్థకు అదనపు డైరక్టరుగా నియమిస్తూ వ్యవసాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఈమేరకు ఉత్తర్వులు జారీచేశారు.

ప్రకృతి సాగుకు ప్రపంచ గుర్తింపు

వృద్ధి రేటు 15శాతం సాధనే లక్ష్యంగా పనిచేయాలి

నీరు-ప్రగతి,వ్యవసాయంపై టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రంలో చేపట్టే ప్రకృతి వ్యవసాయ విధానానికి ప్రపంచ గుర్తింపు లభిం చిందని సీఎం చంద్రబాబు చెప్పారు. సోమవారం తన నివాసం నుంచి నీరు-ప్రగతి, వ్యవసాయం పురోగతిపై ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఇటీవల జరిగిన దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో 'వ్యవసాయం-ఆహార భద్రత'పై ఫలప్రదమైన చర్చ జరిగిందని చంద్రబాబు తెలిపారు. పెట్టుబడులు లేని ప్రకృతి వ్యవసాయంలో ఆంధ్రప్రదేశ్ నమూనా ప్రపంచ దృష్టిని ఆకర్షించిందన్నారు. ప్రపంచంలో మేలైన విధానాలు,మెరుగైన పద్ధతులను అధ్యయనం చేసి వాటిని రాష్ట్రానికి తెస్తున్నామన్నారు. 'సకాలంలో సాగునీరు అందించాం, తొలకరికే సేద్యం పనులు ప్రారంభించాం,అందుకే పంట దిగుబడులు పెంచ గలిగాం. ఈ ఏడాది వర్షాభావాన్ని అధిగమించి రాయలసీమ రైతాంగానికి సాగునీరు అందించడం సంతృప్తిగా ఉంది' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈ ఏడాది వేరుశనగ దిగుబడులు గణనీయంగా పెరిగాయంటూ వేరుశనగ, మినుము, అపరాల రైతులకు మద్దతు ధర లభించేలా చూడాలన్నారు. పెరుగుతున్న పంట దిగుబడులను దృష్టిలో ఉంచుకుని జిల్లాల్లో గోడౌన్ల అందుబాటుపై కలెక్టర్లు శ్రద్ధ వహించాలన్నారు. ఎక్కడెక్కడ ఎంత విస్తీర్ణంలో గోడౌన్ల సదుపాయం ఉందో, ఎంత పెంచవచ్చో నివేదిక రూపొందించాలన్నారు.ఆక్వాలో కాలుష్యం బెడదను పూర్తిగా నిర్మూలించాలన్నారు.కాలుష్యం కారణంగా మన ఆక్వా ఉత్పత్తులకున్న ప్రాధాన్యత తగ్గే ప్రమాదం ఉందని, అజాగ్రత్తగా ఉంటే వృద్ధిరేటుపై గణనీయ ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ఈ ఏడాది తొలి అర్ధసంవత్సరంలో 11.5% వృద్ధి సాధించాం, 62% ప్రజల్లో సంతృప్తికి చేరుకున్నాం. ఈ స్ఫూర్తిని ఇదేవిధంగా కొనసాగించాలని కోరారు. 15శాతం వృద్ధి, 80శాతం ప్రజా సంత ృప్తి లక్ష్యంగా అందరూ పనిచేయాలి. సక్రమంగా పనిచేస్తే 15% వృద్ధి సాధించడం సులభమే" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. . గతనెలలో 5% సంతృప్తి ప్రజల్లో పెరిగిందని,ఏప్రిల్ నాటికి మరో 5% సంతృప్తి చెందేలా అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు పనిచేయాలని వారికి దిశానిర్దేశం చేశారు. అలాగే జనవరి 31లోపు జన్మభూమి వినతులన్నీ పరిష్కారం అయ్యేలా క ృషిచేయాలన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నిజం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 2016-17 ఎన్టీఆర్ గ్రామీణ ఇళ్ల నిర్మాణం 64శాతం మాత్రమే చేశారని ఇది 100% లక్ష్యం చేరుకోవాలన్నారు. వీటితోపాటు అంగన్ వాడి భవనాల నిర్మాణం వేగవంతం చేయాలని,నిర్మించిన ప్రతి అంగన్ వాడి భవనాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రస్తుతం దేశంలోనే నరేగా నిధుల వ్యయంలో 3వస్థానంలో ఉన్నామని, పనిదినాల సంఖ్య మరింతగా పెంచుకోవడం ద్వారా మొదటిస్థానానికి ఎదగాలని చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

స్ఫూర్తిదాత గాంధీజీ

మనదేశ స్వాతంత్ర్యోద్యమ నిర్మాత, అనేక దేశాలలో విముక్తి ఉద్యమాలకు స్ఫూర్తిదాత మహాత్మా గాంధీజీ అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. జనవరి 30న మహాత్ముని వర్ధంతి సందర్భాన సీఎం చంద్రబాబు పూజ్య బాపూజీని స్మరించుకున్నారు. దక్షిణాఫ్రికాలో శ్వేతజాతి దురహంకార వ్యతిరేక పోరాటాలకు, లాటిన్ అమెరికాలో అనేక విముక్తి ఉద్యమాలకు మహాత్మాగాంధీ అహింస, సత్యాగ్రహ సిద్ధాంతాలే స్ఫూర్తినిచ్చాయని చంద్రబాబు తెలిపారు. ఇరవయ్యో శతాబ్దంలో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన వ్యక్తుల్లో గాంధీజీ అగ్రగణ్యులన్నారు. సత్యాగ్రహం, అహింస ఆయుధాలుగా పోరాడి శాసనోల్లంఘన, సహాయనిరాకరణ ఉద్యమాలకు దిశానిర్దేశం చేశారని, ప్రపంచాన్నే ప్రభావితం చేశారని చంద్రబాబు చెప్పారు. నాడు అమెరికాలో మానవ హక్కుల ఉద్యమనేత మార్టిన్ లూథర్ కింగ్ నుంచి నిన్నటి అమెరికా అధ్యక్షుడు బారక్ ఒబామా దాకా మహాత్ముడు ఎందరికో స్ఫూర్తినిచ్చారన్నారు. ఇటువంటి ఒక వ్యక్తి నిజంగా మనమధ్య జీవించారంటే రాబోయే తరాల వారు నమ్మలేరు అని ఆల్బర్ట్ ఐన్ స్టీన్ వ్యాఖ్యానించారన్నారు. తాను గత ఏడాది అమెరికాలో పర్యటించినప్పుడు డాలస్‌లో మహాత్మాగాంధీ మెమోరియల్‌ను సందర్శించానని ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. భారతదేశం గ్రామాల్లో నివసిస్తుందన్న గాంధీజీ గ్రామాలు స్వయం పోషకత్వం సాధించాలని కలలుగన్నారని చెప్పారు. ఆధునిక కాలంలో గ్రామీణాభివృద్ధికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ప్రతి కుటుంబం నెలకు రూ. 10 వేల ఆదాయంతో మెరుగైన జీవనప్రమాణాలు సాధించేందుకు కృషి చేస్తోందని చంద్రబాబు అన్నారు.



జెట్ స్పీడ్‌తో ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టులు

సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాజధానిలో నిర్మిస్తున్న ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టులను జెట్ స్పీడ్‌తో పూర్తి చేయాలని సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. సోమవారం స్థానిక సీఆర్‌డీఏ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. రాయపూడి సమీపంలోని ప్యాకేజ్-1లో ఎమ్మెల్యేలు, ఆలిండియా సర్వీసు అధికారుల నివాసాల ప్రాజెక్టు పనులు, నేలపాడులో ప్యాకేజీ-2లో ఎన్జీవోల నివాసాల పనులు, ప్యాకేజీ-3లో గెజిటెడ్, క్లాస్-4 నివాసాల పనులను చేపట్టిన షాపూర్జీ పల్లోంజీ, ఎల్‌అండ్‌టీ నిర్మాణ పనుల ప్రగతిని కమిషనర్ సమీక్షించారు. మార్చి 10వ తేదీ కల్లా 3 ప్యాకేజీల ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టులకు మొదటి అంతస్తు శ్లాబ్‌లు వేయాలని ఆయా కాంట్రాక్టు సంస్థలకు స్పష్టం చేశారు. ఎలక్ట్రికల్ లైన్ షిఫ్టింగ్, వాటర్, అప్రోచ్ రోడ్లు తదితర పనులన్నీ తక్షణమే పూర్తి చేయాలని, ఆయా డిజైన్లను ఫిబ్రవరి 3లోగా ఇవ్వాలని ఆదేశించారు. ఎల్పీఎస్ లేఅవుట్ల అభివృద్ధి పనులను, రోడ్ లెవలింగ్, ప్రాజెక్ట్ ఆఫీస్‌ల ఏర్పాటు, మిషనరీ సమకూర్చుకోవడం తదితర అంశాలపైనా చర్చించారు. ఈ సమావేశంలో సీఈలు ఎం.ఎ.షకూర్, టి.ఆంజనేయులు, జక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మిత్రధర్మం పాటిస్తున్నాం.. : మంత్రి మాణిక్యాలరావు



విశాలాంధ్ర అమరావతి : మేము కూడా మిత్రధర్మం పాటిస్తున్నామని దేవా దాయ, ధర్మాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు పేర్కొన్నారు. సోమవారం వెలగపూడి సచివాలయం తన ఛాంబర్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడారు. టీడీపీ, బీజేపీ మధ్య తలెత్తిన వివాదలను పరిష్కరించుకొంటామన్నారు. తమ పార్టీ నేతలను అదుపు చేస్తామని టీడీపీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారన్నారు . అందువల్ల తాము కూడా తమ పార్టీ నేతలను అదుపు చేస్తామని, ఇకపై ఎలాంటి విభేదాలు లేకుండా కలిసి పనిచేస్తామని మంత్రి స్పష్టం చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖా పేరు మార్పు చేసేందుకు కృషి చేస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి మాణిక్యాలరావు వెల్లడించారు. ఆయనప్రస్తుతం ఉన్న శాఖ పేరు ను దేవదాయ ధర్మదాయ శాఖ గా పేరు మార్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని మంత్రి తెలిపారు. అదేవిదంగా ఉద్యోగుల మెడికల్ పరిస్థితులను బట్టి కుటుంబ వారసత్వ ఉద్యోగాలు ఇచ్చేందుకు చర్యలు చేపడున్నట్లు మంత్రి వెల్లడించారు. దివ్యదర్శనం పేరుతో ప్రస్తుతం 50 వేల మంది భక్తులకు ప్రముఖ దేవాలయాల్లో ఉచిత దర్శనం ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు.రాబోయే రోజుల్లో దీనిని 1 లక్ష 50 వేలకు పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.ప్రముఖ దేవాలయాల్లో దర్శనం ఆలస్యం కాకుండా కేవలం అర్థ గంటలో దర్శనం చేసుకొనే ఏర్పాటు గురించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి వివరించారు.తితిదే లో రోజుకు 70 వేలమంది భక్తులు దర్శనం కోసం వెళ్తున్నారు.ఈ దర్శనల్లో కూడా మార్పులు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.సాధారణమైన భక్తులు దేవుని దర్శించాలన్నదే నా సంకల్పమని మంత్రి అన్నారు.సాంకేతిక పరిజ్ఞాన్ని వినియోగించుకొని అందరికి దర్శన భాగ్యం కల్పించేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు.పదేపదే తిరుమలకు వెళ్ళే వాళ్ళను తగ్గించి ప్రతి సామాన్యమైన భక్తుడు దేవుని దర్శించుకునే ఏర్పాట్ల గురించి చర్చిస్తున్నట్లు మంత్రి వివరించారు.అందుకు మీడియా వారు,అధికారులు,భక్తులు,ప్రజలు సలహాలు సూచనలు ఇస్తే వాటిని కూడా అమలు చేస్తామని మంత్రి తెలిపారు.

గ్రూప్-1లో భారీ మార్పులు

ప్రిలిమ్స్‌లో రెండు పేపర్లు

మెయిన్స్‌లో సంస్కరణలు

ఇంటర్వ్యూకు 100 మార్కులు

కసరత్తులో ఏపీపీఎస్సీ..!

నూతన విధానాలతో అభ్యర్థుల గాబరా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూప్-1 పరీక్షలలో భారీ మార్పులకు ప్రభుత్వం కసరత్తు ఆరంభించింది. యూపీఎస్సీ స్థాయిలో సిలబస్, పరీక్షా విధానాన్ని విస్తృతంగా రూపొందించే దిశగా అధికారులు సిద్ధమైనట్లు తెలిసింది.

ఇప్పటివరకూ గ్రూప్-1 పోస్టులకు ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలను మూడు దశల్లో నిర్వహించి ప్రతిభ ఆధారంగా అభ్యర్థుల్ని ఎంపిక చేస్తున్నారు. ఇక నుంచి గ్రూప్-1 పరీక్ష రాయాలంటే యూపీఎస్సీ పరీక్షల స్థాయి కన్పించనుంది. ఏపీపీఎస్సీ కమిషన్ చైర్మన్ ఉదయ్‌భాస్కర్ నేతృత్వాన పరీక్షల నూతన విధానం, మార్పులపై ప్రతిపాదించినట్లు తెలిసింది. నూతన ప్రతిపాదనల్ని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లే ఆలోచనలో అధికారులున్నారు. రాబోయే నోటిఫికేషన్లకు నూతన విధానాన్ని అనుసరించే అవకాశముంది. ప్రస్తుతం గ్రూప్-1 పరీక్షలను ప్రిలిమ్స్-పేపర్-1(150 మార్కులు), పేపర్-2 మెయిన్స్ విభాగంలో 6 పేపర్లు(650 మార్కులు) విధానం ఉంది.

మరో 75 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహించే వారు. కొత్త విధానంలో ప్రిలిమ్స్ పరీక్షలో రెండు పేపర్ల ప్రతిపాదనను తెరపైకి తెస్తున్నారు. ఒక్కో పేపరుకు 200 మార్కుల చొప్పున, మెయిన్స్‌లో 6 పేపర్లను 150 మార్కుల చొప్పున మొత్తంగా 900 మార్కులకు ప్రతిపాదించినట్లు సమాచారం. మౌఖిక పరీక్ష(ఇంటర్వ్యూ)కు 100 మార్కులు పెంచనున్నారు.

ఆంగ్లంలోనూ మార్కులు రావాల్సిందే..!

ఏపీపీఎస్సీ నూతన విధానాలతో ఇక నుంచి మెయిన్ పరీక్షలోని ఆంగ్ల మార్కులనూ పరిగణిలోకి తీసుకుంటారు. గత విధానంలో అభ్యర్థులు అర్హత సాధిస్తే సరిపోయేది. నూతన విధానంలో మార్కుల స్కోరింగ్ చూస్తారు. ఇది తెలుగు మీడియంలో చదివిన అభ్యర్థులకు ఇబ్బందికరంగా మారనుంది. ఈ కొత్త విధానంలో ఏపీపీఎస్సీ పరీక్షల స్వరూపం మొత్తం మారిపోనుంది. అభ్యర్థులు నూతన విధానంతో కూడిన పరీక్షలకు సిద్ధమవ్వాలంటే అధికంగా కష్టపడాల్సి ఉంది. పేపర్-1 ప్రిలిమ్స్‌లో రెండు సబ్జెక్టులను కేటాయించడం అభ్యర్థులకు మరింత భారం కానుంది. ప్రణాళికా బద్ధంగా పరీక్షలకు సన్నద్ధమవ్వని అభ్యర్థులంతా ప్రిలిమ్స్ పరీక్షతోనే ఆగిపోతారు. పేపర్-1లో భారత ఆర్థిక వ్యవస్థ, ప్లానింగ్, భౌతిక శాస్త్రం, అంతర్జాతీయ వర్తమాన అంశాలు తదితర అంశాలపై సిలబస్ ఉంటుంది. పేపర్-2 మెయిన్స్‌లో ప్రస్తుతమున్న సిలబస్‌కు అదనంగా కలిపే అవకాశముంది. ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్ని తెలుగు మాధ్యమంలో రాసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. దీంతో తెలుగు మాధ్యం అభ్యర్థులకు కొంత వెసులుబాటు కలుగుతుంది.

నూతన విధానాలతో అభ్యర్థుల ఆందోళన

ఏపీపీఎస్సీ పరీక్షల్లో నూతన విధానాలతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతమున్న పాత విధానాన్నే కొనసాగించాలని వారు కోరుతున్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో రెండు పేపర్ల విధానంతో తీవ్ర నష్టానికి గురవుతామని వాపోతున్నారు. ఏపీపీఎస్సీ కొత్త నోటిఫికేషన్ల జారీలో తీవ్ర జాప్యం నెలకొంది. ఏడాది ప్రారంభమైనప్పటికీ నూతన క్యాలెండరును కమిషన్ కార్యాలయం వెల్లడించలేదు. గత ఏడాది నుంచి క్రమం తప్పకుండా క్యాలెండరును విడుదల చేస్తామని ఏపీపీఎస్సీ కమిషన్ ప్రకటించిన విషయం విదితమే. 2016 క్యాలెండరులో విడుదల చేసిన పోస్టుల భర్తీ కొలిక్కి రాలేదు. కొత్త నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగ యువత ఎదురు చూస్తోంది. విజయవాడ, హైదరా బాద్, విశాఖపట్నాలలో అభ్యర్థులు ఆర్నెల్ల నుంచి గ్రూపు పరీక్షల కోసం శిక్షణ పొందుతున్నారు. అధికారులు స్పందించి కొత్త క్యాలెండరును విడుదల చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

బొండా ఉమాపై అనర్హత వేటు వేయాలి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయ వాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు అక్రమాలు, భూకబ్జాలపై సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి అనర్హత వేటు వేయాలని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి డిమాండు చేశారు. సోమవారం వాక్‌విత్ జగన్ ప్రోగ్రామ్‌లో పాల్గొనేం దుకుగాను ఆమె విజయవాడ విచ్చేశారు. ఈ సందర్భంగా ఐలాపురంలో వైసీపీ విజయవాడ నగర ప్రెసిడెంట్, వర్కింగ్ ప్రెసిడెంట్లు వెలంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణుతో కలిసి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. అసెంబ్లీలో మహిళలపై బోండా కించపరిచేలా వ్యవహరిం చినా చంద్రబాబు మౌనంగా వున్నారని మండిపడ్డారు. విజయవాడలో భూకబ్జాలపై చంద్రబాబు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. గతంలో సుమశ్రీ కేసులో క్యాన్సర్‌తో బాధపడే చిన్నారని వుందని చూడకుండా ఒక అపార్టుమెంటును కబ్జాకు ప్రయత్నించారని గుర్తుచేశారు. విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని)తో కలిసి ఐపీఎస్ అధికారి సుబ్రహ్మణ్యంపై దాడికి ప్రయత్నించారని, ఆ తర్వాత చంద్రబాబు రంగంలోకి దిగి సెటిల్ చేశారని వివరించారు. బోండా ఉమా కుమారుడు రవితేజ తండ్రికి తగ్గ తనయుడుగా కారు రేసుల్లో ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసి ఒకరు చనిపోయేందుకు కారకుడయ్యారని పేర్కొన్నారు. పోలీసులు తక్షణమే స్పందించి ఎమ్మెల్యే బోండాపై కేసులు నమోదు చేయాలని డిమాండు చేశారు. ఈయన చెరలో ఉన్న భూమిని తిరిగి స్వాతంత్ర్య సమరయోధుడి కుటుంబానికి ఇప్పించాలని కోరారు. సీఎం నాలుగేళ్ల పాలన అవినీతి, అక్రమాలకు నిలయంగా మారిందని మండిపడ్డారు. ఈ విలేకరుల సమావేశంలో పలువురు వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



కోటీశ్వరుల కాఫీ క్లబ్బులుగా చట్ట సభలు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ

విశాలాంధ్ర-వినుకొండ : పేద, బడుగు జీవులకు బాసటగా నిలవాల్సిన చట్ట సభలు నేడు కోటీశ్వరుల కాఫీ క్లబ్బులుగా రూపాంతరం చెంది ప్రజాస్వామ్య వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. అమరజీవి పఠాన్ ఖాశింఖాన్ విగ్రహావిష్కరణ కార్యక్రమం సోమవారం శివయ్య స్థూపం వద్ద జరిగింది.

ముప్పాళ్ల విగ్రహావిష్కరణ గావించారు. పార్టీ సీనియర్ నాయకులు ఎస్.సైదా అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ముప్పాళ్ళ మాట్లాడుతూ చట్టసభల్లో రానురాను కోటీశ్వరుల హవా పెరిగిందని ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ధనవంతులు రాజ్యమేలితే పేదల సమస్యలు పరిష్కరించే దిక్కెవరంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో బీజేపీకి దూరం అంటూ ప్రకటిస్తూనే తిరిగి ఆ పార్టీతో అంటకాగడం దిగజారుడుతనమన్నారు. రాష్ట్ర విభజన సందర్భంలో హోదా కోసం తొలిసారి గళం విప్పిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలు విస్మరించి ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. పట్టణంలో సీపీఐ నాయకునిగా ఖాశింఖాన్ సేవలు నేటి తరం నాయకులకు స్ఫూర్తిదాయకమన్నారు.

సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ సీపీఐ విధానాలకు పట్టం కట్టిన నేతగా ప్రజల హృదయాల్లో నిలిచిన మహానాయకుడు ఖాశింఖాన్ అన్నారు.ఎమ్మెల్యే జీవి మాట్లాడుతూ పేదలకు నివాసాలు ఏర్పాటు చేసి ఆదుకోవడంతో పాటు పట్టణాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు.డీసీసీ చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావు మాట్లాడుతు వినుకొండలో మతసామరస్యానికి బాటలు వేసి, పట్టణాన్ని అభివృద్ధి బాటలో నడిపిన ఖాశింఖాన్ రాజకీయాల్లోను, ప్రజల్లోను తలలో నాలుకలా వ్యవహిరించేవారన్నారు. వైసీపీ నేత నేత బొల్లా బ్రహ్మనాయుడు, ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకుడు పి.సాంబశివరావు, సీపీఐ వినుకొండ ఏరియా కార్యదర్శి ఎ.మారుతివరప్రసాద్, పి.లాల్‌ఖాన్, టీవీ 9 డైరెక్టర్ వి.చెన్నకేశవులు, కె.శివరామకృష్ణ, బి.శ్రీనివాసరావు, షేక్ సిలార్, పి.జె.లూకా, ఎల్ఎన్.మూర్తి, జి.సాంబశివరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.సుబ్బారావు, బి.చిన్నా, సాంబశివరావు, వెంకటేశ్వర్లు, షమీమ్‌ఖాన్, ఆయూబ్‌ఖాన్, జి.కాలేషా, ఎం.రామతులసిరెడ్డి, సీనియర్ నాయకులు సీహెచ్.కాంతారావు, న్యాయవాద సంఘం అధ్యక్షుడు ఎం.జ్ఞానేశ్వరరావు, న్యాయవాది ఎంఎన్.ప్రసాద్, సీఆర్ మోహన్, యు.రాము, తదితరులు ఖాశింఖాన్‌కు జోహార్లు అర్పించారు.

అరకు వ్యాలీ కాఫీ రుచి అదుర్స్

మంత్రులు నక్కా ఆనందబాబు, జవహర్

విశాలాంధ్ర అమరావతి : అరకు వ్యాలీ కాఫీ రుచి అద్భుతమని, అటువంటి ఇన్ స్టంట్ కాఫీని సేవించి, రుచిని ఆస్వాదించి, గిరిజనులను ఆదుకోవాలని సాంఘీక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద బాబు అన్నారు. సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం ఎక్సైజ్ శాఖ మంత్రి కే.ఎస్ జవహర్‌తో కలసి అరకువ్యాలీ ఇన్ స్టంట్ కాఫీ 2 గ్రాములు, 10 గ్రాముల ప్యాకెట్లను మంత్రి మార్కెట్‌కు విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తులతోపాటు కాఫీ గింజలను సేకరించి, ప్రాసెసింగ్ చేయించి, మార్కెటింగ్ చేసి వచ్చిన లాభాలను వారికి అందించడమే గిరిజన సహకార సంస్థ(జీసీసీ) విధి అని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ, ప్రోత్సాహంతో 2014లో రూ.90 కోట్ల టర్నోవర్ ఉన్న జీసీసీ వ్యాపారం రూ.247 కోట్లకు చేరుకుందన్నారు. ఈ ఏడాది రూ.317 కోట్లు, వచ్చే రెండేళ్లలో రూ.500 కోట్లు లక్ష్యం అని తెలిపారు. మూడు ఏళ్ల నుంచి అరకు కాఫీకి ప్రాచుర్యం లభిస్తోందన్నారు. రెండు లక్షల ఎకరాల్లో కాఫీ సాగును ప్రోత్సహిస్తూ గిరిజనుల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు. గిరిజన ఉత్పత్తులను రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉంచడానికి రిటైల్ షాపులను ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో సచివాలయంలో కూడా ఒక షాపును ఏర్పాటు చేస్తామని మంత్రి ఆనందబాబు చెప్పారు. మంత్రి జవహర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అరకు కాఫీ రుచిని ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. గిరిజన కుటుంబాలు నెలకు రూ.10వేలు సంపాదించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాఫీ డీలర్లు అరకు వ్యాలీ ఇన్ స్టంట్ కాఫీ ప్యాకెట్ల కోసం అడ్వాన్స్ గా రూ.30 లక్షల రూపాయల చెక్‌ని మంత్రి ఆనందబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖ కమిషనర్ ఎం.రామారావు, వేహాన్ కాఫీ సంస్థ యజమాని శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పతిపక్షపాత్ర పోషిస్తున్న పవన్

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తన యాత్ర ద్వారా ప్రజా సమస్యలను ప్రభత్వం దృష్టికి తీసుకువస్తూ, సమస్యల పరిష్కార దిశగా ముందుకు సాగుతూ ప్రతిపక్షపాత్ర పోషిస్తున్నారని మంత్రి జవహర్ అన్నారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ వాక్ విత్ జగన్ అంటూ ఇచ్చిన పిలుపుతో ఆయన లాగా అందరు జైలుకు వెళ్లాలని కోరుకొంటు న్నాడన్నారు. దళితుల భూముల్ని కొల్లగొట్టిన వైస్ రాజశేఖర్ రెడ్డి, జగన్‌లకు తోడుగా రమ్మని పిలవడం పెద్ద మోసమన్నారు. విజయమ్మ జగన్‌ని ఆశీర్వదించమని అంటున్నారు. అది అతను ముఖ్యమంత్రి కావడం కోసమే తప్ప ప్రజలకోసం కాదని పేర్కొన్నారు. జనాల నెత్తిన చేతులు పెట్టడం, ఎదురువచ్చిన వారికి ముద్దులు పెట్టడం తప్ప జగన్ యాత్రలో ఇంకేమీ కనపడడం లేదన్నారు. వాక్ విత్ జగన్ అన్నది ట్రాఫిక్‌కి అనవసర అడ్డంకులు స ృష్టించడం తప్ప మరొకటి కాదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో జగన్ పార్టీ ఎంపీలు ప్రత్యేక హోదా కోసం ఎందుకు రాజీనామా చేయడం లేదని ప్రశ్నించారు. నిజానికి జగన్ చెయ్యాల్సింది ప్రజలకు క్షమాపణ చెప్పి, పాప పరిహార యాత్ర చేయాలన్నారు.



దళితులపై దాడులు చేయిస్తూ..

టీడీపీ దళిత తేజమా?

పీసీసీ ప్రధాన కార్యదర్శి మీసాల రాజేశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై టీడీపీ ప్రభుత్వం దాడులు చేయిస్తూ..మరోవైపు దళితతేజం కార్యక్రమానికి దిగడం దారుణమని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీసాల రాజేశ్వరరావు మండిపడ్డారు.విజయవాడ పీసీసీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గరగపర్రు, పెదగొట్టిపాడు, పెందుర్తి, దేవరపల్లి దళితులపై టీడీపీకి చెందిన పెత్తందారులు దాడులు చేయడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో దళితులపై దాడులు కొనసాగిన ప్రాంతాల్లో సీఎం చంద్రబాబునాయుడు నేరుగా పర్యటించాలని కోరారు.పెదగొట్టిపాడు సంఘటనపై ప్రతిపక్ష పార్టీ నేత జగన్ ఇంతవరకూ ఖండించకపోవడం విచారకరమని అన్నారు.ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్సీ,ఎస్టీల యువతకిచ్చిన హామీల్ని టీడీపీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని దుయ్యబట్టారు.ఈ సమావేశంలో పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వి.గుర్నాథం, కాంగ్రెస్ నాయకులు పి.నాంచారయ్య, విజయవాడ నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కెంబూరి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

సంపాదకీయం

ఈసీకి ఇంత పక్షపాతమా!

రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన ఏ వ్యవస్థ అయినా దాని విలువలను, స్ఫూర్తిని పరిరక్షించే విధంగా న్యాయపూరితంగా వ్యవహరించవలసిన చర్యలు తీసుకోవలసి వుంటుంది. అందుకు విరుద్ధంగా వ్యవహరించినట్లయితే ఆ వ్యవస్థ ప్రజల విశ్వసనీయతను కోల్పోతుంది. ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) ఎంఎల్ఏ ల విషయంలో ఎన్నికల సంఘం (ఈసీ) అత్యుత్సాహంతో, పక్షపాతంగా వ్యవహరించినట్లు కనిపిస్తోంది. పార్లమెంటరీ కార్యదర్శులుగా లాభదాయక పదవులు అనుభవిస్తున్నారన్న ఆరోపణలపై ఢిల్లీ శాసనసభలోని 20 మంది ఆప్ ఎంఎల్ఏలను అనర్హులుగా ప్రకటించాలని ఎన్నికల సంఘం సిఫార్సు చేసి ఏ చిన్న అవకాశం దొరికినా ఉపయోగించు కోవాలని చూసే మోడీ ప్రభుత్వానికి ఆయుధాన్ని అందించింది. రెండు రోజుల్లో పదవీ విరమణ చేయనున్న ఎన్నికల సంఘం ప్రధానాధికారి ఏకే జ్యోతి ప్రధాని మోడీ ప్రాపకం కోసం ఆప్ ఎంఎల్ఏలను అనర్హులుగా ప్రకటించాలని చేసిన సిఫార్సుకు రాష్ట్రపతి కోవింద్ ఆమోద ముద్ర వేయడంతో వారి అనర్హతపై కేంద్ర నోటిఫికేషన్ జారీ అయింది. ఎన్నికల సంఘం సిఫార్సులకు తలొగ్గి ఆప్ ఎంఎల్ఏలపై రాష్ట్రపతి అనర్హత వేటు వేయడంతో, ఆయన బీజేపీ, ప్రధాని మోడీ చెప్పినట్లు నడుస్తున్నారన్న అనుమానాలు తలెత్తాయి. ఉరిశిక్ష పడిన దోషికి కూడా ఆఖరి కోరిక వెలిబుచ్చడానికి అవకాశం కలుగజేస్తారు. కానీ లాభదాయక పదవులు కలిగి వున్నందున 20 మంది ఆప్ ఎంఎల్ఏలను అనర్హులుగా ప్రకటించాలని సిఫార్సు చేయడానికి ముందు వారి వాదనలను వినడానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించకపోవడం దురదృష్టకరం. దాంతో ఢిల్లీ హైకోర్టును ఆప్ ఎంఎల్ఏలు ఆశ్రయించారు. ఆప్ ఎంఎల్ఏలు దాఖలు చేసిన పిటిషన్‌లోని విన్నపం విచారణను ఢిల్లీ హైకోర్టు సోమవారం డివిజన్ బెంచ్‌కి బదిలీ చేసింది. జస్టిస్ విభు భక్రూ ఏకన్యాయమూర్తి బెంచ్ తాత్కాలిక హైకోర్టు ప్రధాన మూర్తి ముందు ఈ పిటిషన్‌పై నిర్ణయానికి మంగళవారాన్ని ఖరారు చేసింది. ఆయన నేడు పిటిషన్‌పై విచారణకు ఒక డివిజన్ బెంచ్‌ను ఏర్పాటు చేయవచ్చు లేదా ప్రస్తుతం వున్న ఏదేని డివిజన్ బెంచ్‌కి బదిలీ చేయవచ్చు. అయితే అనర్హత వేటుతో ఖాళీగా వున్న 20 అసెంబ్లీ స్థానాలను భర్తీ చేయడానికి ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయరాదని ఈ నెల 24న యిచ్చిన ఉత్తర్వును కూడా హైకోర్టు పొడిగించింది. ఎవరి అభ్యర్థన మేరకైతే 20 మంది ఆఫ్ ఎంఎల్ఏలపై అనర్హత వేటు పడిందో అదే న్యాయవాది ప్రశాంత్ పటేల్ ఈ వ్యవహారాన్ని డివిజన్ బెంచ్‌కి బదిలీ చేయాలని దరఖాస్తు పెట్టిన తరువాత ఢిల్లీ హైకోర్టు ఆప్ ఎంఎల్ఏల పిటిషన్ డివిజన్ బెంచ్‌కి బదలాయించింది. ఆప్ ఎంఎల్ఏల తరపు సీనియర్ న్యాయవాది కేవీ విశ్వనాథన్ అనర్హత వేటు పడిన ఆప్ ఎంఎల్ఏల పిటిషన్‌ను ఏకన్యాయమూర్తి బెంచ్ విచారించవచ్చని వాదించినప్పటికీ లాభం లేకపోయింది. పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించిన 20 మంది ఎంఎల్ఏలు ద్రవ్య ప్రయోజనాలు పొందకుండా ఉచితంగా పని చేస్తున్నారని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ స్పష్టం చేసినప్పటికీ, ఢిల్లీ హైకోర్టు ఈ నియామకాలను పక్కనపెట్టడంతో ఆప్ ఎంఎల్ఏలపై కేసు బలపడింది. పార్లమెంటరీ కార్యదర్శి పదవి కేబినెట్ మంత్రి హోదాతో సమానం.

సహజంగా అసమ్మతి శాసనసభ్యులను బుజ్జగించడాన్ని అధికార పార్టీలు అటువంటి నియామకాలు చేపడతాయి. కేజ్రీవాల్ కూడా అదే చేశారు. గతంలో 2005లో హిమాచల్ ప్రదేశ్, 2009లో గోవాలో, 2015లో పశ్చిమ బెంగాల్, తెలంగాణలో పార్లమెంటరీ కార్యదర్శుల నియమకాలు కొట్టివేయబడ్డాయి. అయితే, "లాభదాయక పదవి" క్లాజు నుండి పార్లమెంటరీ కార్యదర్శి పదవిని మినహాయిస్తూ అనేక రాష్ట్రాల్లో చట్టం సవరించబడింది. ఢిల్లీలో ఈ విధమైన ముందు జాగ్రత్త చర్య అమల్లో లేకపోవడం, ఆప్ నాయకత్వం అమల్లో వున్న పద్ధతులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం మోడీ సర్కారుకు అందివచ్చిన అవకాశంగా మారింది. ఢిల్లీ శాసనసభ్యుల (అనర్హత తొలగింపు) చట్టం, 1997కి రాష్ట్రపతి ఆమోదం లభించకపోవడం వల్ల 20 మంది ఆప్ ఎంఎల్ఏలు అనర్హతవేటు ప్రమాదంలో వుండిపోయారు.

అయితే, 20 మంది ఎంఎల్ఏలపై అనర్హత వేటు పడినప్పటికీ ఆప్ ప్రభుత్వ మెజారిటీకి అసెంబ్లీలో ఎట్టి ప్రమాదం లేదు. ఉన్నత న్యాయవ్యవస్థ నుండి ఆప్‌కు ఊరట లభించకపోయినట్లయితే, 20 శాసనసభ నియోజకవర్గాల్లో కేజ్రీవాల్ ప్రభుత్వం స్వయంగా రిఫరెండంకు లోబడి వుండవలసి వస్తుంది. 2015లో ఆప్‌కు భారీ మెజారిటీ లభించడంతో కాంగ్రెస్, బీజేపీల పని అయిపోయిందని కేజ్రీవాల్ అతిగా ఊహించు కొన్నారు. అయితే, ఆ రెండు పార్టీలు నిర్విరామంగా ఆప్‌ని వ్యతిరేకిస్తూ, అవకాశం కోసం ఎదురు చూస్తేనే వున్నాయి. కొత్తగా ఏర్పడిన ఆప్ పార్టీ ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రజల్ని కూడా నిరుత్సాహానికి గురి చేసింది. అయితే, ఆ పార్టీ రాజకీయ మూర్ఖత్వాలను దాని ప్రత్యర్థులు రాజ్యాంగాన్ని దుర్వినియోగపర్చేందుకు లైసెన్సుగా చూడకూడదు. ఈసీ నిర్ణయం చట్టానికి అనుగుణంగా జరిగిందా లేదా అన్నది నిర్ణయించాల్సింది కోర్టులు. ఈ విషయంలో తక్షణ చర్చకు మించి 2015 నుండి మోడీ ప్రభుత్వం కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని నిర్వీర్యపర్చడానికి చేసిన ప్రయత్నాలను కూడా దృష్టిలో పెట్టుకోవలసి వుంటుంది. వివిధ రాష్ట్రాల్లో బీజేపీ యేతర ప్రభుత్వాలను నయానో భయానో తన దారిలోకి తెచ్చుకోడానికి మోడీ సర్కారు చేసిన ప్రయత్నాలను ప్రజలు మర్చిపోకూడదు. వివిధ రాష్ట్రాల్లో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన శాసనసభ్యులను అనర్హులుగా ప్రకటించాలని ప్రతిపక్ష పార్టీల విజ్ఞప్తులను పట్టించుకోని ఎన్నికల సంఘం ఆప్ ఎంఎల్ఏలను అనర్హులుగా ప్రకటించాలని సిఫార్సు చేయడం పలు అనుమానాలకు తావివ్వడమే కాక, ఈసీ చిత్తశుద్ధిని శంకించడానికి అవకాశమిచ్చింది. ఎన్నికల సంఘం నూతన ప్రధానాధికారి ఓంప్రకాశ్ రావత్ ఎన్నికల సంఘం ప్రతిష్ఠ దిగజారడాన్ని అరికడతారని ఆశిస్తున్నారు. రావత్ నేతృత్వంలో ఈశాన్య రాష్ట్రాలు, కర్నాటక, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘర్ శాసనసభ ఎన్నికలు జరుగనున్నాయి ఎన్నికల సంఘం ప్రధానాధికారిగా టి.ఎన్. శేషన్ వున్నకాలం నుండి బలీయమైన రాజ్యాంగబద్ధ కాపలాదారుగా ఎన్నికల సంఘం మారింది. ఏ ఎన్నికల ప్రధానాధికారి ఈసీ స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యపర్చేందుకు ప్రయత్నించలేదు. అయితే, ఏకే జ్యోతి అందుకు భిన్నంగా వ్యవహరించి అపప్రదను మూటగట్టుకున్నారని చెప్పక తప్పదు.

చురక

భారతీయ నాగరికతలో
బలం గొప్పతనమున్నది
భావజాల పునాదుల్లో
ప్రగతి కట్టబడుతున్నది

మోడీగారి మన్ కీ బాత్
ముచ్చటెంతో సుందరం
కూలుతుంది అన్యమతం
గోపురాల మందిరం

– వేల్పుల నారాయణ

ఛార్లెస్ డార్విన్ × సత్యపాల్ సింగ్

తోకల రాజేశం

"కోతుల్నే నా పూర్వీకులుగా ఆనందంతో అంగీకరిస్తాను" అని బ్రిటీషు శాస్త్రవేత్త థామస్ హాక్స్‌లీ ఒక సందర్భంలో అన్నాడు. అలా అన్నంత మాత్రాన హాక్స్‌లీ కిరీటం రాలిపోలేదు, రాలిపోలేదు. అదినిజం కాబట్టే ఆ మాటన్నాడు. ఛార్లెస్ డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం అందించిన జ్ఞానంతో ఆ మాటన్నాడు. ఆ సిద్ధాంతం నిజమని తేలిపోవటం వల్ల ఆనందంతో సత్యాన్ని ఒప్పుకున్నాడు. ఆయన శాస్త్రజ్ఞుడు కాబట్టి – శాస్త్రీయ జ్ఞానం వుంది కాబట్టి – శాస్త్రీయంగా రుజువైన సత్యాన్ని ఏ సంకోచం లేకుండా ప్రకటించాడు.

"ఓ వానరం మానవుడిగా పరిణామం చెందటం గురించి మన పూర్వీకు లెవరూ కూడా అటు లిఖిత పూర్వకంగా కానీ, ఇటు మౌఖికంగా కానీ ఎక్కడా పేర్కొనలేదు కాబట్టి – అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్యవా చెప్పిన కథలోనూ ఎక్కడా ఎలాంటి ప్రస్తావన లేదు కాబట్టి డార్విన్ జీవనపరిణామ సిద్ధాంతం శాస్త్రీయంగా తప్పని భారత మానవ వనరుల అభివృద్ధి శాఖా సహాయమంత్రి సత్యపాల్ సింగ్ ఒక సభలో అన్నాడు. ఒక సిద్ధాంతాన్ని ఖండించటానికైనా ఆ సిద్ధాంతానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకొని వుండాలన్న ప్రాథమిక జ్ఞానం. కూడా లేనివాడే ఇలా మాట్లాడుతాడు. ఒక సిద్ధాంతానికి సంబంధించిన సమాచారంలోని అసమగ్రత లేదా అస్పష్టతలాంటి వాటిని ఆధారంగా చేసుకొని సిద్ధాంత చర్చలు లేవదీస్తే దాన్ని అర్థం చేసుకోవచ్చు గానీ మన అమ్మమ్మలూ, నానమ్మలూ చెప్పిన కథల్లో దాని వివరణ లేకపోతే – ఆ సిద్ధాంతమే చెల్లదు పొమ్మనేంత జగదేక మూర్ఖులకు ఎవడు సమాధానం చెబుతాడు.?

DNA, RNA లాంటి సంక్లిష్టమైన విషయాలు గురించి చదువురాని మన అమ్మమ్మలకూ, తాతయ్యలకూ తెలియదు. వీటి ప్రస్తావన అందుకే వాళ్లు చేప్పే కథల్లో వుండదు. మన పూర్వీకుల రాతల్లో కూడా లేదు. అయితే ఇవి పచ్చి అబద్ధాలని శాసనం చేస్తారా మహాజ్ఞాని – మంత్రివర్యా? మన అమ్మమ్మలు, నానమ్మల చెప్పే కథల్లో పక్షులు, జంతువులు మాట్లాడతాయి అవి నిజంగానే ప్రపంచంలో అలా మాట్లాడుతున్నాయా? పదితలకాయలున్న రాక్షసులూ, పెద్ద పెద్ద పళ్లూ – కోరలు గల వింత ఆకారాల్లో ఊహా చిత్రాలు మన పూర్వీకులు రాసిన – చెప్పిన కథల్లో బండ్లకొద్దీ వున్నాయి. వాళ్ళ నెవ్వరైనా – ఎప్పుడైనా బయట చూసిన సందర్భాలున్నాయా? వాళ్లు చెప్పిన కథల్లో – రాసిన రాతల్లో వున్న పాత్రలే నిజమైన ప్రపంచంలో అస్తిత్వంలో లేనప్పుడు ఆ కథలకూ – రాతలకూ విలువ ఎంత? నీతి కథలు – పొడుపు కథలు దగ్గరికి వచ్చే సరికి అవి నెరవేర్చే సామాజిక బాధ్యత వేరు. మాయలూ – మంత్రాలూ, మానవాతీత శక్తులు గల కథలకు ఏనాటి సమాజంలోనైనా విలువలేదు. అవి ఎదుటివాళ్ళను ఆశ్చర్యంలో ముంచి – నీ ఊహాశాలిత్వాన్ని బయటపెట్టుకోవటానికి తప్ప దేనికీ పనికి రావు. ఇట్లాంటి పుక్కిటి పురాణాల్లాంటి కథల్లో చెప్పనంత మాత్రాన డార్విన్ సిద్ధాంతానికి శాస్త్రీయత లేనట్టా. ఒక సిద్ధాంతానికి శాస్త్రీయత మన అమ్మమ్మలూ, తాతయ్యలూ చెప్పే కథల్లోని ప్రస్తావనల వల్ల వస్తుందా? క్రైస్తవమతంలో వున్న విదేశీయులకు ఇక్కడి రామాయణ, మహాభారత కథలు తెలియవు. వాళ్లు వాళ్ల పిల్లలకు చెప్పే కథల్లో వీటి ప్రస్తావన ఏమీ వుండదు. ఇప్పుడక్కడి నుంచి సత్యపాల్‌సింగ్ లాంటి తెలివైన వాడొకడు వచ్చి మా కథల్లో వీటి గురించి లేదు కాబట్టి ఈ పుస్తకాలు చెల్లవని సవాలు విసిరితే ఈయనగారి సమాధానమెలా వుంటుందో మరి? నోటికి వచ్చినంత మాట్లాడేముందు దారిన పోయేవాడల్లా ఈ మాటలు విని నవ్వుతాడే మోనన్న కనీస స్పృహ అయినా ఉండనక్కర లేదా? అంటే ఈయన గారికి అమ్మమ్మలూ, నానమ్మలూ – తాతయ్యలూ చెప్పిన కథలే పరమ ప్రామాణికం. పూర్వీకులు చెప్పిందే వేదం. వ్యక్తిగత విషయాలకు సంబంధించినంతవరకు దీన్నెవరూ (పెద్దల మాటను) ఆక్షేపించరు కానీ ప్రపంచంలోని జ్ఞానమంతటికీ నిర్ణాయక శక్తులు వీళ్లే అనేలా మాట్లాడటం – పచ్చి అజ్ఞానం.

అయ్యగారు అంతటితో ఆగినా బాగుండేది. డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని తన అపార అజ్ఞానబలంతో తుత్తునియలు చేశానన్న వీరగర్వంతో – దీనికి సంబంధించి పాఠశాల, కళాశాలల కరిక్యులంను మార్చాల్సి వుందని కూడా ప్రకటించి పారేశాడు. అధికారం మదం అలా వుంటుంది మరి. ప్రపంచం ఒకవైపు శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం అందుకోలేనంత వేగంతో ముందుకు వెళుతుంటే మనం మాత్రం పాత కాలంలోనే అన్నీ సాధించేశాం అని కాళ్లు బార్లా చాపుకొని కూర్చుందాం. శాస్త్రజ్ఞులు మొహం మీద ఉమ్మితారన్న సిగ్గు కూడా లేకుండా అశాస్త్రీయంగా మాట్లాడుతూ ప్రజలను ఇంకా అజ్ఞానంలోనే ముంచుదాం.

"450 కోట్ల సంవత్సరాల కిందట భూమి ఏర్పడింది. 200 కోట్లు ఏళ్ల విపరీతమైన వేడి కారణంగా ఏలాంటి ప్రాణి ఆవిర్భవించలేదు. 250 నుంచి 50 కోట్ల సంవత్సరాల మధ్య కాలంలో ఏక కణ – బహుకణ జీవులైన ఫంగస్, అమీబాలాంటి జీవులు మాత్రమే ఉండేవి. ఏడున్నర నుంచి ఇరవై లక్షల మధ్య కాలంలో కోతులు, చింపాంజీలు, గిబ్బన్‌లూ, నరవానరాలూ – వాటి నుంచి నియాండర్తల్ మానవులూ అవతరించారని స్థూలంగా డార్విన్ సిద్ధాంతం చెప్పింది. ఈ క్రమాన్నంతా అర్థం చేసుకోకుండా 'కోతులు నుంచి మనిషి పుడతాడా? "అని ప్రశ్నిస్తే పోయేది సత్యపాల్ సింగ్ గారి ఒక్కరి పరువే కాదు దేశం పరువు కూడా! ఎందుకంటే ఆయన ఈ దేశానికి కేంద్రమంత్రిగా వున్నాడు. ఈనేపథ్యంలో విషయ పరిజ్ఞానం లేకుండా మాట్లాడే కేంద్రమంత్రులు జాబితాలో తాజా స్థానాన్ని సంపాదించుకున్నందుకు సత్యపాల్‌సింగ్ గారికి "అమిత" సంతోషంగా వున్నట్టుంది.

అన్ని మత గ్రంథాలు – మనిషిని దేవుడే (ఏ మతానికి చెందిన దేవుడు సృష్టించాడోనన్న సంగతిని అన్ని మతాల దేవుళ్ళు చర్చించుకొని ప్రకటించవలసి వుంది) నేరుగా తయారుచేశాడని రకరకాల సృష్టి కథలు రాశాయి. ఛార్లెస్ డార్విన్ జీవపరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించటంతో ఆ మతాలకూ – వాటి రాతలకూ విలువలేకుండా పోయింది. డార్విన్ సిద్ధాంతం మీద వాద ప్రతివాదాలు జరిగాయి. అమెరికాలోని క్రైస్తవ పీఠాధిపతులు డార్విన్ సిద్ధాంతాన్ని (కోతి చట్టం) అనే పేరు మీద కేసు కూడా ఎక్కించారు. కానీ చివరికి సత్యమే గెలిచింది. డార్విన్ తదనంతరం జరిగిన పరిశోధనలన్నీ – జీవపరిణామ సిద్ధాంతాన్ని బలపరిచాయి. మతాల నడ్డి విరిచింది కాబట్టే జీవపరిణామ సిద్ధాంతం మీద మతం చాటు బిడ్డలు అప్పుడప్పుడు ఇలా ప్రత్యక్షంగా – పరోక్షంగా దాని మీద దాడికి ప్రయత్నాలు చేస్తుంటారు. ఇలా దాడికి దిగినప్పుడల్లా బయటపడేది ఆ దాడి చేసిన వాడి అజ్ఞానమే. కొసమెరుపేమిటంటే మూర్ఖ శిఖామణులు ఇలా దాడిచేసిన సందర్భాల్లోనే సిద్ధాంతాలు ఇంకింతమంది ప్రజలకు చేరువవుతాయి.

విశ్లేషణ

మోడీ బడ్జెట్‌తో గ్రామీణ దుస్థితి తొలగేనా?

పతకమూరు దామోదరప్రసాద్

కేంద్రంలో నరేంద్రమోడీ సారథ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరి దాదాపు నాలుగేళ్లవుతున్న పూర్వరంగంలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ రగులుతున్న పల్లె భారత ప్రజలను కష్టాల నుండి గట్టెక్కిస్తుందా? ఈ ఏడాది 8 రాష్ట్రాలు శాసనసభలకు, ఆపై "లోక్‌సభ ఎన్నికల పరీక్ష"ను కమలనాథులు ఎదుర్కోవలసి వుంది. నానాటికీ తీవ్రమవుతున్న గ్రామీణ దుస్థితిని తొలగించుకోడానికి మోడీ ప్రభుత్వం బడ్జెట్‌తో "నిర్దిష్ట" ఉపశమన చర్యలు తీసుకుంటుందనే ఆశలు మొలకెత్తాయి. అయితే ప్రజలు "ఉచితాలను" కోరుకోవడం లేదనీ, తమ ప్రభుత్వం సంస్కరణల పథంలో కొనసాగుతుందనీ, జనాకర్షక పథకాలను విధానాలనూ పాటించబోమనీ ప్రధాని మోడీ స్పష్టంగా ప్రకటించడంతో బడ్జెట్ దిశపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

దేశంలో వరుసగా రెండేళ్లు (2014-15-16) తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొనడంతో వ్యవసాయ వృద్ధి కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఆ తర్వాత 2016-17లో సమృద్ధిగా వర్షాలు కురిసి రికార్డు స్థాయిలో 27.2 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగినా, ఆహార పంట ఉత్పత్తుల ధరలు కనీస మద్దతు కంటే చాలా తక్కువ స్థాయికి దారుణంగా పడిపోగా, పాలు, పండ్లు, కూరగాయల ధరలు సైతం అత్యల్ప స్థాయికి చేరాయి. ఆపై గోరుచుట్టపై రోకటి పోటన్నట్లు పెద్దనోట్ల రద్దు-తదుపరి 6 నెలల్లో మళ్లీ దేశవ్యాప్త ఏకీకృత జీఎస్టీ పన్ను వ్యవస్థను మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టడంతో దేశంలో అసంఘటిత రంగంలో పనిచేసే కోట్లాది కార్మికులు ఉపాధి కోల్పోగా, పండించిన పంటలను అమ్ముకోలేక, నగదు లేక అప్పులు, వడ్డీల పెనుభారమై పల్లెభారతం విలవిలలాడింది. దేశంలో ఇప్పటికీ దాదాపు 55 శాతం మందికి ఉపాధి కల్పిస్తున్న సేద్యపు రంగం – అనుబంధ పాడి, మత్స్య, చేనేత రంగాలపై బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు తీవ్ర ప్రభావం చూపాయి. గ్రామీణ రంగంలో ఉత్పత్తి పెరిగితేనే జనంలో కొనుగోలు శక్తి పెరిగి పారిశ్రామిక, వినియోగ వస్తువులకు గిరాకీ పెరిగి ఉద్యోగావకాశాలు పెరుగుతాయనే ప్రాథమిక అంశాల్ని విస్మరించి మోడీ ప్రభుత్వం ప్రజలపై దెబ్బపై దెబ్బ వేస్తూ వారిని జీవచ్ఛవాలుగా మారుస్తోంది. ఆపై డీసెల్, పెట్రోలు ఉత్పత్తులకు రోజువారీ ధరలపేరిట గత నెలరోజుల్లోనే లీటరుకు రూ. 10కి పైగా పెంచి రవాణాను పెనుభారంగా మార్చి ప్రజల నడ్డి విరిచింది. అంత ర్జాతీయ మార్కెట్లలో పీపా ముడి చమురు ధర 50-55 డాలర్లున్నప్పుడు సైతం పెట్రోలు ఉత్పత్తుల ధర తగ్గించకుండా కేంద్రం ఎక్సైజ్ సుంకాలు – ఆంధ్ర, తెలం గాణా సహా వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు 38 శాతం వరకు వ్యాట్ సుంకాలు విధించడంతో లీటరు ధర రూ. 75-80కి పెరగడంతో జనం హాహాకారాలు చేస్తున్నారు.

మోడీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో రైతులు గ్రామీణ ప్రజల కష్టాలు పెరుగుతున్నాయే తప్ప తరగడం లేదు. ఈ ఏడాది జీడీపీ 6.5 శాతానికి పడిపోయింది. 4 ఏళ్లతో ఇదే కనిష్టం. గ్రామీణ రంగంలో వృద్ధి సేద్యం-అనుబంధ రంగాలలో వికాసం జరగకపోతే "అందరితో కలసి – అందరికోసం వికాసం" అనే నినాదంగానీ, వచ్చే ఐదేళ్లలో రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామనే మోడీ గంభీర ప్రకటనలు గానీ ఆచరణ రూపం దాల్చడం కష్టం. వ్యవసాయేతర రంగాలలో కంటే సేద్యపు రంగ వృద్ధి ద్వారానే దారిద్ర్య నిర్మూలన మూడింతలు ఎక్కువ "ప్రభావకారి"గా వుంటుందనే ప్రపంచ అభివృద్ధి నివేదిక సలహాను పరిగణనలోకి తీసుకుంటే దారిద్ర్య నిర్మూలన లక్ష్య సాధనకు ప్రభుత్వం సేద్యపు రంగం పని తీరును మెరుగుపరచేందుకు వచ్చే బడ్జెట్‌లో నిర్దిష్ట ప్రతిపాదనలు చేయడం అవసరం. అయితే సేద్యపు జీడీపీ వృద్ధిరేటు గత ఏడాది 4.9 శాతం కాగా, 2017-18లో ఆ వృద్ధిరేటు 2.1 శాతానికి పడిపోగలదని ముందస్తు అంచనాలు వెల్లడిస్తున్నాయి. సేద్యపు వృద్ధిని, మనోహర్‌సింగ్ యూపీఏ-1, నాలుగేళ్ల (2004-08) పాలనలో సేద్యపు జీడీపీ వృద్ధి 3.7 శాతం కాగా, మోడీ ప్రభుత్వ నాలుగేళ్ల పాలనలో అది సగానికి అంటే 1.9 శాతానికి పడిపోయిన సంగతి గమనార్హం. మోడీ ప్రభుత్వం రెండేళ్లు దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చినా అంతర్జాతీయంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలను పెంచుతూ పోవడం వల్ల కోట్లు ఆర్జించింది. ఆపై ప్రపంచ వ్యాప్తంగా వస్తువుల ధరలు పడిపోవడం వల్ల దేశీయంగా ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడానికి కమలనాథులకు కాలం కలిసొచ్చింది. 2018-19లో 4 శాతం సేద్యపు జీడీపీ వృద్ధి సాధించగలిగినా మోడీ సర్కారు సేద్యపు జీడీపీ ఐదేళ్ల సగటు వృద్ధి 2.3 శాతానికి మించదు.

యూపీఏ ప్రభుత్వాల హయాంలో వ్యవసాయోత్పత్తుల ఎగుమతి, దిగుమతుల్లో మిగులు 3.6 బిలియన్ డాలర్ల నుండి 2013-14 నాటికి 25.5 బిలియన్ డాలర్లుకు ఏడింతలు పెరిగింది. మోడీ పాలనలో అది 2016-17, 8.2 బిలియన్ డాలర్లకు తగ్గింది. ఈ పరిస్థితులలో రైతుల ఆదాయం వచ్చే ఐదేళ్లతో రెట్టింపు కావాలంటే అన్నదాతల సమ్మిళిత నిజ ఆదాయాలు ఏటా 10.4 శాతం పెరగాల్సి వుంటుందని దల్వాయి కమిటీ అభిప్రాయం అది సాధ్యమయ్యేదేనా? దేశంలోని వివిధ ప్రాంతాలలో నీటిపారుదల సౌకర్యాల విస్తరణకుగాను 201 నాటికి 99 భారీ, మధ్యతరహా ప్రాజెక్టులను పూర్తి చేయాలని గుర్తించినా వాటిలో ఇప్పటికి పూర్తయినవి 10 మాత్రమే. కేంద్ర తగు నిధులివ్వని కారణంగా నవ్యాంధ్రకు 'జీవనాడి' అయిన పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టు నిర్మాణం వచ్చే రెండేళ్లలో పూర్తయ్యే సూచనలు కన్పించడం లేదు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఎన్ని మొక్కులు మొక్కినా మోడీ సర్కారు నిధులు విదల్చని వైనం ఆంధ్రులకు ఆగ్రహం కల్గిస్తోంది. తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరిచ్చే సంకల్పంతో సాగుతున్న కేసీఆర్ సర్కార్ కీలకమైన కాళేశ్వరం భారీ ఎత్తిపోతల పథకాలకు కేంద్రం ఉదారంగా నిధులివ్వాలని కోరుతున్నా కమలనాథులలో కదలికే లేదు. 2017లో వర్షాలు బాగా కురిసి పుష్కలంగా పంటలు పండినా, వాటికి కనీస మద్దతు ధరలు లేక, కొనేవారు లేక రైతులు హతాశులైనారు. ఉల్లిగడ్డలు, బంగాళాదుంపలు, కంది ఇతర పప్పు దినుసలు, పత్తి, నూనెగింజలు ధరలు దారుణంగా పడిపోవడం వల్ల అనేక రాష్ట్రాల్లో ముఖ్యంగా బీజేపిపాలిత మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, యు.పి ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో అన్నదాతలు పోరుబాట పట్టారు. వందలాది మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతులకు పాలు, కూరగాయలు వీధుల్లో పారేసే దుస్థితి దాపురించింది. యుపిలో బంగాళాదుంపలు 20 పైసలకు కొనేవారు లేక పోగా తెలుగు రాష్ట్రాలల్లో టమోటా తదితర కూరగాయల ఉత్పత్తి దార్లదీ అదే కన్నీటి కథే. ఎందరో టమోటాలు రోడ్ల పై పారేసి పోగా మరికొందరు ఉచితంగా పంపిణీ చేశారు. అయినా కేంద్రం – రాష్ట్ర ప్రభుత్వాలు మార్కెట్‌లో జోక్యం చేసుకొని రైతులను ఆదుకోలేదు. శీతల గోదాముల నిర్మాణమే లేదు.

ఈ దుస్థితి నుండి రైతులను గట్టెక్కించడానికి కేంద్రం నిర్దిష్ట చర్యలు చేపట్టాలి. ప్రధాని పంటలు భీమా పథకాన్ని లొసుగులు లేకుండా తగు మార్పులు చేసి రైతులందరికీ వర్తింపజేయాలి. నబార్డు ఆధ్వర్యంలో దీర్ఘకాల నీటిపారుదల నిధికి గత ఏడాది ప్రత్యేకించిన రూ 20వేల కోట్లు, సూక్ష్మ నీటిసాగు నిధి రూ5వేల కోట్లను, పాడిపరిశ్రమ అభివృద్ధి కోసం ప్రత్యేకించి రూ 8వేలకోట్లు ఏ మేరకు ఏవిధంగా ఖర్చుయ్యామో నిశితంగా పరిశీలించి, వచ్చే బడ్జెట్‌లో ఆయా రంగాలకు కేటాయింపులు పెంచాలి. పూర్తయిన ప్రాజెక్టులకు ప్రాధాన్యం. ప్రాతిపదికలో పంటకాలువలు నిర్మించాలి. దేశంలో ఏ ప్రాంతం వారికైనా, సరుకులు అమ్ముకోవడానికి ఉద్దేశించిన ఇ నాకు ఎలక్ట్రానిక్ మార్కెటింగ్ వ్యవస్థ అమలుకు దళారీలు దోపిడీదార్లు అడుగడుగునా అడ్డుపడుతున్నందున వ్యవసాయ మార్కెంటిగ్ విధానంలో రైతులకు అనుకూల మార్పులు చేపట్టాలి. అమూల్ వంటి సహకార పాడి పరిశ్రమ వలె సంఘాలను ఉల్లి, టమోటా, బంగాళాదుంపలు వంటి కూరగాయలు ఉత్పత్తిదార్ల సంఘాలను నేరుగా ఆహార శుద్ధి పరిశ్రమలు రొట్టె సంఘటిత రిటైలర్‌లతో అనుసంధానించి వారికి మెరుగైన ధరలు లభించే విధానాలను ప్రకటించాలి.

వ్యవసాయం రాష్ట్రాల జాబితాలోని అంశమని కుంటి సాకులు చెబుతూ కేంద్రం తరచు తన బాధ్యతను తప్పించుకుంటుంది. దేశంలో సాగు యోగ్యమైన 16 కోట్లు హెకార్లలో 41 శాతం భూమికే సాగు నీటి సౌకర్యాలున్నాయి. కేంద్ర, రాష్ట్ర, జిల్లాస్థాయి వ్యవసాయ, అనుబంధ శాఖలను పరిశోధనా సంస్థలు, యూనివర్శిటీలతో అనుసంధానించి, ఆయా ప్రాంతాల భూసారం, వాతావరణం, వర్షపాతం తదితర అంశాలను పరిగణలోనికి తీసుకుని మేలైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించి, ఉత్పాదకత పెంపునకు ప్రోత్సహిస్తే నూనెలు, పప్పుల దిగుమతులు తగ్గి పండ్లు, కూరగాయలు ఎగుమతి చేసే స్థాయికి రైతాంగం చేరుకుంటుంది. దేశ అవసరాలు పోను మిగులు వ్యవసాయోత్పత్తులను సరైన ధరకు విదేశాలకు ఎగుమతి చేయడానికి అనువైన మార్కెటింగ్ వ్యవస్థలను నెలకొల్పాలి. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో రైతుల నెలసరి సగటు ఆదాయం 6వేల కంటే తక్కువే. ఎందరో పేద, మధ్య తరగతి రైతులు మరోగత్యంతరం లేక సేద్యపు రంగంలో కన్నీళ్లు కష్టాలతో కొనసాగుతున్నారు. అందువల్ల విత్తనం వేయడానికి ముందే సేద్యానికి అవసరమైన సంస్థాగత రుణాలను రైతులకు అందించాలి. 2017-18లో సేద్యం – అనుబంధ రంగాలకు కేటాయించిన రూ 10 లక్షల కోట్ల రుణ వితరణను ఇతోధికంగా పెంచి వడ్డీ వ్యాపారుల బారినుండి రైతులను కాపాడాలి. వడ్డీ రాయితీ పెంచాలి. సేద్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరికరాలను ప్రవేశపెట్టి సబ్సీడీ ధరల ద్వారా రైతులకు అందుబాటులోకి తెచ్చి సాగు ఖర్చును గణనీయంగా తగ్గిస్తేనే రైతుకుమేలు తెలంగాణాలో కేసీఆర్ ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టిన చెరువుల పునరుద్ధరణ "మాషన్ కాకతీయ" ఆంధ్రప్రదేశ్‌లో పంటకుంటలు చెక్ డ్యాముల నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ, నీటినిల్వ అదనపు సాగు దిశగాసాగాలి. రైతుకు ఎకరాకు రూ 4వేల సాగుఖర్చుగా ఇస్తామనేది 'ఎన్నికల గోదారి' దాటేదిగా గాక కేసీఆర్ చిత్తశుద్ధితో అమలుచేయాలి. ప్రతిగింజా, పంటా కొంటామనే కేసీఆర్ వాగ్దానం నీటిమూటకారాదు. కేంద్రం ఈ కార్యక్రమాలను గుర్తించి అదనపు సాయం చేయాలి. నరేంద్రమోడీ ప్రభుత్వం గ్రామీణ దుస్థితి తొలగించేందుకు రైతన్నలు, నేతన్నలు గంగపుత్రులు, గొర్రెల కాపర్లు ఇతర గ్రామీణ వృత్తులు అభ్యున్నతికి నిర్దిష్ట చర్యలు చేపట్టాలి. లేదంటే కష్టజీవులు కమలనాథులకు తగిన గుణపాఠాలు నేర్పగలరు.

వ్యాస రచయిత : సీనియర్ జర్నలిస్టు, 9440990381

దక్షిణాదిలో బీజేపీకి సవాలుగా ప్రాంతీయ పార్టీల ప్రాబల్యం

విశ్వనాథ్ . వై.

దక్షిణ భారత దేశంలో ఏరాష్ట్రంలోనూ బీజేపీకి సానుకూలత వ్యక్తమవుతున్న పరిస్థితి కానరావడం లేదు. ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల ప్రాబల్యం బీజేపీకి మింగుడుపడటం లేదు. అయితే, అధికారం దక్కించు కోవడం కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయడానికీ వెరవని బీజేపీ నైజాన్ని ఈ పార్టీలు సరిగానే గుర్తించి నట్లు కనిపిస్తోంది. . బీజేపీ తరచూ ప్రవచిస్తున్న హిందూత్వకు గుజరాత్ ఒక నమూనా అనే భావన రాజకీయ వర్గాల్లో ఉంది. అక్కడ గత 22 సంవత్సరాలుగా అధికారం చలాయిస్తోంది. అలాంటి గుజరాత్‌లో గెలుపు కోసం బీజేపీ సర్వశక్తులూ ఒడ్డిందంటే అతిశయోక్తి కాదు. ఒక వంక దేశమంతా హిందూత్వ అజెండాను అమలు చేయాలన్న తహతహలో ఉన్న బీజేపీ-ఆరెస్సెస్‌లకు గుజరాత్ ఫలితాలు ఒక గుణపాఠంగా మిగిలాయి. అది దూకుడు తగ్గించుకో కపోతే గెలుపు సాధ్యం కాదని ఆపార్టీ గుర్తించినట్లు కనిపిస్తోంది. అదే సమయంలో ఓడించడానికి సాధ్యం కానంతటి బలమైన స్థితిలోనూ అధికార బీజేపీ-ఎన్డీయే కూటమి లేదని ప్రతిపక్షాలు తెలుసు కోగలిగాయి. ఇలాంటి పరిస్థితిలో దక్షిణ భారతదేశంలోనూ అధికార విస్తరణ మీద బీజేపీ అధిష్ఠానం దృష్టి పెడుతోంది. త్వరలో జరగనున్న కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌ను ఓడిస్తామంటూ ఆపార్టీ అగ్రనాయకులు ఇప్పటికే ప్రకటనలు గుప్పించేయడం చూస్తూనే ఉన్నాం.

దక్షిణాదిలో అధికారం కోసం బీజేపీ ఎంతగా తహతహలాడుతోందనేందుకు తమిళనాడు, కర్నాటకల్లో చోటు చేసుకున్న పరిణామాలు ఉదాహరణగా నిలుస్తున్నాయి. రాజకీయాల్లోకి వస్తున్నానన్నదే తడవుగా సూపర్ స్టార్ రజనీకాంత్‌ను అక్కునజేర్చుకునేందుకు ప్రధాని మోడీ సహా ఆపార్టీ నాయకులు కనబరిచిన అత్యుత్సాహం అంతా ఇంతా కాదు. దక్షిణాదిలో ఎలాగైనా పాగా వేయాలన్న బీజేపీ రాజకీయ చింతనకు ఈ తహతహ అద్దం పడుతోంది. అయితే, ఉత్తర భారత్ రాజకీయాలకు, దక్షిణ భారత్ రాజకీయాలకు ప్రధాన వైరుధ్యాలు కొన్ని ఉన్నాయి. విభిన్న భాషలు, సంస్కృతులు, ఈ రెంటితో అనుసంధానమైన జాతీయ తలు, ప్రాంతీయ పార్టీల ప్రాబల్యం వంటివి బీజేపీకి ప్రతికూలత కల్పిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే బీజేపీ దాని మాతృసంస్థ ఆరెస్సెస్ ప్రవచించే హిందీ-హిందూ(త్వ) రాజకీయాలకు దక్షిణ భారత్‌లో సానుకూల స్పందనలు కనిపించడం లేదు. దేశంలో అత్యధిక రాష్ట్రాల్లో అధికారంలోకి రాగలిగా మనుకునే బీజేపీకి దక్షిణ భారత్ ఒక సవాలుగానే నిలిచిందంటే అతిశయోక్తి కాదు. ఆ సవాలు ప్రాంతీయ పార్టీల రూపంలో ఉంది. బలమైన ప్రాంతీయ పార్టీలతో చెలిమికి బీజేపీ తహతహలాడేది ఇందుకే. బీజేపీ అధికార దాహాన్ని దక్షిణాది ద్రావిడ వాణితో నిలువరిం చవచ్చంటూ రాజకీయ అరంగేట్రానికి రంగం సిద్ధం చేసుకున్న మరో తమిళ విలక్షణ నటుడు కమల్‌హాసన్ పిలుపు ఇచ్చారు. 2019 ఎన్నికల్లో బీజేపీ ఓటమి లక్ష్యంగా అన్ని రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు, లౌకిక- ప్రజాస్వామిక శక్తులు 'మహా సంఘటన'గా రూపుదాల్చా ల్చిన ఆవశ్యకత ఉందన్న సీపీఐ రాజకీయ ప్రకటనకు ఆయన పరోక్ష మద్దతు ఇచ్చినట్లయింది.

ఎన్నికలు జరిగిన ప్రతి రాష్ట్రంలో అధికారం మనదేనంటూ ధీమా కనబరిచిన మోడీ-షాల ద్వయానికి దక్షిణాది రాష్ట్రాలు ఒక్కోటి ఒక్కో కోణంలో సవాలు విసురుతున్నాయి. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్నాటకలో అదృష్ట పరీక్షకు బీజేపీ సిద్ధపడుతోంది. వాస్తవానికి కర్నాటకలో గతంలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. అయితే, గనుల కుంభకోణాలు, పీకల్లోతు అవినీతి ఊబిలో కూరుకుపోయిన కొందరు నాయకుల మకిలి కర్నాటకలో బీజేపీని ఓటమి పాల్జేసింది. కాంగ్రెస్‌పార్టీ అధికారం నిలుపుకోగలిగింది. ప్రస్తుతం బీజేపీకి ధీటుగా మరో మాటలో ఆపార్టీ భాషలోనే కర్నాటక కాంగ్రెస్ ముఖ్య మంత్రి సిద్ధరామయ్య బదులిస్తున్నారు. బీజేపీ అనుసరిస్తున్న హిందు గుర్తింపును కర్నాటకలో గట్టి ప్రాబల్యమున్న లింగాయత్ గుర్తింపుతో సిద్ధరామయ్య ఢీకొంటున్నారు. రాజకీయంగా, సైద్ధాంతికంగా ఎదురవుతున్న ఈ సవాలుకు ప్రస్తుతం బీజేపీ ఇరుకున పడినట్లు తెలుస్తోంది. వాస్తవానికి కర్నాటకలో బీజేపీకి లింగా యత్‌లు గట్టి పునాదిగా నిలిచారు. హిందూత్వ కాదంటూ లింగాయత్‌లు వినిపిస్తున్న కొత్త వాదనకు బీజేపీ కలవరపాటుకు గురవుతోంది. జరగబోయే ఎన్నికల్లో ఫలితాలు అనుకూలంగా ఉంటాయో లేదోనన్న శంక బీజేపీని పట్టి పీడిస్తోంది. ఈలోగా ఈశాన్య రాష్ట్రా లు త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు వెలువడింది. ఈమూడింటిలో త్రిపుర అధి కార వామపక్ష కూటమి నుంచి బీజేపీకి గట్టి ప్రతిఘటన ఎదురవుతోంది. మేఘాలయ, నాగాలాండ్‌లో చాపకింద నీరులా బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి.

తమిళనాడులో నిన్నమొన్నటి వరకు -జయలలిత మరణానంతరం- అటు ఏఐఏడీఎంకే, డీఎంకేలతో బీజేపీ స్వీయ ప్రయోజన రాజకీయాలు నడిపిన తీరు తెలిసిందే. పరామర్శను కారణంగా చూపుతూ డీఎంకే అధ్యక్షుడు కరుణానిధిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాని మోడీ చేసిన విఫలయత్నమూ ఎరిగినదే. కరుణానిధిని మోడీ పరామర్శించిన రోజునే 2జీ కేసు విచారణ జరగనుండటం యాదృచ్ఛికమనుకోవాలా? ఈకేసులో ప్రధాన నిందితులుగా కరుణానిధి కుమార్తె మాజీ ఎంపీ కనిమొళి, నాటి యూపీఏ-2లో టెలికాం మంత్రిగా పని చేసిన ఆపార్టీ నాయకుడు ఏ రాజాలు తీవ్ర అభియోగాలను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. అభియోగాలు నిరూపణ కానందున నిర్దోషులుగా బయట పడింది తెలిసిందే. కరుణానిధిని మోడీ పరామర్శించిన సమయంలోనే '2జీ కేసు తీర్పు' రాజకీ యంగా ప్రభావితమైందనే విమర్శలూ వినవచ్చాయి.

వైవిధ్యభరిత వామపక్ష ఆధిక్య రాజకీయాలకు కేరళ పెట్టింది పేరు. ప్రజాస్వామ్య బద్ధంగా తొలి వామపక్ష ప్రభుత్వం ఏర్పాటైందీ కేరళలోనే. నాటి కేరళ వామపక్ష ప్రభుత్వాన్ని ఒక్క కలం పోటుతో కుప్పకూల్చిన బూర్జువా రాజకీయాల పట్ల కేరళీయులకు మంచి అవగాహన ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీతో బీజేపీ అధికార భాగస్వామిగా ఉంది. అలానే ఢిల్లీలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ భాగస్వామిగా ఉంది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు టీడీపీతో వ్యవహరించిన తీరుకూ, ఎన్నికల తరువాత వ్యవహరిస్తున్న తీరుకూ స్పష్టమైన వ్యత్యాసం కనిపి స్తోంది. ఢిల్లీలో ప్రధాని మోడీతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జరిపిన భేటీనే ఇందుకు ఉదాహ రణ. అయితే. ప్రతిపక్ష వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్మోహనరెడ్డితోనూ 'సామరస్యంగా' వ్యవహరిస్తున్న బీజేపీ ఎన్నికల నాటికి ఏ రేవు చేరుతుందో ఇప్పుడే చెప్పలేం. అదను చిక్కినపుడల్లా టీడీపీ ప్రభుత్వం మీద విమర్శలు ఎక్కుపెట్టే రాష్ట్ర బీజేపీ నాయకులు మాత్రం జగన్‌ను పల్లెత్తు మాట అనక పోవడం జనం నోళ్లలో నానుతూనే ఉంది. ఏపీలో టీడీపీ, వైఎస్ఆర్ సీపీలతో బీజేపీ ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తోందని చెప్పాలి. ఇదే సమయంలో తెలుగు ప్రజలను తక్కువగా అంచనా వేయొద్దంటూ జాతీయ రాజకీయాల్లో ఒకనాడు చక్రం తిప్పిన టీడీపీ అధ్యక్షుడు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రకటన రాజకీయ ఆసక్తి రేపుతోంది. జనసేన పేరిట పార్టీని స్థాపించిన సినీ నటుడు పవన్‌కళ్యాణ్‌కు ఓటింగును ప్రభావితం చేయగల అవకాశాలున్నాయి. 2014లో టీడీపీ-బీజేపీకి మద్దతు తెలిపిన పవన్ 2019లో ఎటు అడుగులు వేసేదీ అస్పష్టంగానే ఉంది. ప్రత్యేక హోదా సహా అనేక విషయాల్లో ఏపీ ప్రజలకు బీజేపీ అన్యాయం చేస్తోందంటూ పవన్ లేవనెత్తిన వాదనలకు స్పందన లభిస్తోంది. తెలంగాణలో టీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్య మంత్రి కే చంద్రశేఖరరావు ప్రాబల్యాన్ని గండికొట్టడానికి బీజేపీ శతవిధాలా ప్రయత్నిస్తోంది. దీన్ని పట్టించు కోనట్లుగానే మోడీతో కేసీఆర్ మంతనాలు సాగిస్తు న్నారు. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల్లో అధికారం నిలుపు కోవాలంటే ఆయా రాష్ట్రాల్లో బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలను మచ్చిక చేసుకోవడం వినా బీజేపీకి గత్యంతరం లేదు. అయితే, ముందుగా చెప్పుకున్నట్లు గుజరాత్ ఎన్నికల ఫలితాల తరువాత బీజేపీ ఏకపక్ష ప్రాబల్యాన్ని దక్షిణాది రాష్ట్రాల్లోని ఏ ప్రాంతీయ పార్టీ అంగీకరిస్తుందనుకోవడానికి అవాకాశాల్లేవు. ప్రాంతీయ పార్టీల పొత్తు లేందే 2019 ఎన్నికల్లో బీజేపీ పాచికలు పారడం కల్ల.

విశాలాంధ్ర
బతుకు
The Life
మంగళవారం
30 జనవరి 2018

రచయితలకు సూచన

'బతుకు' పేజీలో ప్రచురణకు పంపే రచనలు, వార్తా కథనాలను ఇక నుంచి ఈ దిగువ ఈ మెయిల్ చిరునామాకు పంపగలరని మనవి.

batuku@visalaandhra.com

సొంతూరికి సంపూర్ణ సేవ!



ప్రాధమిక ఆరోగ్య కేంద్రం

ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండాలి, అందరూ చదువుకోవాలి, మట్టిని నమ్ముకున్న రైతుకు మంచి జరగాలి....ఇవీ గారపాటి పూర్ణచంద్రరావు ఆలోచనలు, ఆశయాలు. ఈ విషయంలో ఆయన ఆలోచనలకే పరిమితం కాలేదు ఆచరణలోనూ పెట్టారు. తన సొంతూరు ధర్మాజీగూడానికి చేతనైనంత సాయం చేశారు. సేవలో పదిమందికీ మార్గదర్శకంగా నిలిచారు. ఈ గ్రామంలో ఒకప్పుడు ఆసుపత్రి లేదు. చిన్నపాటి వైద్యం

ధర్మాజీగూడెం....చరిత్రలో ఈ గ్రామానికీ కొన్ని పేజీలు ఉన్నాయి. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ దొరలకు ఎదురు నిలిచి పోరాడిన యోధులున్న గ్రామం ధర్మాజీగూడెం. ఈ గ్రామంపై ప్రత్యేక ఆసక్తితో మహాత్మా గాంధీ ఇక్కడ అడుగుపెట్టారు. చింతలపూడి నియోజక వర్గానికి ఇద్దరిని ఎమ్మెల్యేలుగా చేసిన ఘనత ఈ గ్రామానికి ఉంది. ఇంత చరిత్ర గలిగిన ఈ గ్రామం రాజకీయంగా వర్గపోరు కారణంగా అభివృద్ధికి దూరమయ్యింది. మేజర్ పంచాయతీగా ఉన్న ఈ గ్రామం ఇప్పటికీ మండల కేంద్రం కాలేకపోయింది.

"చదువు, ఉద్యోగం, కుటుంబం...ఇదేనా జీవితం. కాదు ఇంకా ఏదో ఉంది. అదే సమాజ సేవ....సామాజిక సేవ...సేవ అంటే ఏదో చేశామంటే చేశాం అనిపించుకోవడం కాదు. కన్నతల్లి లాంటి సొంతవూరికి సేవ చేయడమే జీవితానికి అసలైన సంతృప్తి, సంపూర్ణమైన సంతృప్తీ..." ఇవన్నీ ఓ వ్యక్తి అనుభవం, ఆలోచనల్లో నుంచి వచ్చిన మాటలు....కాదు కాదు చేతలు...ఆయనే గారపాటి పూర్ణచంద్రరావు. నిస్వార్థమైన సేవ ప్రజలకు చేరువ చేస్తుంది, చుట్టూ ఉన్న జనం గుండెల్లో మంచి స్థానాన్ని అందిస్తుంది. గారపాటి విషయంలోనూ అదే జరిగింది. ఇందుకు కారణం ఆయన తన సొంత వూరికి చేసిన సేవే. ఇంతకీ ఆయన సొంతూరు ఏదంటారా....పశ్చిమగోదావరి జిల్లా లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామం.

చేయించుకోవాలన్నా పొరుగూరికి వెళ్ళాల్సిన పరిస్థితి. ఇలాంటి సమయంలో గ్రామ ప్రజలకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తన వంతు కృషిచేశారు గారపాటి. గ్రామంలో ఆసుపత్రి నిర్మాణం కోసం ముందు కొచ్చారు. ప్రధాన రహదారి పక్కనే తనకున్న అతి విలువైన ఎకరం 73 సెంట్లు భూమిని (ప్రస్తుతం ఈ భూమి విలువ నాలుగు కోట్లు), ఆరు లక్షల రూపాయల నగదును విరాళంగా ఇచ్చారు. దీనికి స్పందించిన ప్రభుత్వం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఆ ఆసుపత్రి ఈ గ్రామస్తులకే కాదు పొరుగూరుకు చెందిన వందలాది మందికి వైద్యం అందిస్తోంది. గ్రామానికి ఆసుపత్రి రావాలని తన తల్లి కోరుకునేవారని, ఈ నేపథ్యంలో ఆసుపత్రి నిర్మాణ కోసం అమ్మనాన్నల పేరుతో విరాళం ఇచ్చానని, కానీ, వారి పేర్లు ప్రభుత్వ రికార్డుల్లో లేకపోవటంపై బాధగా ఉందని చెప్పారు గారపాటి పూర్ణచంద్రరావు.

గ్రామీణ ప్రాంతాలు అంటే సహజంగానే మట్టిని నమ్ముకుని జీవించేవారే అధికంగా ఉంటారు. వ్యవసాయమే ఆధారంగా జీవిస్తున్నవారు ఒకే రకమైన పద్ధతులు పాటించటం వల్ల నష్టపోతున్నారని తెలుసుకున్న గారపాటి...రైతుల్లో చైతన్యం కలిగించేందుకు కృషి చేశారు. ఇందుకోసం స్వయంగా పంటలు పండించటం మొదలుపెట్టారు. సేంద్రీయ, వర్మీకంపోస్టును ఎరువులను వేయటం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చని నిరూపిస్తున్నారు. గ్రామీణులకు ఆదాయం తెచ్చే మరో మార్గం పాలు. వీటికోసం సాధారణంగా అన్ని ఇళ్ళల్లోనూ పశువులను పెంచుతారు. ఈ పశువుల మూత్రం, పేడతో జీవామృతాన్ని తయారు చేసి వాటిని పంటలకు వేయటం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రమోగాత్మకంగా చూపిస్తున్నారు గారపాటి. ఆయన పాటిస్తున్న పద్ధతులను వ్యవసాయ అధికారులు పరిశీలించి రైతులను ఈ విధానాలను పాటించాలని ప్రోత్సహిస్తున్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్న రైతులు ఇప్పుడు ఈ గ్రామంలో చాలామందే ఉన్నారు.

గారపాటి ఉద్యోగ రీత్యా ముంబాయిలో ఉన్నప్పుడు ఆంధ్రా నుంచి అక్కడికి వచ్చి స్థిరపడిన వారి పిల్లలు చదువుకోవటానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆ సమయంలో ఆంధ్రా ఎడ్యుకేషన్ సొసైటీకి ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఆయన ఈ సంస్థ తరుపున స్కూలు, కాలేజీలను ఏర్పాటు చేసి నాలుగు వేల మంది ఆంధ్ర పిల్లలు చదువుకొనేలా చేశారు. వారికి అన్ని సౌకర్యాలు కల్పించారు.



పూర్ణచంద్రరావు, ఝాన్సీ దంపతులు

మన రాష్ట్రం నుంచి వచ్చిన పిల్లలకు అక్కడ చదువుకోవడానికి ఎలాంటి ఆటంకం ఉండకూడదనే ఆశయంతో ఈ సొసైటీ అభివృద్ధికి పునాది వేశారు. ఇప్పటికీ అక్కడ ఎందరో మంచి విద్యను పొందుతున్నారు. ధర్మాజీగూడెంలో



ఆధునికంగా నిర్మించిన శివాలయం

పాడుబడిన పురాతన కాలంనాటి శివాలయం పునర్నిర్మాణానికి పెద్దమొత్తంలో విరాళం ఇచ్చారు గారపాటి. దీని కోసం స్వయంగా రూ.11 లక్షలు విరాళంగా ఇచ్చిన ఆయన మరో రూ.60 లక్షలు సేకరించి ఆధునికంగా అన్ని సౌకర్యాలయాలతో కూడిన శివాలయాన్ని నిర్మించారు.

గారపాటి సింహాద్రి, వెంకటనర్సమ్మ దంపతులకు మూడో సంతానంగా జన్మించిన గారపాటి పూర్ణచంద్రరావు ప్రాథమికక విద్య, హైస్కూలు చదువులు స్థానిక సర్కారు బడిలోనే పూర్తిచేశారు. విజయవాడ లయోల కాలేజిలో డిగ్రీ చదివారు. రాజస్థాన్‌లోని రాజస్థాన్ విశ్వవిద్యాలయంలో ఎంఏ సోషల్ వర్క్ చేశారు. చదువు పూర్తియిన ఏడాదిలోపే కష్టమ్స్ శాఖలో ఉద్యోగం వచ్చింది. జైపూర్, ఢిల్లీ, ముంబాయి ఆలీబాగ్‌లో ఉద్యోగం చేశారు. ఎక్సైజ్ శాఖలో జాయింట్ కమిషనర్‌గా పనిచేసిన గారపాటి 1994లో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అనంతరం సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సొంత ఊరికి దూరంగా ఉన్న వ్యవసాయ భూమిలో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. భార్య ఝాన్సీ కూడా గారపాటి సేవా కార్యక్రమాల్లో చేదోడువాదోడుగా నిలుస్తున్నారు.

అవకాశం ఉన్న ప్రతి ఒక్కరు సొంత ఊరి అభివృద్ధికి కృషి చేయాలి. పేరు కోసం కాకుండా ప్రజల కోసం సేవ చేసినప్పుడే నిజమైన తృప్తి ఉంటుందని అంటారు గారపాటి. ఆయన చెప్పింది పాటిస్తే కొన్ని ఊళ్ళయినా బాగుపడతాయి కదా!

– ఎస్‌డీవీ ప్రసాద్
లింగపాలెం, ప.గో.జిల్లా

పాన్ కార్డు
తెలుసుకోవలసిన విషయాలు

ఆదాయపు పన్ను శాఖ ప్రతి ఒక్కరికీ కేటాయించే శాశ్వత ఖాతా సంఖ్యను పాన్(పర్మినెంట్ అకౌంట్ నంబరు) అంటారు. అంకెలు, అక్షరాలు కలగలిపి ఉండే పది స్థానాల సంఖ్య ఇది. ఆదాయపు పన్ను రిటర్నులు సమర్పించేటప్పుడు, ఆ శాఖకు చెందిన ఏ అధికారితోనైనా జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలలో పాన్‌ను పేర్కొనడం తప్పనిసరి. అయినా సరే చాలా మంది పాన్ కార్డు తీసుకోకుండా ఇబ్బందులు పడుతుంటారు. మరికొంత మంది ఎక్కడ పాన్ కార్డు నంబరు ఇవ్వాలి, ఎక్కడ వద్దు అనే విషయంలో తికమక పడుతూ ఉంటారు. ఈ క్రమంలో పాన్ కార్డును గురించిన ముఖ్య విషయాలను తెలుసుకుందాం.

పాన్ కార్డు ఎప్పుడు అవసరం?

- రూ. 50 వేల పైబడి బ్యాంకు డిపాజిట్ల కోసం
- బ్యాంకు ఖాతా తెరిచేందుకు
- డీమ్యాట్, ట్రేడింగ్ ఖాతాలు తెరవడానికి
- చెక్కులు, డీడీల



విషయంలో లావాదేవీ రూ. 50 వేలను మించితే

- స్థిరాస్తి, వాహనాల కొనుగోలు, అమ్మకాలు జరిపేటప్పుడు
- హోటళ్లు, విలాసాలు, ప్రయాణ ఖర్చులు వంటి వాటి కోసం రూ. 25 వేల కంటే నగదు చెల్లింపులు చేసే విషయంలో
- ఆదాయపు పన్ను రిటర్నులు సమర్పించేటప్పుడు.

ఎవరెవరికి తప్పనిసరిగా పాన్ ఉండాలి?

- ప్రస్తుతం ఆదాయం పన్ను చెల్లించవలసిన వారికి, చెల్లించేవారందరికీ, ఇతరుల తరపున ఆదాయపు పన్ను రిటర్నులు దాఖాలు చేయాల్సిన వారికి
- విధిగా పాన్ నంబరు నమోదు చేయాల్సిన లావాదేవీలలో కొత్తగా ప్రవేశించాలనుకునే వారికి

పాన్ కోసం ఎక్కడ దరఖాస్తు చేయాలి?

పాన్‌కు సంబంధించిన సేవలను మెరుగుపరచడం కోసం, ఆదాయపు పన్ను శాఖ కార్యాలయం ఉన్న ప్రతి పట్టణంలో ఐటీ పాన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడానికి యుటిఐ ఇన్వెస్టర్ సర్వీసెస్ లిమిటెడ్(యుటిఐఐఎస్ఎల్) సంస్థకు ఆ శాఖ అనుమతించింది. పెద్ద నగరాలలో పాన్ దరఖాస్తుదారుల సౌకర్యాల కోసం, యుటిఐఐఎస్ఎల్ ఒకటి కంటే ఎక్కువ ఐటీ పాన్ సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేసింది. వీటితో పాటు టిన్ ఫెసిలిటేషన్ కేంద్రాలు కూడా ఉంటాయి. వీటన్నింటిలో పాన్ దరఖాస్తులను సమర్పించవచ్చు.

పాన్ కోసం అవసరమయ్యేవి



- ఒక పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫోటో
- రూ.107 డిమాండ్ డ్రాఫ్ట్
- వ్యక్తిగత గుర్తింపు పత్రం జిరాక్స్
- చిరునామా గుర్తింపు పత్రం జిరాక్స్

వ్యక్తిగత గుర్తింపు కోసం

- స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్(టీసీ)
- పదో తరగతి మార్కుల జాబితా
- గుర్తింపు పొందిన విద్యా సంస్థల డిగ్రీ మార్కుల జాబితా
- డిపాజిటరీ ఖాతా స్టేట్‌మెంట్
- క్రెడిట్‌కార్డు స్టేట్‌మెంట్
- బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్ లేదా పాస్‌బుక్
- నీటి బిల్లు(వాటర్ బిల్లు)
- రేషన్ కార్డు
- ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్ ఆర్డర్
- పాస్‌పోర్టు
- ఓటరు గుర్తింపు పత్రం
- డ్రైవింగ్ లెసెన్సు
- ఎంఎల్‌ఏ లేదా ఎంపీ లేదా మున్సిపల్ కౌన్సిలర్ లేదా గెజిడెడ్ ఆఫీసర్ సంతకం చేసి ఇచ్చే గుర్తింపు రుజువు

రంగుల లోకం...!

కోవై పండగ సందర్భంగా కోయంబత్తూరులో రంగురంగుల గొడుగులతో చేసిన అలంకరణ ఇది.



మానసిక ఆరోగ్యానికి చేయాల్సిన పనులు



సంతోషంగా ఉంటే మానసిక ఆరోగ్యం బావుంటుందనన ఒక్క మాటతో మనస్సు దూదిపింజ అయిపోదు. ఆ సంతోషం కోసం చేయాల్సిన పనులెన్నో ఉంటాయి. నేటి ఒత్తిడిపూరిత జీవనశైలిలో ఆ పనులకు ప్రాధాన్యం ఇచ్చినపుడే మనస్సుకు ఆరోగ్యం చేకూరుతుంది. హాయిగా, మనసారా నవ్వడం జీవితంలో, దినచర్యలో అంతర్భాగం కావాలి.

ఇందుకోసం స్నేహితులు, కుటుంబ సభ్యులతో సరదాలు, కామెడీ షోలు, సినిమాలు చూడటం, హాస్య పుస్తకాలు చదవడం లాంటివి చేస్తుండాలి.

నవ్వడంవల్ల ముఖం, మెడ కండరాలు రిలాక్స్ అవుతాయి. దిగుళ్లు కనుమరుగవుతాయి. శారీరక చురుకుదనం సంతోషాన్నిచ్చే హార్మోన్లు విడుదల చేస్తుంది. ఎటువంటి వ్యాయామాన్ని అయినా ఎంచుకుని కొనసాగిస్తుండాలి. పోషకాహారం మానసిక సంక్షేమానికి అత్యవసర ఆదరువు. సంగీతం మానసిక ఆహ్లాదాన్ని ఇవ్వడంలో తొలివరుసలో ఉంటుంది.

సింపుల్ స్ట్రెస్ బస్టర్. సామాజిక అనుబంధాలు అత్యవసర టానిక్ లాంటివి. వీలున్నప్పుడల్లా బంధుమిత్రులతో ఎక్కువగా కనెక్ట్ అవుతుండాలి.



జరిగిన కథ

గంగానది అవతల ఒడ్డున వున్నాయి మిల్లు యజమానుల మహా సౌధాలు - ఏమి నరక కూపాలు? ఈ తల్లక్రిందుడు ఎప్పడేనా మారుతుందా? మారకపోతే మోక్షం లేదే! మార్పు తెచ్చే వాళ్ళెవరు? రేపు శాసన సభకు వెళ్ళబోయే శాస్త్రా లేకపోతే సర్వసుఖాలు అనుభవిస్తూ చోద్యం చూడడానికి వచ్చిన నేనా? ఎప్పుడో ఒకసారి నాలాగు ఆవేశం చేత రణరంగంలో దెబ్బలు తినడం వేరు. రోజుకు ఇరవై నాలుగు గంటలూ యీ పరిసరాల్లో బతుకుతూ సాహసం చూపించడం వేరు. ఈ సాహసవంతులే విజయాన్ని సాధించాలి. వాళ్ళ అసంతృప్తే వాళ్ళ ఆయుధం. వాళ్ళ సాహసమే వాళ్ళ శక్తి. వాళ్ళ ఐక్యతే వాళ్ళ ముక్తి. వాళ్ళ శక్తివల్లే రావాలి శాంతి - ప్రపంచానికీ...వాళ్ళకీ...నాకున్నూ...

(నిన్నటి సంచిక తరువాయి)

సూర్యాస్తమయం అయింది. కిద్దరుపూరు దగ్గర దింపేసింది. బస్సు.

రేవుద్వారాలనుంచి వచ్చేస్తున్నారు లక్షాదిప్రజ! అన్ని రంగులవాళ్ళు - అన్ని దేశాలవాళ్ళు, చైనావాళ్ళు - ఇంగ్లీషు వాళ్ళు - గ్రీకులు - నీగ్రోలు - చిట్టాగాంగీయులు - జపానీయులు - జర్మనీవాళ్ళు - ఇటాలియనులు - పోలీసువాళ్ళు...

అక్కడేవున్నాయి కల్లు దుకాణాలు - అక్కడే వున్నాయి విలాస గృహాలు, గృహాలేమిటి? - గుడిసెలు. ఆ స్త్రీలను చూస్తే గుండె తరుగుకుపోయింది.

లోతుకుపోయిన బుగ్గలు - కళలేని కళ్ళు-కృశించిన శరీరాలు - నోట తాంబూలం - ముఖాన్న తెచ్చిపెట్టుకున్న నవ్వు - వికృతమైన వొయ్యారం. వస్తున్నారు వెళుతున్నారు - ముష్కరులు - దండలు తిరిగిన వహిల్వానులు - అజానుబాహులు. ఈ స్త్రీలు ప్రాణాలతో ఎలా బతికివున్నారు...?

ఇద్దరు పురుషులు నన్ను పలకరించారు. మరొకడు ఈలవేసి కనుసైగ చేశాడు. నాకు భయంవేసి కాళ్ళు వణకడం మొదలెట్టాయి. గబగబ నడవడం ప్రారంభించాను. నా గాభరా చూచి వాళ్ళు చప్పట్లు కొట్టారు. నా వెంటెక్కడ వస్తారో అని తోచి గుండె ఝల్లుమంది. పది ఇళ్ళు దాటాక - బస్సు వకటి కనిపిస్తే దాన్లో ఎక్కేను. ప్రాణాలు కుదుటబడ్డాయి.

సుభ మా యింటికి రావడం - శాస్త్రి చికాకు పడడం జ్ఞాపకం వచ్చాయి.

అప్పుడు సుభ నా దగ్గిర తల దాచుకుంది. ఇప్పుడు నేనెక్కడ దాచుకుందును? పాపం - యీ స్త్రీలందరూ - మరో విధంగా జరుగుబాటు లేక ఇందులోకి దిగవలసి వచ్చిందే! అర్థం - ప్రాణం - నీతి - అన్నీ కలిగివున్నవాళ్ళు ఎన్నైనా చెప్పవచ్చు.


మునుపు - జ్ఞానం. పాండిత్యం వున్న బ్రాహ్మడికి ఒక నీతి చెప్పారు. అయుధబలం - భుజబలంవున్న క్షత్రియుడికి మరొక నీతి అన్నారు. డబ్బున్న కోమటికి వేరే నీతి ఏర్పరచారు. చమటోడ్చి కష్టించేవారికి మరో నీతి వర్తిస్తున్నారు. బానిస జనంపట్ల యే నీతి పాటించనక్కరలేదు అన్నారు.

పారిశ్రామిక యుగం వచ్చాక సులభమైపోయింది. యజమాని చేసినదల్లా నీతే - పేదవాడు ఏదిచేసినా - చేయక పోయినా నేరమే.

...గడియారం చూస్తే తొమ్మిదైంది. బస్సు అల్లిపురంలో ఆగిపోయింది. అక్కడనుంచి డల్‌హౌసీస్క్వేరుకు ట్రాముమీద వెళ్ళాలన్నారు.

ట్రాములో జనం కిటకిట లాడుతున్నారు. యెక్కడమే కష్టం అయిపోయింది. పాపం, ఒకాయన సాయం చేస్తే ఎక్కగలిగేను - లేకపోతే చీరెలో కాలు తొట్రుకుని - ట్రాముక్రింద పడిపోయేదాన్ని. అతను అందంగా వున్నాడు. బంగాళీ దుస్తులు తీరుగా కట్టుకున్నాడు.

"మీకు వూరు కొత్తకాబోల్ను? శనివారం - గుర్రపు పందేలు - అంచేత ఈ రొక్కటం. అదుకో! కండక్టరు వస్తున్నాడు. డల్‌హౌసీకి వెళుతారు కాబోలును? పావలాతీసి



సిద్ధంగా వుంచండి. రూపాయి ఇస్తే మరి మీకు చిల్లర ముట్టదు - దగాకోళ్ళు సుమండీ!" అన్నాడు.

నాకు నవ్వు వచ్చింది. చేతి సంచీలో చిల్లర కనిపించలేదు. కండక్టరు చేతిలో ఐదు రూపాయలనోటు పెట్టాను. టిక్కెట్టూ నాలుగు రూపాయల ముప్పావలా నాకిచ్చి వెళ్ళిపోయాడు కండక్టరు నేను నవ్వుతూ నా చేతి సంచీలో డబ్బు వుంచేశాను.

ఆ సమయంలో సంచీలోనుంచి నా చేతి సంచీలోనుంచి నా చేతిరుమాలు క్రిందపడిపోయింది. "మీరు శ్రమపడకండి. నేను తీసియిస్తాను!" అంటూ చేతిరుమాలు తీసి ఇచ్చాడాయన.



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

రుమాలు అందుకుని సంచీలో పెట్టబోతున్నాను - రుమాలు మడతలో చీటి ఒకటి కనిపించింది. నేను నిర్ఘాంతపోయి అతని వేపు చూశాను.

అతను నవ్వుతూ, "మరేం అనుకోకండి! మీరు వొక్కరే యీ వూరులో వున్నారని మీరన్నారుకదా - ఇందాక. ఇంచేత మీకు చిన్న కానుక సమర్పించేను. మీకు తీరికగావుంటే రేపు రాత్రి సినిమాకు వెళుదాం. మీరు ముందుగా తొమ్మిది గంటలకు మినర్వా రెస్టారెంటు దగ్గరకు రండి - అక్కడ కలుసుకుందాం!"

నేను గ్రహించాను.

ప్రత్యుత్తరానికి బదులు - కొంటెతనంగా నవ్వేను.

ఆయన కన్ను గీటేడు. నేను ట్రాము దిగిపోయాను.

.....హోటలు హాలులో గడియారం పది గంటలు కొట్టింది. పాపాయి, సుభ బెంగగా కనిపెట్టుకుని నాకోసం గదిలో కూచున్నారు. వాళ్ళని సముదాయించి పడుకోపెట్టాను. ఆ చేతి రుమాలు మడతలో వున్నది ఏమిటో అని ఆత్రుతతో చూశాను. నూరు రూపాయల నోటు! నవ్వుకున్నాను. కుడుపునిండా భోంచేశాను.

...పొద్దున్నే లేచి నూరుపాయల నోటుని - జాగ్రత్తగా పరిశీలించాను. అచ్చు - సంఖ్య - మొహురు - సంతకం - నీటి జాడలు - అన్నీ బాగున్నాయి. కాయితం ఫెళఫెళమంటూ కంజిర చర్మంలాగుంది.

సరే అని నోటుని ఒక కవరలోపెట్టి - శ్రీ కొచ్చెర్లకోట రామస్వామిగారు ఆంధ్ర రైతు సంఘం-36, బలరామదాసు వీధి - కొండి తోపు, చెన్నపట్నం" అనివ్రాసి పోస్టులో వేశాను.

"పతివ్రత? - పవిత్రత? - పతిత?" - అను కుంటూ నువ్వుకున్నాను.

మధ్యాహ్నం తుఫాను మెయిలులో ఢిల్లీ వెళ్ళిపోయాం...

రైలుకూడా "పతివ్రత - పవిత్రత - పతిత" అంటూ - గుప్పు గుప్పు అని చప్పుడు చేస్తూ సాగిపోయింది!

76 అతడు

పదిహేనురోజులై - ఇంట్లో ఒక్కడనే అయిపోయాను, శాంతం, పాపాయి లేకపోవడం - ఇల్లు, మనసు చీకట్లు క్రమ్మినట్టేవుంది.

ఏకాంతం - ఏకాంతం అంటారు. నాకు ఒక్కడనే వుండడం అంటే తోచదు. తోచదు సరికదా - గాభరా వస్తుంది - గుండె ఝల్లుమంటుంది. ఆ నిశ్శబ్దం అంతా ఒక పెను భూతంలాగు నన్ను ఆవరించి మింగేస్తుందేమో అని పెద్ద దిగులు. మరా ఇంగ్లీషు భావకవులు, తెలుగు భావకవులు ఏకాంతం మీద అదే కవిత్వం చెప్పి పోయారు! వాళ్ళు లండను లోను, వీళ్ళు చెన్నపట్నంలోను మకాం వేసుకుని పద్యాలు అల్లేరేమో అనిపిస్తుంది.

నేషనల్ స్టీలు కేసులో జస్టిస్ మాసిలామణి నా పక్షమే తీర్పు చెప్పాడు - నూటముప్పై ఆరు పేజీలు! కాని - ఆ తీర్పు చదువుతూంటే-కాళిదాసు, షేక్స్పియరు, బెర్నార్డుషా- ముగ్గురు కలిసి నాటకం వ్రాసినా - ఆ రక్తి కట్టదనిపించిపోతే - ఇంకేమిటి! ఖాయిదా కొట్టులో లాభం - మధ్యవర్తి ఋసుం - సొంత వ్యాపారంలో ఆదాయం - వీటి గురించి చెప్పి పోయాడా తీర్పులో - వింటూంటే తన్మయం అయిపోయాను. నా వాదనలన్నీ శాంతం సలహామీద నేను క్లేటన్ గ్రంథంలో నుంచి ఉదాహరించిన వ్యాసం పేజీతో సహా-వల్లించేసి-వాటికి శంకర భాష్యం చెప్పేవాడు. ఆ హైకోర్టు ఛాంబర్సులో ఆయన తీర్పు చదువుతూంటే-నాకు నిర్వికల్ప సమాధిలో వున్నట్టే అనిపించింది. ఆయన గొంతుక ఆగిపోయింది - నేను స్థూల ప్రపంచకంలో పడ్డా.

పడడమేమిటి? చేతిలో పదివేల రూపాయలకి చెక్కు పడింది! బ్లాక్‌స్టోను దొర అమాంతంగా నన్ను కౌగలించుకుని - చెక్కు చేతిలో పెట్టాడు!...

మనసుకు ఆనందం లేదు. శాంతం చెప్పడం అయిపోయింది - అవతలవాళ్ళు ప్రివీకౌన్సిలుకి అప్పీలు చెయ్యడానికి అనుమతి అడుగుతారేమో అని కనిపెట్టుకుని కూచున్నా - ఆ మిల్లరూ, సంతానకృష్ణను - దంగెత్తిపోయి లేవందే. కొంపతీసి అప్పీలు దాఖలు చెయ్యడం మానెయ్యరుకదా? అవతలవాళ్లు లండను కంపెనీ ఆయె - అంత పొరపాటు చేస్తారా? వాళ్ళ సొలిసిటర్లు చెయ్యనిస్తారా?

రాత్రిపూట క్లబ్బుల్లోనూ, స్నేహితుల ఇళ్ళల్లోనూ భోజనం చేసి కాలక్షేపం చేస్తున్నా. ఈవేళ ఎక్కడా వారంలేదు. ఇంటికొచ్చి గదులన్నీ పచారు చెయ్యడం మొదలెట్టా - ఏదిచూసినా - ఎక్కడ చూసినా - శాంతమే కనిపిస్తుంది. "ఇందుగల దందులేదని సందేహము వలదు".... దేవుడు - భక్తుడు, ప్రకృతి - పురుషుడు, ప్రియుడు - ప్రేయసి... మళ్ళీ అక్కడికే - వస్తాం.

ఒకరినొకరం ప్రేమించి, మోహించి పెళ్ళిచేసుకున్నాం. ఇద్దరమూ...కొద్దో గొప్పో చదువుకొన్నవాళ్ళం. ధర్మేచ - అర్థేచ - కామేచ - కలిసే సంసారం ఈదుకుపోతున్నాం. మొదట్లో కలతలూ, గిల్లికజ్జాలు వచ్చేవి. ఆ ప్రణయ కలహాలూ, సరిపెట్టుకోవడమే ఒక పరమానందంగా వుండేది. సరిపెట్టుకుని ఆనందించేవాళ్ళం. తరువాత - అభిప్రాయభేదాలు - తర్జన భర్జనలు వచ్చినా - అప్పుడూ సర్దుకునేవాళ్ళం. ఆ సర్దుకుపోవడమే ఒక సంతోషంగా వుండేది. ఖద్దరూ - సత్యాగ్రహం - అందులో కూడా ఏదో వొకమోస్తరు సంసార పక్షంగానూ సరదాగానూ రాజీపడ్డామూ అనుకునేసరికి - మళ్ళీ నేనే యీ ఎన్నికలలో నిలబడడం వొకటి లేవదీశాను.

- ఇంకా వుంది.

గుజరాత్ ముఖ్యమంత్రిగా వరుసగా రెండోసారి బాధ్యతలు చేపట్టింది ఎవరు?

◆ఢిల్లీ కంటోన్మెంట్‌ను అత్యుత్తమంగా తీర్చిదిద్దినందుకుగాను దాని సీఈవోగా పనిచేస్తున్న తెలుగు అధికారి బి.రెడ్డి శంకరబాబుకు ఏ అవార్డు దక్కింది ?

- రక్ష మంత్రి ఆఫ్ ఎక్సలెన్స్

◆బీడబ్ల్యూ బిజినెస్ వరల్డ్ ఐదవ స్మార్ట్‌సిటీస్ కాన్‌క్లేవ్ అవార్డుల కార్యక్రమంలో 'అర్బన్ లీడర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును అందుకున్నది ఎవరు ?

- తెలంగాణ మంత్రి కె.తారక రామారావు

◆దేశంలో తొలి ఏసీ సబర్బన్ రైలు 2017 డిసెంబర్ 25న ఏ నగరంలో అందుబాటులోకి వచ్చింది ? **- ముంబయిలో**

◆దివ్యాంగులకు అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ సాయం ద్వారా నడిచే ఉన్నత విద్యాసంస్థల ప్రవేశాల్లో ఎంత శాతానికి తగ్గకుండా రిజర్వేషన్లు అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది ?

- 5 శాతానికి

◆ఓబీసీల ఉప వర్గీకరణపై ఏర్పాటు చేసిన జస్టిస్ జి.రోహిణి కమిషన్ కాల పరిమితిని కేంద్రం ఎప్పటివరకు పొడిగించింది ?

- 2018 ఏప్రిల్ 2

◆కనుచూపుమేరలో ఉన్న భూమిని దాటుకు వెళ్లవచ్చని. ఆకాశంలోనూ నడవవచ్చని ప్రపంచానికి తొలిసారి చాటిచెప్పిన అంతరిక్ష యోధుడు 2017 డిసెంబర్ 21న మరణించాడు. ఆయన పేరు ఏమిటి ? **- బ్రూస్ మెక్ కాండ్లెస్స్**

◆టర్కీ ఓపెన్ అంతర్జాతీయ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అండర్-19 బాలికల సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచింది ఎవరు ?

- హైదరాబాద్ అమ్మాయి జక్కా వైష్ణవి రెడ్డి

◆శాస్త్ర, సాంకేతిక శాఖలోని బయోటెక్నాలజీ విభాగం అందజేసే ప్రఖ్యాత 'ఇన్నోవేటివ్ యంగ్ బయోటెక్నాలజిస్ట్' అవార్డుకు ఎవరు ఎంపికయ్యారు ? **- ప్రణీత సారంగి**

◆సమాజ హితం కోసం కృషిచేసే వ్యక్తుల గురించి సానుకూల కథనాలను ప్రచురించే 'ది బెటర్ ఇండియా' సంస్థ జాబితాలో రాచకొండ పోలీస్ కమిషనర్‌కు చోటు దక్కింది. ఆయన పేరు ఏమిటి ? **- మహేశ్ భగవత్**

◆ఇండోనేషియాలోని తిమోర్ లెస్తే ద్వీపానికి ఉత్తరాన కేవలం 81 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న కొత్త ద్వీపాన్ని ఆస్ట్రేలియా జాతీయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు తాజాగా కనుగొన్నారు. దాని పేరు ఏమిటి ? **- కిసర్**

◆ జౌళి. సంబంధిత రంగాల్లో ఉద్యోగాలను సృష్టించే లక్ష్యంతో కొత్త నైపుణ్యాభివృద్ధి పథకానికి కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇందుకోసం ఎన్నికోట్ల రూపాయలను కేటాయించింది ?

- రూ.1,300 కోట్లు

◆భారతీయ అటవీ చట్టం సవరణల బిల్లుకు పార్లమెంటు 2017 డిసెంబర్ 27న ఆమోదం తెలిపింది. దీంతో ఏ కర్రలను



వాణిజ్యపరంగా ఉపయోగించుకోవడానికి మార్గం సుగమం అయింది ? **- వెదురు**

◆శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో ఆల్‌రౌండ్ ఆటతో రాణించిన టీమ్ ఇండియా 2-1 తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. భారత్‌కు ఇది వరుసగా ఎన్నో ద్వైపాక్షిక వన్డే సిరీస్ విజయం ?

- ఎనిమిదో ద్వైపాక్షిక వన్డే సిరీస్ విజయం

◆అనువాదం తెలుగు విభాగంలో వెన్న వల్లభరావు రాసిన ఏ రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది ?

- విరామమెరుగని పయనం

◆ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ తయారీ రంగ పరిశ్రమలకు అవసరమైన అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు కలిగి ఉన్నందుకు శ్రీసిటీకి ఏ అవార్డు లభించింది ?

- ప్రతిష్ఠాత్మక బ్రాండ్ ఆఫ్ ఆసియా అవార్డు

◆బొగ్గు కుంభకోణానికి సంబంధించి జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధుకోడా. బొగ్గు శాఖ మాజీ కార్యదర్శి హెచ్.సి. గుప్తాలకు ఎన్నేళ్లు జైలుశిక్షను విధిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పు చెప్పింది ?

కరెంట్ ఎఫైర్స్ బిట్‌బ్యాంక్

- మూడేళ్లు

◆'మిస్ ఇండియా యూఎస్ఏ-2017' పోటీలలో విజేతగా నిలిచింది ఎవరు ? - వాషింగ్టన్ రాష్ట్రానికి చెందిన శ్రీసైని

◆విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) చైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు ? - ప్రొఫెసర్ ధీరేంద్రపాల్ సింగ్

◆2017 సంవత్సరానికిగాను ఏ పదాన్ని వర్డ్ ఆఫ్ ద ఇయర్‌గా గుర్తిస్తున్నట్లు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీస్ ప్రకటించింది ? - యూత్‌క్వేక్

◆2022 కామన్వెల్త్ క్రీడలను ఎక్కడ నిర్వహించనున్నారు ?

- ఇంగ్లాండ్‌లోని బర్మింగ్‌హామ్‌లో

◆ప్రతిష్ఠాత్మక 'ఐఎంఏ డాక్టర్ ఎంజీ గార్గ్ జీవితకాల సాఫల్య పురస్కారం' ఎవరిని వరించింది ? **- డాక్టర్ నాగేశ్వరరెడ్డి**

◆నాలుగున్నర దశాబ్దాలపాటు (1972 నుంచి) దేశానికి సేవలందించిన ఏ హెలికాప్టర్‌కు బెంగళూరు యలహంకలోని ఎయిర్‌బేస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎయిర్ మార్షల్ ఎస్.ఆర్.కె.నాయర్. ఇతర వైమానికదళ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు ? **- ఎంఐ-8 ప్రతాప్**

◆నానో ఎలక్ట్రానిక్స్ రంగంలో చేస్తున్న పరిశోధనలకు గుర్తింపుగా ఐఎస్ఈఏ.. ఐఐటీ హైదరాబాద్ సహా ఆచార్యురాలు డాక్టర్ సుష్మీ బదులికాను ఏ పురస్కారంతో సత్కరించింది ?

- యంగ్ ఇంజినీర్ - 2017 పురస్కారం

◆ఢాకాలో జరిగిన శాఫ్ అండర్-15 మహిళా ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది ఎవరు ?

- ఆతిథ్య బంగ్లాదేశ్

◆ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ సూపర్ సిరీస్ ఫైనల్స్‌లో విజేతగా నిలిచింది ఎవరు ?

- జపాన్ స్టార్ క్రీడాకారిణి అకానె యమగుచి

◆గుర్జర్లు/ గుజ్జర్లు సహా 5 కులాలకు ఎంతశాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాజస్థాన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది ?

- ఒక శాతం

◆ఫోర్బ్స్ మ్యాగజైన్ 2017కుగాను భారత్‌లో అత్యధికంగా ఆర్జించిన వినోదరంగ ప్రముఖులతో రూపొందించిన జాబితాలో వరుసగా రెండో ఏడాదీ అగ్రస్థానంలో నిలిచింది ఎవరు ?

- బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్

◆ ప్రఖ్యాత మీడియా సంస్థ బ్రిటీష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) ఏటా అందించే క్రీడా పురస్కారాల్లో ఈసారి 'విదేశీ అత్యుత్తమ క్రీడాకారుడు' అవార్డుకు ఎవరు ఎంపికయ్యారు ?

- రోజర్ ఫెదరర్

◆ప్రపంచవ్యాప్తంగా విదేశాల్లో ఎక్కువగా ఉంటున్న వారి జాబితాలో ఏ దేశీయులు మొదటిస్థానంలో ఉన్నారని ఐరాస విడుదల చేసిన 'అంతర్జాతీయ వలస నివేదిక' ఒకటి పేర్కొంది ?

- భారతీయులు

◆గుజరాత్ ముఖ్యమంత్రిగా వరుసగా రెండోసారి పదవిని చేపట్టింది ఎవరు ? **- విజయ్ రూపానీ**

◆ కేంద్రం తరఫున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యావరణ ప్రభావిత అంచనా అథారిటీ ఏర్పాటుపై గెజిట్ నోటిఫికేషన్ వెలువడింది. ఈ అథారిటీ చైర్మన్‌గా ఎవరు వ్యవహరిస్తారు ?

- విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎస్.బాలసుబ్రహ్మణ్యం

◆అభివృద్ధికి దూరంగా ఉన్న ఈశాన్య భారత రాష్ట్రాలలో ప్రాంతీయ, జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ, అనుసంధానం కోసం వచ్చే రెండు మూడేళ్లలో ఎన్ని వేల కోట్ల రూపాయలను వెచ్చించనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోడీ వెల్లడించారు ? **- రూ. 90 వేల కోట్లు**

◆జాతీయ హరిత ట్రిబ్యునల్ తాత్కాలిక చైర్మన్‌గా 2017 డిసెంబర్ 20న ఎవరు బాధ్యతలు స్వీకరించారు ?

- జస్టిస్ ఉమేష్ దత్తాత్రేయ సల్వీ

◆హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా 2017 డిసెంబర్ 27న ప్రమాణ స్వీకారం చేసింది ఎవరు ? **- జైరాం ఠాకూర్**

◆స్టార్ రెజ్లర్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత సుశీల్‌కుమార్ కామన్వెల్త్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఏ పతకం సాధించాడు ?

- స్వర్ణ పతకం

◆ప్రసిద్ధ అంతర్జాతీయ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శిగా ఎవరు ఎంపికయ్యారు ?

- భారతీయ మూలాలున్న దక్షిణాఫ్రికా ఉద్యమకారుడు కుమీ నాయుడు

◆ప్రపంచంలోనే అతిపెద్ద ఉభయచర విమానం 2017 డిసెంబర్ 24న తొలిసారిగా గాలిలోకి ఎగిరింది. స్వదేశీ పరిజ్ఞానంతో చైనా అభివృద్ధి చేసిన ఈ విమానం పేరు ఏమిటి ? - కున్లంగ్ (ఏజీ600)



◆ఇంటర్నెట్ సమానత్వం నిబంధనలను ఉపసంహరించు కోవాలని ఏ దేశ టెలికాం నియంత్రణ విభాగం నిర్ణయించింది ?

- అమెరికా

◆టీ20 క్రికెట్‌లో అత్యధిక ఔట్లలో పాలుపంచుకున్న వికెట్ కీపర్ లేదా ఫీల్డర్‌గా ధోని ప్రపంచ రికార్డు సృష్టించాడు. 74 ఔట్లలో పాలుపంచుకోవడం ద్వారా ధోని ఎవరి రికార్డును బద్దలు కొట్టాడు ? **- డివిలియర్స్ (72)**

◆భారత క్రికెట్ ఆటగాడు రోహిత్‌శర్మ టీ 20ల్లో అత్యంత వేగవంతమైన (35 బంతులు) సెంచరీని చేయడం ద్వారా ఎవరి పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు ?

- దక్షిణాఫ్రికా క్రికెటర్ డేవిడ్ మిల్లర్

◆ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యునెస్కో సంయుక్త భాగస్వామ్యంతో టెక్ సదస్సు-2017ను ఎక్కడ నిర్వహించారు ?

- విశాఖపట్నంలో

◆దేశవాళీ అండర్- 23 కల్నల్ సీకే నాయుడు ట్రోఫీని ఏ జట్టు కైవసం చేసుకుంది ? **- ఢిల్లీ**

◆2017 సంవత్సరానికిగాను అరుణ్‌సాగర్ సాహితీ పురస్కారానికి ఎవరు ఎంపికయ్యారు ?

- ప్రముఖ కవి, గాయకుడు గోరేటి వెంకన్న

◆జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో కొత్త ఛాంపియన్‌గా అవతరించింది ఎవరు ?

- రవికుమార్

◆మెక్‌లాయిడ్ రస్సెల్ టూర్ - 2017 ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది ఎవరు ?

- భారత యువ గోల్ఫర్ శుభాంకర్ శర్మ

◆టీ 20 క్రికెట్‌లో 400 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా చరిత్రకెక్కింది ఎవరు ? **- వెస్టిండీస్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో**

◆ప్రముఖ రచయిత దేవీప్రియ రాసిన ఏ కవితా సంపుటి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైంది ?

- గాలి రంగు

◆భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఫిఫా ర్యాంకింగ్స్‌లో ఎన్నవ స్థానంతో ఈ ఏడాది (2017)ని ముగించింది ?

- 105వ స్థానంతో

◆2017 సంవత్సరానికిగాను వాసిరెడ్డి సీతాదేవి- వంశీ సాహితీ పురస్కారానికి ఎవరు ఎంపికయ్యారు ?

- ప్రముఖ రచయిత్రి కుప్పిలి పద్మ

◆పిన్నమనేని సీతాదేవి అవార్డు - 2017కు ఎవరు ఎంపికయ్యారు ? **- టెస్సీ థామస్**

◆గ్రంథాలయం, సమాచార సేవల సమాజానికి చేసిన సేవలకుగాను రామోజీ ఫిల్మ్‌సిటీలోని రామోజీ విజ్ఞాన కేంద్రంలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సునీతా కోయాకు 2017 డిసెంబర్ 15న ఏ అవార్డును బహూకరించారు ?

- ఉత్తమ మీడియా వృత్తి నిపుణురాలి అవార్డు - 2017


పర్సనాలిటీ టెస్ట్‌కు ప్రిపరేషన్ ఇలా..

సివిల్ సర్వీసెస్ మెయిన్స్ ఫలితాలు వెలువడ్డాయి. దీనిలో నెగ్గినవారికి పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)ని త్వరలో నిర్వహించబోతున్నారు. సివిల్స్ మొత్తం 2025 మార్కుల్లో ఇంటర్వ్యూ మార్కులు 275 (13.5 శాతం) మాత్రమే. కానీ మెరిట్‌ను నిర్ణయించటంలో దీని ప్రభావం 30 శాతానికి పైగానే! ముఖాముఖిలో అభ్యర్థి వాస్తవ స్వభావాన్ని అంచనా వేసేందుకు పలు రకాల ప్రశ్నలు వేస్తున్నారు. అందుకు తగిన విధంగా సిద్ధం కావడం చాలా అవసరం. సివిల్స్ ఎంపిక ప్రక్రియలో చివరిదైన ఈ ఇంటర్వ్యూకు ముందస్తుగా తయారయ్యేందుకు.. ఇవిగో సూచనలు!

టాపర్ల మార్కులను పరిశీలిస్తే వారు మెయిన్స్‌తో పాటు ఇంటర్వ్యూలోనూ అత్యధిక మార్కులు సాధించటం కనిపిస్తుంది. ఇంటర్వ్యూలో కొద్దిపాటి అదనపు మార్కులు కనీసం 10 ర్యాంకుల కంటే ముందుండేలా చేస్తాయి. మరో రకంగా చూస్తే... ఇంటర్వ్యూలో 2-3 మార్కులు తక్కువ వస్తే 3-4 ర్యాంకులు తగ్గి తక్కువ సర్వీసుతో సరిపెట్టు కోవాల్సి రావచ్చు.

ముందస్తు సన్నద్ధత ఎలా?

అభ్యర్థి వ్యక్తిగతమైన, విద్యాపరమైన, సివిల్స్ ఆప్షనల్‌కు సంబంధించిన ప్రశ్నలను ఇంటర్వ్యూలో



అడుగుతారు. ఇంకా వర్తమాన అంశాలు, అభిరుచులపై ప్రశ్నలను కూడా సంధిస్తారు.

●బయోడేటా ఆధారంగా అడిగే ప్రశ్నలను ఒక కాగితం మీద రాసుకొని, వాటికి జవాబులు సిద్ధం చేసుకోండి. 'సివిల్ సర్వీసుల్లో చేరాలని ఎందుకు కోరుకుంటున్నారు?' లాంటి ప్రశ్నలకూ; మీ అభిరుచి పుస్తక పఠనమైతే... 'ఏ పుస్తకం చదివారు?' లాంటివాటికీ సిద్ధం కావాలి.

●వర్తమానాంశాలను ఒక జాతీయ పత్రిక నుంచీ. మరో ప్రాంతీయ పత్రిక నుంచీ సేకరించండి. జనవరి 2017 నుంచి అత్యంత ముఖ్యమైన పరిణామాలను కాలక్రమానుగుణంగా రాయండి. వార్తాపత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో చర్చలు జరిగిన అంశాలను ఆ జాబితాలోంచి గుర్తించండి.

●ఒక్కో సమస్యను తీసుకుని, దాని అనుకూల, ప్రతికూల కోణాలను రాయండి. తర్వాత దానికి సంబంధించిన ప్రశ్నలు ఊహించి సమాధానాలు చెప్పటానికి ప్రయత్నించండి.

●బయోడేటాపైనా, వర్తమాన అంశాలపైనా నమూనా ఇంటర్వ్యూలకు హాజరుకండి.

●వాటిలో మీరు మెరుగుపరచుకోవాల్సిన అంశాలను గుర్తించండి.

●వీలైతే- అదే బోర్డు నిర్వహించే నమూనా ఇంటర్వ్యూకు హాజరుకండి. మీ సమాధానాల్లో మెరుగుదల కనిపించిందేమో అడిగి సలహాలు తీసుకోండి.

●రెండు మూడు నమూనా ఇంటర్వ్యూలు సరిపోతాయి.

●సలహాలు తీసుకోవటం గానీ, నమూనా ఇంటర్వ్యూలకు హాజరవడం గానీ వాస్తవ మౌఖిక పరీక్షకు ఐదు రోజుల ముందు ఆపివేయడం మంచిది. ఆపై ప్రశాంత వాతావరణంలో సొంతంగా సిద్ధమవటంపై దృష్టిపెట్టాలి.

తెలుగులో జవాబులు చెప్పొచ్చా?

1. మెయిన్స్ ఇంగ్లీష్‌లో రాశాను. ఇంటర్వ్యూ తెలుగులో చేయవచ్చా?

● గతంలో అయితే మెయిన్స్ పరీక్షను ప్రాంతీయభాషలో రాసినప్పుడు మాత్రమే ఆ సదుపాయం ఉండేది. కానీ బి.బి. భట్టాచార్య కమిటీ సిఫార్సుల మేరకు 2011 నుంచీ మెయిన్ పరీక్షలో రాసిన మీడియంతో సంబంధం లేకుండా ఇంటర్వ్యూ మీడియాన్ని ఎంచుకోవటానికి వీలవుతోంది. కాబట్టి మెయిన్స్‌ను ఇంగ్లీష్‌లో రాసినప్పటికీ ఇంటర్వ్యూను తెలుగులో చేయవచ్చు.

2. కనీస అర్హత మార్కులుంటాయా?

● ఇంటర్వ్యూలో అలాంటివేమీ లేవు. సాధారణంగా అభ్యర్థి ప్రతిభా ప్రదర్శన ఎలా ఉన్నప్పటికీ కనీసం 35 శాతం మార్కులను బోర్డు వేస్తుంటుంది.

3. ఇటీవలికాలంలో సివిల్స్ ఇంటర్వ్యూ పద్ధతిలో మార్పు ఏమైనా వచ్చిందా?

●కొద్ది సంవత్సరాలుగా ప్రశ్నల స్వభావంలో మార్పు కనిపిస్తోంది. నిగ్వేకర్ కమిటీ సిఫార్సుల ఫలితంగా.. అభ్యర్థి వాస్తవ స్వభావాన్ని వెలికితీసే పదునైన ప్రశ్నలు అడుగుతున్నారు. సాంప్రదాయిక అంశాలతోపాటు అభ్యర్థి స్వభావం, ధోరణి, విలువలను గ్రహించేలా ప్రశ్నలను సంధించి పరీక్షిస్తున్నారు.

యూపీఎస్సీలో 23వివిధ ఖాళీలు



యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. వివిధ విభాగా ల్లోని 23 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు: స్పెషలిస్ట్ గ్రేడ్(3) అసిస్టెంట్ ప్రొఫెసర్(పీడియాట్రిక్ సర్జరీ)-2; కెమిస్ట్(ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్)-3; డిప్యూటీ డైరెక్టర్(ఎగ్జామినేషన్ రిఫార్మ్స్)-1; సైంటిస్ట్ 'బి'(హైడ్రోమెటియొరాలజిస్ట్)-6; మెడికల్ ఆఫీసర్-11.

వేతనశ్రేణి: అసిస్టెంట్ ప్రొఫెసర్, డిప్యూటీ డైరెక్టర్, మెడికల్ ఆఫీసర్ పోస్టులకు - 15,600-రూ.39,100; కెమిస్ట్, సైంటిస్ట్ 'బి' పోస్టులకు - రూ.56,100 - రూ. 1,77,500.

అర్హతలు : సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఎంబీబీఎస్/ మాస్టర్స్ డిగ్రీ/ పీజీడిప్లొమా/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం తదితరం ఉండాలి.

వయస్సు : అసిస్టెంట్ ప్రొఫెసర్, డిప్యూటీ డైరెక్టర్‌కు -40 ఏళ్లు; కెమిస్ట్, సైంటిస్ట్ 'బి', మెడికల్ ఆఫీసర్‌కు-35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ.

దరఖాస్తు రుసుం: రూ.25; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్

చివరి తేదీ: ఫిబ్రవరి 1, 2018.

వెబ్‌సైట్ : http://www.upsc.gov.in/, https://upsconline.nic.in/

విశాలాంధ్ర బిజినెస్

232.81 ▲ సెన్సెక్స్ 36,283.25	60.75 ▲ నిఫ్టీ 11,130.40	300 బంగారం (విజయవాడ) 28,900 22 క్యారెట్లు, 10 గ్రాములు	బంగారం (విశాఖపట్నం) 28,980 ప్రొద్దుటూరు 29,260 22 క్యారెట్లు, 10 గ్రాములు	300 ▼ వెండి (విజయవాడ) 40,700 కిలో (రూపాయల్లో)	వెండి (విశాఖపట్నం) 40,750 ప్రొద్దుటూరు 43,064 కిలో (రూపాయల్లో)	డాలరు Vs రూపాయి 63.57

బడ్జెట్‌పై గంపెడాశ !

- 80సీ పరిమితి పెంపు?
- మధ్యతరగతి, వేతన జీవులకు ఊరట..
- మరింత పన్ను ప్రయోజనాలు
- అధిక నిధుల కోసం మంత్రిత్వశాఖల పట్టు



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై అన్ని వర్గాల ప్రజలు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. గడచిన నాలుగు బడ్జెట్‌లలో కనీసం పేదలను పట్టించుకోని మోడీ ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ఎన్నికల వరాలు కురిపిస్తుందని ఆశిస్తున్నారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి అనేక ప్రజావ్యతిరేక చర్యలు చేపట్టిన కేంద్రం...ఈ బడ్జెట్‌లో కొంతమేరకైనా ప్రజలకు ఊరట కలిగిస్తుందని అనుకుంటున్నారు. మధ్యతరగతి వర్గాలు, ముఖ్యంగా వేతన జీవులకు, స్వల్ప పెట్టుబడులకు ఆసక్తి కనబరిచే సగటు మదుపరులకు రాబోయే బడ్జెట్.. వరాల జల్లు కురిపించే అవకాశాలు కనిపిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ. 2.50 లక్షల నుంచి కనిష్ఠంగా రూ.3 లక్షలకు, గరిష్ఠంగా 5 లక్షలకు పెంచే వీలుందని తెలుస్తుండగా, ఇప్పుడు సెక్షన్ 80సీ పరిమితిని పెంచే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇదే జరిగితే పన్ను చెల్లింపుదారులకు కొంతమేరకు ప్రయోజనాలు లభించవచ్చు. ఆదాయ పన్ను చట్టం, 1961లో సెక్షన్ 80సీ అనేది ప్రాథమికంగా ఓ పెట్టుబడి ఆధారిత పన్ను శ్లాబ్. ప్రస్తుతం సెక్షన్ 80సీలో వార్షిక స్థూల ఆదాయంలో రూ. 1.50 లక్షల వరకే పన్ను మినహాయింపు ఉన్నది. దీన్ని రూ.2 లక్షలకు పెంచుతారని అంచనా. చివరిసారిగా 2014-15 బడ్జెట్‌లో సెక్షన్ 80సీ పెట్టుబడి పరిమితిని లక్ష నుంచి లక్షన్నరకు పెంచారు. జీవిత బీమా, ఈక్విటీ సంబంధిత పొదుపు పథకాలు (ఈఎల్ఎస్ఎస్), పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ), ఐదేళ్ల నోటిఫైడ్ ట్యాక్స్-సేవింగ్ బ్యాంక్ డిపాజిట్లు, ఐదేళ్ల కాలపరిమితి కలిగిన తపాలా శాఖ డిపాజిట్లు, సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్), సుకన్య సమృద్ధి ఖాతా, ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్) తదితర వాటిల్లో పెట్టుబడులకు సెక్షన్ 80సీ పన్ను రాయితీలు వర్తిస్తాయి. అంతేగాక ట్యూషన్ ఫీజులు, గృహ రుణాల చెల్లింపులపైనా ప్రయోజనం ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రధానంగా గృహరుణాలపై ప్రిన్సిపల్ అమౌంట్ చెల్లింపుల విషయంలో అదనపు ప్రయోజనం రూ.50 వేల వరకు ఉంటుంది. అందుకే చాలామంది పన్ను చెల్లింపుదారులు సెక్షన్ 80సీ పరిమితిని పెంచాలని డిమాండు చేస్తున్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరుగుతుండటంతో ఈసారి బడ్జెట్‌లో ఈ డిమాండు నెరవేరే అవకాశాలే కనిపిస్తున్నాయి. ఈ పెంపు అధిక వేతన ఉద్యోగులకూ ఉపయోగకరమే. పన్ను చెల్లింపుదారుల నుంచి వ్యతిరేకత వస్తుండటంతో ఆదాయ అంచనాల స్వచ్ఛంద నివేదిక ప్రతిపాదనను కేంద్రం ఉపసంహరించుకోవచ్చన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) అర్బన్ పథకానికి నిధులను మూడింతలు పెంచాలని గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ కోరుతున్నది. ఈ పథకం కింద పేదలకు 1.2 కోట్ల ఇళ్ల నిర్మాణాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నందున మరిన్ని నిధులు అవసరమని ఆర్థికమంత్రిత్వ శాఖకు విన్నవిస్తున్నది. ఇప్పటిదాకా 37.5 లక్షల ఇళ్లకే ఆమోదం లభించిన విషయాన్ని గుర్తుచేస్తున్నది. రెరా, పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటి నిర్ణయాలతో తీవ్రంగా ప్రభావితమైన నిర్మాణ రంగం వచ్చే బడ్జెట్‌లో జీఎస్టీని తగ్గించి, మౌలిక రంగ హోదాను కల్పించాలని డిమాండు చేస్తున్నది. 2016లో 1,75,822 యూనిట్లు ప్రారంభించిన రియల్టర్లు...2017లో 1,03,570 యూనిట్లకు పరిమితమయ్యారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ సంస్కరణల కారణంగానే కొనుగోళ్ల సామర్థ్యం దెబ్బతిన్నదంటున్న రియల్ ఎస్టేట్ వర్గాలు.. రాబోయే బడ్జెట్‌లో నైనా పరిశ్రమ బలోపేతానికి చర్యలు చేపట్టాల్సిన అవసరముందని డిమాండు చేస్తున్నాయి. ఉద్యోగ కల్పనకు బడ్జెట్‌లో మరిన్ని నిధులు కేటాయించాలని వాణిజ్య, కార్మిక సంఘాలు డిమాండు చేస్తున్నాయి. రిటైల్ మార్కెట్‌లోకి విదేశీ సంస్థలను అనుమతించడం వల్ల ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద నోట్ల రద్దు నిర్ణయం ప్రతికూలమైందని జైట్లీతో జరిగిన బడ్జెట్ సంప్రదింపుల్లో కుండబద్దలు కొట్టినట్టు చెప్పామని, ఉద్యోగ సృష్టికి ఊతమిచ్చే ప్రకటనలు చేయాలని కోరినట్లు ఏఐటీయూసీ వెల్లడించింది. మరోవైపు బడ్జెట్‌లో డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ (డీడీటీ) రేటును 10 శాతానికి హేతుబద్ధీకరించాలని పారిశ్రామిక సమాఖ్య సీఐఐ కోరింది.

మార్కెట్లు అదరహో...!

- 12ఏళ్ల తరువాత గరిష్ట లాభాలు
- 320 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- హెచ్‌డీఎఫ్‌సీ, మారుతిసుజుకి, టీసీఎస్ ర్యాలీ



ముంబై: బడ్జెట్‌కు ముందు దేశీయ మార్కెట్లు రికార్డు స్థాయిలో లాభాల్లో నమోదుకావడం 12ఏళ్ల తరువాతం ఇదే నంటున్నారు విశ్లేషకులు. 2006 బడ్జెట్ సమావేశాలకు ముందు సెన్సెక్స్ 5శాతం లాభపడి సమావేశాల అనంతరం 7శాతం పెరిగింది. 2007 బడ్జెట్ సమావేశం ముందు సెన్సెక్స్ భారీ పతనమై 9శాతం నష్టపోయింది. గత ఏడాదివరకు సూచీలు బడ్జెట్ ముందు నష్టాల్లోనే నమోదయ్యాయి. బడ్జెట్ తరువాతనే లాభాలునమోదు చేశాయి. ఈ ఏడాది సూచీలు భిన్నంగా చరిత్రను తిరగారస్తూ, ఈ నెలలో సెన్సెక్స్ 6శాతం లాభాలను నమోదుచేసింది. ఈ నెలలో 17న 35వేలు, 23న 36వేలు మార్కునుదాటాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నూతన గరిష్టాలను చేరాయి. ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలు, బడ్జెట్‌పై ప్రభావంచూపడంతో ఫిబ్రవరి డెరివేటివ్ సీజన్‌ను సూచీలు ఉత్సాహంగా ప్రారంభించి.. చాలా సేపు ఆ జోరును కొనసాగించాయి. ఒక దశలో సెన్సెక్స్ 350 పాయింట్లకు పైగా.. నిఫ్టీ దాదాపు 100 పాయింట్ల లాభంతో ట్రేడ్ అయ్యాయి. అయితే చివరి గంటల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో కాస్త ఒత్తిడికి గురైనప్పటికీ.. లాభాలను మాత్రం నిలబెట్టుకున్నాయి. కొత్త రికార్డుల్లో స్థిరపడ్డాయి. ఎకనామిక్ సర్వే నివేదిక ఆధారంతో 2018-19 ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధి శాతం 6.75 శాతం నుండి 7-7.5శాతానికి చేరవచ్చునని వెలుపడటంతో మార్కెట్లు లాభాల్లో కొనసాగేందుకు దోహదపడిందని చెప్పవచ్చు. సోమవారం నాటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 320.48 పాయింట్లు లాభపడి 0.89శాతంతో 36,370.92 వద్ద, నిఫ్టీ 77 పాయింట్ల లాభపడి 0.70శాతంతో 11,146.65 వద్ద ముగిశాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ రూ. 63.57గా కొనసాగుతోంది. బ్లు చిప్ కంపెనీలైన హెచ్‌డీఎఫ్‌సీ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఐసీఐసీఐ బ్యాంకు షేర్లు వారం ప్రథమార్థంలో లాభాల్లో ముగిశాయి. మార్నింగ్ ట్రేడింగ్ 20షేర్ల బారోమీటర్ 36,410.60 పాయింట్లుకుచేరింది. ప్రధానంగా మారుతి సుజుకీ, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ, టాటాస్టీల్, బజాజ్ ఆటో, కొటక్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్, ఎమ్ అండ్ ఎమ్,కోల్ ఇండియా. ఇన్ఫోసిస్, హీరో మోటాకార్ప్, సన్ ఫార్మా, ఎల్ అండ్ టీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఇండస్‌ఇండ్ బ్యాంకు సుమారు 3.42 శాతం లాభాల్లో ముగిసాయి. ఎన్ఎస్ఈ నిఫ్టీ 77పాయింట్ల ఆధిక్యతతో జనవరి 24న నమోదుచేసిన 11,110.10 పాయింట్లను దాటి 11,163.75 పాయింట్లను నమోదుచేసింది. గత మూడేళ్ల సరాసరి వృద్ధిరేటు 4శాతం పెరగడం, అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థల కంటే దాదాపు 3శాతం పాయింట్లు ఎక్కువగా నమోదుకావడం చూస్తే ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా రూపొందనుందని ఎకనామిక్ సర్వే వెల్లడించింది. సెక్టరల్ ఇండీసెస్ మెటల్,ఆటో, కాపిటల్ గూడ్స్ 1.58శాతంతో సానుకూలంగా ట్రేడయ్యాయి. విదేశీ మదుపరులు సోమవారం సుమారు 937.31 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా నమోదయ్యాయి. జపాన్ నిక్కిల 0.50శాతం, హాంగ్‌కాంగ్ హాంగ్‌సేంగ్ 0.24 శాతం దిగువన నమోదైంది. యుఎస్ డౌజోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 0.85శాతంతో నూతన గరిష్టాలకు చేరింది. ఐషర్ మోటార్స్, మారుతిసుజుకి, హెచ్‌డిఎఫ్‌సి, హెచ్‌యుఎల్, భారతిఇన్‌ఫ్రాటెల్,టిసిఎస్, హీరో మోటాకార్ప్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్,టాటా స్టీలు, కొటక్ మహీంద్రా, బజాజ్ ఆటో, టెక్ మహీంద్రా, ఎల్ అండ్ టీ, సన్‌ఫార్మా, ప్రధాన లబ్దిదారులుకాగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 1-4శాతానికి పెరిగింది.

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
మారుతి సుజుకి	9,715.00	3.85
హెడీఎఫ్‌సీ	1,982.00	2.66
టీసీఎస్	3,224.00	2.48
కోటాక్ మహీంద్ర	1,118.65	2.02
హీరో మోటోకార్ప్	3,654.00	1.97

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్	2,485.00	-5.92
భారతి ఎయిర్‌టెల్	449.70	-2.66
ఐటీసీ	283.10	-1.85
బీహెచ్ఈఎల్	104.15	-1.65
ఎస్ బ్యాంక్	363.75	-1.64

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.84	63.57
యూరో	78.04	78.95
పౌండ్	88.50	89.75
ఆస్ట్రేలియా డాలర్	51.01	51.47
సింగపూర్ డాలర్	48.34	48.56

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,980	30,995
చెన్నై	28,980	30,963
బెంగళూరు	28,650	30,642
ముంబై	29,850	31,925
విజయవాడ	28,900	30,300
విశాఖపట్నం	28,980	31,614
ప్రొద్దుటూరు	29,260	31,140

ముడి చమురు	70.52



రెండేళ్లలో లాజిస్టిక్స్ బూమ్

10 శాతం వృద్ధిలో 215 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ: భారతీయ లాజిస్టిక్స్ పరిశ్రమ గత 5 సంవత్సరాల్లో 7.8శాతం వృద్ధి నమోదుచేసి సుమారు 22మిలియన్లమందికి ఉపాధికల్పించింది. 160 బిలియన్ డాలర్ల విలువైన దేశీయ లాజిస్టిక్ పరిశ్రమ రానున్న రెండేళ్ల కాలంలో అంటే 2020 నాటికి 10.5శాతం వృద్ధి రేటుతో 215 డాలర్ల బిలియన్ డాలర్ల జీఎస్టీ అమలుతో వృద్ధిని నమోదుచేస్తుందని ఎకనామిక్ సర్వే తాజా నివేదిక సోమవారం పార్లమెంటులో వెల్లడించింది. ప్రపంచబ్యాంకు యొక్క 2016 లాజిస్టిక్స్ పెర్‌ఫార్మెన్స్ ఇండెక్స్ నివేదిక ఆధారంగా గ్లోబల్ ర్యాంకింగ్‌లో 2016లో 35వ స్థానాన్ని పొందిన భారత్ 2014లో 54వ ర్యాంకులో ఉందని, ప్రస్తుతం ఆరు కాంపోనెంట్స్‌లో మరింతగా రాణిస్తుందని తెలిపింది. ఈ రంగం యొక్క ప్రాముఖ్యతను గుర్తిస్తూ, అసమర్థతలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ రంగాన్ని మౌలికసదుపాయాల సబ్‌సెక్టార్‌లో హార్మొనైజ్డ్ మాస్టర్ లిస్ట్‌లో నమోదు చేయడంతో ఈ రంగం అనేకరకాలుగా అభివృద్ధి నమోదు చేసిందని తెలిపింది. సరళమైన వడ్డీరేట్లతో, రుణాలను సులభతరం చేయడంతో లాజిస్టిక్స్ రంగంలో నిర్మాణాలకు, ఇతర అవకాశాలైన స్టోరేజ్, రవాణా సదుపాయాలకు ఈ రంగం దోహదంచేస్తుంది. విస్తృతప్రాతిపదికలో, భారత దేశంలో లాజిస్టిక్స్‌రంగం అసంఘటితగా ఉందనీ పరిశ్రమల స్థాపనతో లాజిస్టిక్స్ అంతర్జాతీయంగా, దేశీయంగా మరింత వృద్ధిని నమోదుచేయగలదు.

చిక్కుల్లో వోక్స్‌వ్యాగన్, బీఎండబ్ల్యూ

కార్ల కోసం కోతులపై పరిశోధనలు!

న్యూఢిల్లీ: ప్రఖ్యాత కార్ల తయారీ కంపెనీలు వోక్స్‌వ్యాగన్, బీఎండబ్ల్యూ, డైమ్లర్ వివాదంలో చిక్కుకున్నాయి. డీజిల్ కార్లపై పరిశోధనలకుగాను ఈ కంపెనీలు కోతులను ఉపయోగించినట్టు అమెరికాకు చెందిన న్యూయార్క్ టైమ్స్ శుక్రవారం సంచలనాత్మక కథనాన్ని ప్రచురించింది. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మూడు సంస్థలు తమ పరిశోధనలను యూరోపియన్ రీసెర్చ్ గ్రూప్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ హెల్త్ ఇన్ ది ట్రాన్స్‌పోర్ట్ సెక్టార్ ద్వారా నిర్వహించినట్టు న్యూయార్క్ టైమ్స్ తెలిపింది. ఆ పత్రిక కథనం ప్రకారం ఈ రీసెర్చ్ 2014లో జరిగింది. పది కోతులను గ్యాస్ ఛాంబర్లలో పెట్టి.. వాటిల్లోకి డీజిల్ పొగను వదిలిపెట్టారు. ఆ సమయంలో వాటికి కార్టూన్లు చూపించారని కథనం ప్రచురించింది. ఇలాంటి పరిశోధనలు అర్థరహితమైనవని.. క్షమించరానివన్న విమర్శలు వస్తున్నాయి. మరోవైపు ఈ వార్తలను వోక్స్‌వ్యాగన్, బీఎండబ్ల్యూ, డైమ్లర్ ఖండించాయి. మూగజీవాలపై ఇలాంటి పరిశోధనలను తమ సంస్థలు ప్రోత్సహించవని తెలిపాయి. ఆరోపణలపై ఎంక్వైరీ కమిషన్ వేయాలని వోక్స్‌వ్యాగన్ కంపెనీ ప్రతినిధులు డిమాండు చేస్తున్నారు. అలాంటి పరిశో ధనలకు తమ కంపెనీ నిధులు సమకూర్చినట్టు భావిస్తే.. క్షమాపణలు కోరుతున్నట్టు వోక్స్‌వ్యాగన్ ప్రకటించింది.

50% పెరిగిన పరోక్ష పన్ను చెల్లింపుదారులు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) చట్టం అమలు తర్వాత దేశంలో 50శాతం పరోక్ష పన్ను చెల్లింపుదారులు పెరిగారు. 2016 నవంబరు నుండి దాదాపు 18లక్షల మంది వ్యక్తిగత చెల్లింపుదారులునమోదయ్యారు. రానున్న సంవత్సరం కాలంలో 34లక్షల వ్యాపారాలు పన్ను చెల్లింపు పరిధిలోకి రానున్నాయని ఎకనామిక్ సర్వే నివేదిక సోమవారం వెల్లడించింది. ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యన్ సర్వే ప్రకారం, జీఎస్టీలో ప్రధానంగా స్వచ్ఛంద సంస్థల నమోదుకారణంగా జీఎస్టీ రిజిస్ట్రేషన్లు పెరిగాయని అన్నారు. ముఖ్యంగా పెద్ద సంస్థలనుండి కొనుగోలుచేసిన చిన్న సంస్థలు టాక్స్ క్రెడిట్‌ను ఉపయోగించుకోనున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులకు భారీగా మూలధనం అందజేత, ఎఫ్‌డీఐల నిబంధనలను మరింత సరళం చేయడం ద్వారా, ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు కోలుకోవడం వంటి కారణాలతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థం నుంచి ఆర్థికాభివృద్ధి వేగవంతమైందని 'ఆర్థిక సర్వే' తెలిపింది. సాంఘిక భద్రతకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. ముఖ్యంగా ఈపీఎఫ్‌వో, ఈఎస్ఐసీల చెల్లింపులు కేవలం 31శాతం మాత్రమే ఉండేవి. జీఎస్టీ నెట్ అమల్లోకి వచ్చాక వీటి చెల్లింపుల వాటా 53శాతం పెరిగింది. రాష్ట్రాల నుంచి జరిగే విదేశీ ఎగుమతులను తొలిసారి ఆర్థిక సర్వేలో ప్రస్తావించారు. రాష్ట్రాల జీవన ప్రమాణాలకు, ఎగుమతులకు మధ్య బలమైన సంబంధాన్ని ఇది తెలిపింది. ఎగుమతులు, పొరుగు రాష్ట్రాలతో ఎక్కువ వ్యాపారాలు చేసే రాష్ట్రాలు ఆర్థికంగా పరిపుష్టంగా ఉన్నట్లు తేలింది. భారత ఎగుమతుల్లో దిగ్గజ కంపెనీలదే అధికభాగం. కానీ ఇతర దేశాల దిగ్గజ కంపెనీలు ఆయా దేశాల ఎగుమతుల్లో పొందుతున్న వాటాతో పోలిస్తే మాత్రం ఇది చాలా తక్కువ. భారత దిగ్గజ కంపెనీల ఎగుమతుల వాటా 30శాతం ఉంటే.. బ్రెజిల్ (72), జర్మనీ (68) మెక్సికో (67), అమెరికా(55)ల కంటే చాలా తక్కువ. జీఎస్టీ చెల్లింపులు జులైలో రూ.95వేలకోట్లకుపైనేకాగా ఆగస్టు 91వేలకోట్లుగా ఉంది. సెప్టెంబరులో 92వేల కోట్లు కాగా అక్టోబరులో 83 వేల కోట్లు, నవంబరులో 80వేల కోట్లు, డిసెంబరులో 86వేల కోట్లుగా నమోదైంది. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో జిఎస్‌టి రిజిస్ట్రేషన్లు అధికంగా నమోదయ్యాయి. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు అత్యధికంగా నమోదైన రాష్ట్రాల జాబితాలో ఉన్నాయి. రెడీమేడ్ దుస్తులపై రాష్ట్ర పన్నులు తగ్గడంతో ఎగుమతులు పెరిగాయి. ఈ పెరుగుదల దాదాపు 16శాతం వరకు ఉంది. భారత్‌లో తల్లదండ్రులకు మగపిల్లలు కావాలని కోరిక ఎక్కువ. వారు అనుకున్నంత మంది మగపిల్లల్ని కనే వరకూ సంతానోత్పత్తిని కొనసాగిస్తున్నారు. దీంతో స్త్రీ పురుష నిష్పత్తి పడిపోతున్న విషయాన్ని పేర్కొంది. పన్ను వసూళ్ల వివాదాల కేసుల్లో ప్రభుత్వం విజయం సాధిస్తున్న శాతం చాలా తక్కువగా ఉంది. 30శాతం కంటే తక్కువ కేసుల్లో విజయం సాధిస్తోంది. చిన్నకారణాలతో వివాదాల చిక్కుముడులు పడుతున్నాయి. కేసుల మొత్తం విలువలో 1.8శాతం విలువ కోసం 66 శాతం కేసులు నడుస్తున్నాయి. పొదుపు పెరిగినంత మాత్రాన ఆర్థిక వ్యవస్థలో వృద్ధి నమోదు కావడంలేదు. పెట్టుబడులు పెరిగితేనే వృద్ధి నమోదవుతోంది. ఇతర ప్రజాస్వామ్య దేశాలతో పోల్చుకుంటే భారత్‌లో రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాలు వసూలు చేస్తున్న పన్నులు చాలా తక్కువగా ఉంటున్నాయి. ఈవిషయంలో బ్రెజీల్, జర్మనీలు మనకన్నా ముందున్నాయి. భారత్‌లో వ్యవసాయంపై వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా ఉంది. భారీగా ఉష్ణోగ్రతలు, కరవు నెలకొన్నాయి. నీటి పారుదల వసతులతో సంబంధం లేకుండా ఇటువంటి పరిస్థితులు నెలకొన్నాయి.

విజ్ఞానం


ఎయిరోబిక్స్‌తో అల్జీమర్స్‌కి బ్రేక్...!



ఎయిరోబిక్ ఎక్సర్‌సైజులతో వయసుతో పాటు వచ్చే మతిమరుపు సమస్యలను అధిగమించవచ్చునని తెలుస్తోంది. ఎయిరోబిక్ వ్యాయామాల్లో భాగమైన స్పిన్నింగ్, రన్నింగ్, వాకింగ్‌లతో మూడురెట్లు అల్జీమర్స్ వ్యాధి నిరోధానికి తోడ్పడుతాయని అమెరికన్ గెరియాట్రిక్స్ సొసైటీ జర్నల్ ప్రచురించింది. వయసుతోపాటు వచ్చే అల్జీమర్స్ వ్యాధి నివారించడంతో పాటు కాగ్నిటివ్ పనితీరును మరింత మెరుగుపరుస్తుందని తెలుస్తోంది. వ్యాయామం చేయనివారిలో కాగ్నిటివ్ పనితీరు మందగించిందని తెలుస్తోంది. ఏదేమైనా ఓదోఒక వ్యాయామం చేసినవారిలో మెదడు పనితీరు అసలు చేయనివారితో పోల్చి చూసుకుంటే స్వల్ప మెరుగుదల ఉన్నట్లు తేలింది. వ్యాయామంతో పాటు పసుపు వినియోగంతో బ్రెయిన్ పనితీరు మెరుగుపడింది. పసుపు వినియోగంతో భారతీయుల్లో అల్జీమర్స్ వ్యాధి తక్కువగా ఉన్నట్లు గుర్తించవచ్చు. యాంటిఆక్సిడెంట్‌గా పనిచేసే విటమిన్ సి వినియోగంతో ఫ్రీ రాడికల్స్‌ను నిరోధిస్తుంది. స్ట్రాబెర్రీ, బ్రకోలి,నిమ్మకాయ వినియోగంతో అల్జీమర్స్‌ను నిరోధించవచ్చు. విటమిన్ కె,ఫోలిక్ యాసిడ్ అధికంగా ఉన్న ఆకుకూరల వినియోగంతో డిమెన్షియానునిరోధించి జ్ఞాపకశక్తిని పెంపొందిస్తుంది. వాల్‌నట్స్,ఫ్యాటీ ఫిష్, ఫ్లాక్స్‌సీడ్స్‌లో అధికంగా ఉండే ఒమేగా-3-ఫ్యాటీ యాసిడ్స్ వినియోగం కూడా బ్రెయిన్‌కి మంచిదే...


కొన్ని రకాల బాక్టీరియాలతో

మహిళల్లో హెచ్ఐవి



ఏడు రకాల బాక్టీరియా జాతుల సాంద్రత ఎక్కువగా ఉండటంతో మహిళల్లో హెచ్ఐవి ఇన్‌ఫెక్షన్ ముప్పు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. వెజైనల్ మైక్రోబియమ్ హెచ్ఐవి పెరిగేందుకు, తగ్గేందుకు కారణమవుతున్నట్లు ఆరు ఆఫ్రికా దేశాల్లో ఎయిడ్స్ పరిశోధనాకారులు చేసిన పరిశోధనలో వెల్లడైంది. వైరస్‌ద్వారా సంక్రమించే ఎయిడ్స్‌కు బయలాజికల్ పరిస్థితులే కారణం. సబ్ సహార ఆఫ్రికా ప్రాంతంలో 56శాతం మంది మహిళలు హెచ్ఐవి ఇన్‌ఫెక్షన్ల బారినపడుతున్నారు. ముఖ్యంగా ఏడు రకాల బాక్టీరియా స్పీసీస్ ఈ ఇన్‌ఫెక్షన్‌లకు కారణమని తెలుస్తోంది.

మానవ వ్యర్థాల నుండి ఆహారం...!



భవిష్యత్తులో వ్యోమగాములకు మానవ వ్యర్థాలనుండి ఆహారాన్ని తయారు చేసేందుకు రంగం సిద్ధమవుతోందని తాజా అధ్యయనం వెల్లడించింది. దీర్ఘకాలం అంతరిక్షంలో ఉండే శాస్త్రజ్ఞులకు ఆహారం ప్రధాన సమస్యగా ఉంది. దీనికిగాను పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ శాస్త్రజ్ఞుల బృందం పరిష్కారాన్ని కనుగొంది. మానవవ్యర్థాలైన ఘన,ద్రవాలను మైక్రోబియల్ రియాక్టర్స్ ద్వారా వీటిని విచ్ఛిన్నం చేయడం ద్వారా తిన డానికి ఉపయోగించవచ్చునని తెలిపారు. ఏకకాలంలో వ్యాధికారక కాలుష్య ప్రమాదాల నుండి కూడా తగ్గిస్తుందని తెలుస్తోంది. భవిష్యత్తుల్ల స్పేస్ వాయేజస్‌లోమరింత దీర్ఘకాలం ఉండవలసిన పరిస్థితి ఉంది. దీనితో భూమినుండి ఆహారాన్ని తీసుకెళ్లడం అత్యంత ఖరీదుతో కూడినది. హైడ్రోపోనిక్ వంటి ఇతర పద్ధతులతో ఇప్పటికే కూరగాయలను పండించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇదికాకుండా శాస్త్రజ్ఞులు బయలాజికల్ రియాక్టర్స్ ద్వారా మైక్రోబ్స్ వినియోగించి వ్యర్థాలను ఆహారంగా మార్చే ప్రక్రియకు పూనుకున్నారు. ఇది అత్యంత తేలికైనదీ, వేగవంతమైనది కూడా...



త్వరలో ఐఓఎస్ ప్లాట్‌ఫాంపైకి


ఎం ఆధార్ యాప్..!

న్యూఢిల్లీ : యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) గతేడాది జూలైలో ఆండ్రాయిడ్ ప్లాట్‌ఫాంపై ఎం ఆధార్ యాప్‌ను విడుదల చేసింది. ఈ యాప్ వల్ల పౌరులు తమ ఆధార్ కార్డును ఎప్పుడూ వెంట తీసుకెళ్లాల్సిన పని ఉండదు. తమ ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే చాలు, ఆధార్ కార్డును డిజిటల్ రూపంలో డౌన్‌లోడ్ చేసుకుని ఫోన్‌లో ఉంచుకోవచ్చు. దాన్ని ఐడీ ప్రూఫ్‌గా కావాల్సిన చోట ఉపయోగించుకోవచ్చు. అయితే ఇప్పటి వరకు ఈ ఎం ఆధార్ యాప్ ఆండ్రాయిడ్‌లోనే లభ్యం కాగా త్వరలో ఐఓఎస్ ప్లాట్‌ఫాంపై కూడా ఈ యాప్‌ను లాంచ్ చేయనున్నారు. దీంతో ఐఫోన్లను వాడే యూజర్లు ఈ యాప్‌ను తమ ఫోన్‌లో వేసుకుని ఆధార్ కార్డును ఫోన్‌లోకి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ మేరకు యూఐడీఏఐ సీఈవో అజయ్ భూషణ్ పాండే ట్విట్టర్‌లో ఓ వీడియోను పోస్ట్ చేశారు. అందులో ఎం ఆధార్ యాప్‌కు చెందిన ఓఐఎస్ వెర్షన్ త్వరలో అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు.

భారత విపణిలోకి మోటో ఎక్స్4

ఢిల్లీ: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ లెనోవో బ్రాండ్‌కు చెందిన మోటో నూతన స్మార్ట్‌ఫోన్ మోటో ఎక్స్4ను సోమవారం భారత విపణిలో విడుదల చేసింది. ఈ స్మార్ట్‌ఫోన్ ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్, మోటో హబ్ స్టోర్లలో ఫిబ్రవరి 1 నుంచి లభించనుంది. 64 జీబీ అంతర్గత మెమొరీ, 6జీబీ ర్యామ్‌తో అందుబాటులోకి రానుంది. ఇది స్టెర్లింగ్ బ్లూ, సూపర్ బ్లాక్ వేరియంట్లలో లభించనుంది. దీని ధర రూ. 24,999గా సంస్థ నిర్ణయించారు. ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డుతో కొనుగోలు చేసే వారికి ఫిబ్రవరి 1, 2 తేదీల్లో రూ.1,500 డిస్కౌంట్ లభించనుంది. **ప్రత్యేకతలు:** ఆండ్రాయిడ్ 7.1.1 నౌగాట్, 2.2 గిగా హెర్ట్జ్ ఆక్టాకోర్ స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్, 5.2 అంగుళాల తాకే తెర, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ ప్రొటెక్షన్, 6 జీబీ ర్యామ్, 12 మెగాపిక్సెల్ కెమెరా, 8 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా.

మెమరీ-నిద్ర



బ్రెయిన్‌లో అంటే హిప్పో కాంపస్‌లో మెమరీ రికార్డు అవుతుంది. ఇది ఆన్ ఆఫ్ పద్ధతిలో ఉంటుంది. అంటే సెన్సెస్ ద్వారా పొందిన సమాచారం ఎలక్ట్రికల్ ఇంఫల్స్‌గా మారిన తర్వాత సంబంధిత రసాయనాల సమన్వయంతో హిప్పో కాంపస్‌లో మెమరీ నిక్షిప్తమవుతూ రివీల్ అవడానికి ఆన్-ఆఫ్ రసాయనాల సమన్వయం ద్వారా పునరావృతమవుతుంది సమాచారమంతా. అలాగే నిద్ర కూడా హైపోథలామస్‌లో ఆన్-ఆఫ్ రసాయనాల సమన్వయం వలన నిక్షిప్తమవుతూ రికార్డు అవుతుంది. అంటే మెమోరీలో సమాచారం మొత్తం విద్యుత్ ప్రచోదనాలు మరియు రసాయనాల సమన్వయంతో రికార్డు అవుతుంది బ్రెయిన్‌లో. పోతే నిద్రకు సంబంధించినంత వరకు సమాచారం అంటే రసాయనాల సమన్వయం హైపోథలామస్‌లో నిక్షిప్తమవుతుంది. అందువలన ఆ సెంటర్‌లో నిద్ర సమాచారం రికార్డు అవుతుంది. ఇక్కడ మెమరీకి-నిద్రకు కొద్దిగా తేడాను మనం గమనించాలి. మెమరీలో సమాచారం అంతా రసాయనాల రూపంలోకి మార్పుచెంది విద్యుత్ ప్రచోదనాలతో సమన్వయం చెందుతుంది. కానీ నిద్రకు వచ్చేసరికి రసాయనాలు-అనస్థీషియాలో ఎలా కేంద్రీకరించబడ తాయో ఆ రసాయనాలు అంటే అనస్థీషియాకు తోడ్పడేవి పూర్తిగా బ్రెయిన్‌కు పెయిన్ కల్గించే నాడీ వ్యవస్థను కొంత సమయం వరకు నిర్వీర్యం చేస్తుంది. సరిగ్గా అలాగే నిద్రకు సంబంధించిన రసాయనాలు హైపోథలామస్‌లో అంటే నిద్ర సెంటర్‌లో సబ్‌బ్రెయి న్‌ను అంటే బ్రెయిన్‌ను కంట్రోల్‌లో ఉంచే అంతర్లీన బ్రెయిన్ సమన్వయ స్పృహను పూర్తిగా నిర్వీర్యం చేస్తుంది. ఒకరకంగా సబ్‌కోమాలోకి తీసుకెళ్తుంది. బ్రెయిన్‌లోని అంటే హైపోథలామస్‌లోని రసాయ నాలు.. అదే మనం నిద్రగా భావిస్తాం. ఇలాగే నిద్రను మనం నిర్వచించాలి కూడా. నిజంగా నిద్ర అన్నది మెమరీ మెకానిజంలాగే కంటిన్యూ అవుతుంది. పోతే హైపోథలామస్‌లో నిద్రకు సంబంధించిన రసాయనాలు కొన్ని సార్లు బయోలాజికల్ క్లాక్స్ ఆధారంగా కూడా పనిచేస్తూ పోతూ ఉంటుంది. అంటే ఇక్కడ మెమరీ లాగానే బ్రెయిన్‌లో నిద్ర కూడా రాని యంత్రాంగం కూడా సరిగ్గా ఒకేలా ఉంటాయని మనం గమనించాలి. పోతే నిద్రకు సంబంధించి బ్రెయిన్‌లో అనస్థీషియలాగా పనిచేస్తుందని మనం నమ్మాలి. నిజానికి అనస్థీషియా శరీర నాడీ వ్యవస్థకు సంబంధించి పనిచేస్తూ శరీరంలోని అవయవాల భాగాలనుంచీ వచ్చి చేరే నాడీ ప్రచోదనాలను నిర్వీర్యం అంటే రద్దు చేయడం మూలంగా మనకు పెయిన్ అనిపించదు. అంటే సమాచారం బ్రెయిన్‌కు చేరకుండా నిరోధిస్తుంది. నిర్ణీత సమయంవరకు, నిర్ణీత శరీర భాగాలవరకు సంబంధించి అలాగే హైపోథలామస్‌లో నిద్రకు సంబంధించిన సమాచారం రసాయనాల రూపంలో విద్యుత్ ప్రచోదనాల రూపంలో చేరినపుడు బ్రెయిన్ అంతర్లీన వ్యవస్థకు సంబంధించి సమాచారం మొత్తం ఆగిపోతుంది. అలాగే శరీరభాగాలనుంచి చేరే సమాచారం కూడా తాత్కాలికంగా ఆగిపోతుంది. అంటే అంతర్లీన బ్రెయిన్ సమన్వయ వ్యవస్థకు సంబంధించి సమాచారం ఆగిపోతుంది. అందువలన మనకు నిద్ర వస్తుంది. ఇక్కడ జరుగు తున్నదేమంటే హైపోథలామస్‌లోని రసాయనాల మూలంగా బ్రెయిన్ అంతర్లీన వ్యవస్థ విశ్రాంతి దశ లోకీ వెళుంది. అంటే ఆ వ్యవస్థ తాత్కాలికంగా నిర్వీర్యమవుతుంది. తిరిగి అది మామూలు స్థితికి చేరుకోవడానికి హైపోథలామస్‌లోని రసాయనాలు పనిచేయడం ఆగిపోవ ల్సిందే.. అంటే ఆన్-ఆఫ్ సిస్టం నిద్రకు సంబంధించి సమన్వయపరిచేది-హైపోథలా మస్‌లోని రసాయనాల సమాచార నిమిత్తం అని మనం గుర్తించాలి. నిద్ర రికార్డు అవుతుందని చెప్పడానికీ ఆ సమాచారం సరిపోతుందని మనం నమ్మవచ్చును. సరిగ్గా అనస్థీషియాలో జరిగే ఆన్-ఆఫ్ సిస్టమ్ మాదిరిగానే మెమరీలో జరిగే ఆన్- ఆఫ్ సిస్టమ్ మాదిరిగానే నిద్ర కూడా హైపోథలామస్ ఆన్-ఆఫ్ సిస్టమ్ ఆధారంగానే అంటే రసాయనాల విద్యుత్ ప్రచోదనాల సమన్వయ సమాచార ఆధారంగానే నిద్ర కూడా కొనసాగుతుందని మనం గుర్తించాలి.

అందాల ఊరు





మన ఊరు మనకెప్పుడూ అందంగానే కనిపిస్తుంది. అలాగే కొన్ని ఊళ్ళు ఏ సంబంధమూలేని వ్యక్తులకు కూడా అందంగా కనిపిస్తాయి. అవే ఊళ్ళు పర్యాటక ప్రదేశాలుగా ఖ్యాతిని పొందుతాయి. పురాతన చరిత్ర ఉండి, సముద్రపు ఒడ్డున ఉంటే ఆ ఊరు మరింత ప్రసిద్ధి పొందుతుంది. అలాంటి ఊరే క్రొయేషియాలోని దుబ్రోవ్‌నిక్. ఇది అందమైన ఊరు అని చెబుతారు. మధ్యయుగంనాటి ఈ ఊరు అడ్రియాటిక్ సముద్రపు ఒడ్డున నెలకొని ఉంది. వర్తకానికి బాగా పేరుగాంచిన ఊరు ఇది. పెద్ద పెద్ద ఇళ్ళూ, రాజమందిరాలు, చర్చిలు కనిపిస్తాయి. ఊరిని చూసినపుడు ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. ఆ ప్రత్యేకత ఏమిటంటే ఇళ్ళన్నీ ఒకేరకంగా కనిపిస్తాయి. దానికి కారణం ఒకేరకంగా కనిపించేలా చేసే పెంకులు పేర్చిన ఇంటి పైకప్పులు ఇక్కడి మరో ఆకర్షణ. హోటళ్ళు అధికంగా కనిపిస్తాయి. సాహస క్రీడలు ఆడే అవకాశమూ ఉంటుంది. దీన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో జనం వస్తుంటారు. ఏళ్ళ తరబడి చెరగని ఈ ఊరి అందాలకు మెచ్చి ఐక్యరాజ్యసమితి ప్రపంచ వారసత్వ సంపద హోదాను ఇచ్చింది.




ఆఫ్గాన్ హౌండ్

ఆఫ్గాన్ హౌండ్ అనేది అందమైన జుట్టున్న ఒక జాతి కుక్క. చూస్తే ఈ కుక్క మిగతా కుక్కలతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. దీన్ని చూస్తే జుట్టు విరబోసుకున్నట్టు కనిపిస్తుంది. అయితే ఆడవాళ్ళ జుట్టును పోలినట్లు తలమీద పొడవాటి వెంట్రుకలు ఉండటం వీటి ప్రత్యేకత. తోక మినహా ఒళ్ళంతా ఉండే ఈ వెంట్రుకలు విపరీతమైన చలి. వేడిల నుంచి వీటిని కాపాడతాయి. ఆఫ్గాన్ హౌండ్ గంటకు సుమారు 65కి.మీ వేగంతో పపరిగెడుతుంది. అంటే ఒక రేసుగుర్రం పరిగెత్తేంత వేగం అన్నమాట. ప్రస్తుతం భూమి మీద ఉన్న అతి పురాతనమైన కుక్కల జాతిలో ఇదీ ఒకటి. 4000ఏళ్ళ క్రితమే ఈ శునకాలు భూమ్మీద ఉన్నట్టు ఆధారాలున్నాయి. ప్రఖ్యాత చిత్రకారుడు పికాసో కూడా ఈ జాతి కుక్కను ఎంతో ప్రేమగా పెంచుకున్నాడని చెబుతారు. అయితే వీటి చర్మంలో ఉండే ప్రత్యేక గ్రంథుల వల్ల వీటినుంచి ఒకరకమైన సువాసన వస్తుందని చెబుతారు. అయితే ఈ కుక్కలు ఎక్కువగా ఆఫ్గనిస్థాన్‌లో మాత్రమే పెరుగుతాయి. జుట్టుతో ఎంతో అందంగా అందరినీ అలరిస్తుంటాయి.

విశేషాలు


వానపడే ముందు మబ్బులు ఎక్కువగా సూర్యకాంతిని గ్రహిస్తాయి. అందువల్ల అవి నల్లగా మారతాయి. చిన్న చిన్న నీటి బిందువులతో మబ్బులు ఏర్పడతాయి. వీటిమీద కాంతి ప్రసరించినప్పుడు ఆ బిందువులు పరావర్తనం చెందుతాయి. అందువల్ల మబ్బులు తెల్లగా కనిపిస్తాయి. వానపడే ముందు నీటి బిందువులు సంఖ్య పెరుగుతుంది. అందువల్ల కాంతి అధికంగా పరావర్తనం చెందదు. అందువల్ల వానపడే ముందు మబ్బులు నల్లగా కనిపిస్తాయి.





చింకారా అనేది జింక జాతికి చెందినది. మన రాష్ట్రంలో ఎక్కువగా కనిపించే కృష్ణజింకకు చింకారా బంధువు. దక్షిణాసియా దేశాలైన భారత్, ఇరాన్, పాకిస్తాన్, పచ్చిక బయళ్లు, ఎడారి ప్రాంతాల్లో ఇవి కనిపిస్తాయి. సాధారణంగా 65 సెం.మీ. పొడవు, 23 కిలోల బరువుతో ఉంటాయి.

సినిమా అన్న పదం ఎలా వచ్చిందో తెలుసా ! గతంలో మద్రాస్ నుండి "కినిమా" పేరుతో ఒక సినిమా పత్రిక వెలువడేది. కినిమా అంటే గ్రీకు భాషలో "చలించు" అని అర్థం. చలించుతున్న బొమ్మలు (ఫోటోలు) ఒక పట్టిక మీదముద్రించి వాటిని తిరిగి ప్రదర్శించినప్పుడు కదులుతున్న బొమ్మలుగా చూపించే యంత్రాన్ని లూమియర్ సోదరులు 1890 లో కనుగొ న్నారు. వీరు ఫ్రెంచ్ దేశస్థులు. ఆనాడు ఈ యంత్రా నికి "సినిమాటోగ్రాఫ్" అని పేరు పెట్టారు. ఈ యంత్రం ద్వారా కదలే బొమ్మలకే సినిమా అనే నామకరణం జరిగి "1899" లో సినిమా అనే పదం భారతీయ భాషల్లో స్థిర పడింది.



నిఖిల్ సినిమాకు బాహుబలి కెమెరామెన్!





విభిన్న కథాంశాలతో చిత్రాలను చేస్తూ కెరీర్‌లో దూసుకుపోతున్న యువ కథానాయకుడు నిఖిల్. త్వరలో ఆయన ఓ తమిళ రీమేక్ చిత్రంలో నటించనున్నారు. టీ.ఎన్.సంతోష్ దర్శకత్వంలో తెరకెక్కిన తమిళ చిత్రం 'కనిథన్' బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు అదే చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేయనున్నారు. మాతృకకు దర్శకత్వం వహించిన సంతోష్ తెలుగు చిత్రానికీ దర్శకత్వం వహించనున్నారు. ఈ సినిమాకు 'బాహుబలి' వంటి బ్లాక్ బస్టర్ హిట్ చిత్రాలకు కెమెరామెన్‌గా పనిచేసిన కె.కె. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ అందించనున్నారు. చక్కని యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'కనిథన్'లో అద్భుతమైన గ్రిప్పింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి. విజువల్స్ పరంగా అత్యున్నతంగా దీన్ని రీమేక్ చేయాల్సి ఉంటుంది. దీంతో సెంథిల్ అయితేనే న్యాయం చేయగలరని చిత్ర బృందం భావించి ఆయన్ను ఎంపిక చేసుకుంది. ఇప్పటికే సినిమాకు సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే నటీనటుల ఎంపికను పూర్తి చేసి షూటింగ్‌ను ప్రారంభించనున్నారు. ప్రస్తుతం నిఖిల్ 'కిరిక్‌పార్టీ' చిత్రంలో నటిస్తున్నాడు. షెరాన్ కొప్పిశెట్టి దర్శకుడు. సిమ్రన్ పరీంజా, సంయుక్త హెగ్డే కథానాయికలు. దాదాపు చిత్రీకరణ పూర్తయింది. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

'మార్తాండ వర్మ'గా రానా



వైవిధ్యమైన పాత్రలు పోషించడానికి దగ్గుబాటి రానా ఎప్పుడూ ముందే ఉంటారు. ఇది వరకూ ఆయన నటించిన బాహుబలి, ఘాజీ, త్వరలో రానున్న 'హాథీ మేరా సాథీ' చిత్రాలే ఇందుకు నిదర్శనం. భాషతో సంబంధం లేకుండా అన్ని చిత్ర పరిశ్రమల్లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న రానా ప్రస్తుతం మలయాళంలోనూ నటించడానికి సిద్ధమయ్యాడు. ట్రావెన్‌కోర్ రాజు మార్తాండ వర్మ జీవిత కథ ఆధారంగా తీయనున్న చిత్రంలో టైటిల్ పాత్రను పోషించనున్నారు. 1729-1758 వరకూ ట్రావెన్‌కోర్‌ను పాలించిన రాజుగా రానా కన్పించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు కె.మధు మాట్లాడుతూ... తిరువనంతపురం ఆలయంలో ఇంతకుముందు నేను రానా కలిసాం. ఈచిత్రం చేయాలనే ఆలోచన ఆరోజే మొదలైంది. అందుకని ఈచిత్రాన్ని ఇక్కడే తొలుత మొదలు పెట్టాం. ఏ పాత్రనైనా అవలీలగా పోషించగల వ్యక్తి రానా. అందుకే తనతో ఈ చిత్రాన్ని తీయాలనుకున్నాం అని తెలిపారు. ఈచిత్రానికి రచయితగా వ్యవరిస్తున్న రాబిన్ తిరుమల మాట్లాడుతూ... 'ప్రస్తుతం రానా మార్తాండ వర్మ గురించిన వివరాలు తెలుసుకునే పనిలో ఉన్నారు. ఆయన నివసించిన ప్రదేశాలు, జీవన శైలి తదితర విషయాల గురించి అధ్యయనం చేస్తున్నారు' అని తెలిపారు.

ప్రేమ కాదు స్నేహమే



చిత్ర పరిశ్రమలో వదంతులకు కొదవే ఉండదు. అందులో భాగంగా ప్రస్తుతం కోలీవుడ్‌లో భారీ స్థాయిలో జరుతున్న ప్రచారం రకుల్‌ప్రీత్‌సింగ్, రానా ప్రేమించుకుంటున్నారన్నదే. 'బాహుబలి', 'నాన్ ఆనైయిట్టాల్' చిత్రాలతో తమిళ ప్రేక్షకులకు దగ్గరయ్యారు రానా. ఇక తాజాగా విడుదలైన 'ధీరన్ అధిగారం ఒంద్రు'తో మంచి విజయాన్ని అందుకుంది రకుల్. వీరిద్దరి ప్రేమాయణానికి సంబంధించి విషయాలపై కోడంబాక్కం వర్గాలు గుసగుసలాడుతున్నాయి. అయితే దీనిపై రకుల్ ప్రీత్‌సింగ్ స్పందిస్తూ.. నేను, రానా మంచి స్నేహితులుం మేం మొత్తం 20 మంది స్నేహితులు ఉన్నాం. వారిలో ఇంకా పెళ్లికాని వారు కొందరు ఉన్నారు. అందుకే మేం కాస్త సన్నిహితంగా ఉంటాం. దీనికే ఇలాంటి వదంతులు వస్తున్నాయి అని అన్నారు.

చిరు పాట సాయిధరమ్ తేజ్ ఆట!





చిరంజీవి సినిమాల్లోని పాటలను రీమిక్స్ చేస్తూ తనదైన శైలిలో దూసుకుపోతున్నాడు సాయిధరమ్ తేజ్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. లావణ్య త్రిపాఠి కథానాయిక. వి.వి.వినాయక్ దర్శకత్వం వహిస్తున్నారు. చిరంజీవి 'కొండవీటి దొంగ' చిత్రంలోని 'చమక్ చమకు ఛాం' సాంగ్‌ను ఈ సినిమా కోసం రీమిక్స్ చేశారు. సోమవారం ఈ పాటను చిత్ర బృందం విడుదల చేసింది. ఇక ఈ పాటలో చిరుకు దీటుగా తేజ్ ఎలాంటి స్టెప్‌లు వేశాడో తెలియాలంటే సినిమా విడుదలయ్యే వరకూ వేచి చూడాల్సిందే. 'ఇంటెలెజెంట్' సినిమాలోని ఓ పాటను ప్రభాస్ విడుదల చేస్తూ 'చమకు చమకు ఛాం' పాట తనకు మోస్ట్ ఫేవరెట్ అని చెప్పారు. తమన్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. సీకే ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సి.కల్యాణ్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన టీజర్ విశేషంగా ఆకట్టుకుంటోంది. చాలా ఫ్రేమ్‌ల్లో తేజ్ అచ్చం చిరంజీవిలా ఉన్నారంటూ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎంబ్రాయిడరీ నేర్చుకుంటున్న హీరోయిన్!



సినిమాలోని పాత్ర కోసం కొందరు నటులు ఎంత శ్రమకైనా వెనుకాడరు. ముఖ్యంగా హీరోల విషయంలో ఇది ఎక్కువగా కనపడుతుంటుంది. అయితే హీరోయిన్లు కూడా తక్కువేం కాదు. కథానాయకులకు దీటుగా వారూ కష్టపడుతుంటారు. ఇప్పుడు అనుష్కశర్మ కూడా కష్టపడుతోంది. అయితే అదేదో ఫిట్‌నెస్ కోసమో.. కత్తియుద్ధాల కోసమో కాదు. 'సుయి ధాగా' సినిమా కోసం సూదీ దారం పట్టింది. దర్శకుడు శరత్ కథారియా, నిర్మాత మనీష్ శర్మలు కలిసి తీసిన చిత్రం 'దమ్ లాగాకే హైషా' మంచి విజయాన్ని అందుకుంది. మరోసారి వీరిద్దరి కలిసి తెరకెక్కిస్తున్న చిత్రం 'సుయి ధాగా'. వరుణ్‌ధావన్, అనుష్కశర్మ జంటగా నటిస్తున్నారు. ఈ సినిమా కోసం వరుణ్‌ధావన్ మిషన్ కుట్టడం నేర్చుకోగా, ఇప్పుడు అనుష్క శర్మ ఎంబ్రాయిడరీ నేర్చుకుంటోంది. ఈ మేరకు సినిమాలో ఆమె పాత్ర ఉంటుందని చిత్రవర్గాలు చెబుతున్నాయి. దీంతో ఎంబ్రాయిడరీ నేర్చుకుంటున్న అనుష్కశర్మ ఫొటోను యశ్‌రాజ్ ఫిల్మ్ అభిమానులతో పంచుకుంది. గతేడాది డిసెంబరు 12న టీమ్ ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి, అనుష్కశర్మ పెళ్లి బంధంతో ఒక్కటైన సంగతి తెలిసిందే. కోహ్లి ప్రస్తుతం దక్షిణాఫ్రికా టూర్‌లో బిజీగా ఉండగా, అనుష్క శర్మ తన సినిమాలతో తీరిక లేకుండా ఉన్నారు.

అన్ని సినిమాలయందు అ!- సినిమా వేరయా! విశ్వదాభిరామ FEB 16TH రిలీజ్ రా మామా!!



వరుస విజయాలతో దూసుకుపోతున్న నేచురల్ స్టార్ నాని తొలిసారిగా నిర్మాతగా మారి తెరకెక్కిస్తున్న సినిమా 'అ!'. నిత్యామీనన్, కాజల్ అగర్వాల్, రెజీనా, ఈషా, అవసరాల శ్రీనివాస్, ప్రియదర్శి కీలక పాత్రల్లో నటించిన ఈ మూవీ విడుదల తేదీని వాల్ పోస్టర్ సినిమా గ్రూప్ భిన్నంగా ప్రకటించింది. వినూత్న కథాంశంతో తెరకెక్కిన ఈ మూవీని ఫిబ్రవరి 16న విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

'అన్ని సినిమాలయందు 'అ!'- సినిమా వేరయా!

విశ్వదాభిరామ ఫిబ్రవరి 16 రిలీజ్ రా మామా!!' అంటూ వాల్ పోస్టర్ సినిమా బ్యానర్ ట్విటర్ లో పోస్ట్ చేశారు. చేప పాత్ర ఉందని చెప్పి అందరి దృష్టి ఆకర్షించిన యూనిట్, విడుదల తేదీని తాజాగా ప్రకటించింది. చేప కథేంటో చూసేందుకు టాలీవుడ్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ సినిమాలో రెండు కీలక పాత్రలకు నాని, రవితేజలు డబ్బింగ్ చెబుతున్నట్లు సమాచారం. డిఫరెంట్ బ్యాక్ డ్రాప్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాతో ప్రశాంత్ వర్మ దర్శకుడిగా పరిచయం కానున్నాడు. ఇప్పటికే ఒక్కో పోస్టర్ తో ఒక్కో పాత్రను ఇంట్రడ్యూస్ చేస్తూ వచ్చిన హీరో నాని, తాజాగా మూవీ రిలీజ్ డేట్‌ను అదే తీరుగా పద్యరూపంలో వెల్లడించాడు. మార్క్ కె రోబిన్ సంగీతమందిస్తున్న విషయం తెలిసిందే.



మూడు రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : గోరక్షణ పేరుతో జరుగుతున్న దాడులను నియంత్రించడంలో విఫలమైన రాజస్థాన్, హర్యానా, యూపీ రాష్ట్రాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. సోమవారం ఆ మూడు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. సెప్టెంబరు 3వ తేదీ లోగా ఆ రాష్ట్రాలు స్పందించాలని ఆదేశించింది. తుషార్ గాంధీ వేసిన పిటిషన్ ఆధారంగా అత్యున్నత న్యాయస్థానం ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ పిటిషన్ ఆధారంగానే గతేడాది సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. గోసంరక్షణ పేరుతో జరుగుతున్న హింసను నియంత్రించాలని ఆ తీర్పులో 26 రాష్ట్రాలను సుప్రీం ఆదేశించింది. అలాంటి హింసాత్మక ఘటనలపై వివరాలు తెలియజేసేందుకు నోడల్ అఫీసర్లను ఏర్పాటు చేయాలని కోర్టు పేర్కొన్నది. శాంతి భద్రతలు అనేది రాష్ట్రాల పరిధిలో ఉంటాయని, అందుకే రాష్ట్రాలు తగిన చర్యలు తీసుకోవాలని కోర్టు తెలిపింది. 2015లో మొదటిసారి యూపీలో గోరక్షణ పేరుతో దాడులు జరిగాయి. గోవును చంపారన్న ఆరోపణలపై ఓ వ్యక్తిని దాద్రి పట్టణంలో హతమార్చారు. ఆ తర్వాత గుజరాత్‌లోనూ నలుగురు దళితుల బట్టలు విప్పి చితకబాదారు. ఆ ఘటనల నేపథ్యంలో సుప్రీంకోర్టు .. గో హింసపై సీరియస్‌గా స్పందించింది.

నివురుగప్పిన నిప్పులా కాస్‌గంజ్

ఈ ఘటనలు యూపీకి కళంకం : గవర్నరు



కాస్‌గంజ్/లక్నో : రెండు వర్గాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలతో భగ్గుమన్న ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో సోమవారం కూడా పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. రిపబ్లిక్ డే ర్యాలీ సందర్భంగా రెండు వర్గాల ఘర్షణలు హింసాత్మకంగా మారి ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. దీంతో లూటీలు, దహనకాండలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనకు సంబంధించి ఇంతవరకూ 112 మందిని ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద అరెస్టు చేశారు. కాస్‌గంజ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సునీల్ కుమార్ సింగ్‌ను మీరట్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో పీయూష్ శ్రీవాత్సవను నియమించారు.

కాస్‌గంజ్ మత ఘర్షణ రాష్ట్రానికి కళంకమని ఉత్తరప్రదేశ్ గవర్నర్ రాంనాయక్ సోమవారం పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. గత 9 నుంచి 10 నెలల్లో తొలిసారిగా రాష్ట్రంలో ఇటువంటి ఒక ఘటన చోటుచేసుకుందని, ఇది అవమానకరమని అన్నారు. కాస్‌గంజ్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణతో ఒకరి మృతి చెందారు. కానీ ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉంది. రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా నిర్వహించిన ఒక మోటారు సైకిల్ ర్యాలీపై ఒక గుంపు రాళ్లు విసిరిన నేపథ్యంలో ఘర్షణలు చోటుచేసుకుని యువకుడు మృతి చెందాడు. అనంతరం జరిగిన విధ్వంసంలో మూడు దుకాణాలు, రెండు బస్సులు, ఒక కారు దగ్ధమయ్యాయి. 'కాస్‌గంజ్‌లో ఏదైతే జరిగిందో అది మంచిది కాదు. ఈ ఘటన యూపీకి కళంకం. ప్రభుత్వం దర్యాప్తు జరపాలి.

ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలి' అని ఆయన లక్నోలో విలేకరులతో చెప్పారు. ఏడాది క్రితమే యూపీలో అధికారంలోకి వచ్చిన యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి, రాష్ట్రంలో శాంతి, భద్రతలను పరిరక్షించాల్సిందిగా ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సలహా ఇచ్చారు. ఇదిలా ఉండగా యూపీ కేబినెట్‌లో సీనియర్ మంత్రి సిద్ధార్థ నాథ్ సింగ్ సోమవారం మాట్లాడుతూ దుకాణాలు తిరిగి తెరచుకున్నాయని చెప్పారు. సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, ఇది మంచి సంకేతమని అన్నారు.

రాజ్యసభలో అడుగిడిన ఆప్

- ఆప్ నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ఒకరు
- మాజీ సభ్యుల మృతికి సభ నివాళి
- అంధుల క్రికెట్ టీమ్‌పై ప్రశంసల జల్లు

న్యూఢిల్లీ : బడ్జెట్ సమావేశాల తొలి రోజు సోమవారం రాజ్యసభలో నలుగురు కొత్త సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కాగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2017-18 సంవత్సరానికి ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. పార్లమెంటు ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగించిన అనంతరం సెక్రటరీ జనరల్ దేశ్ దీపకర్ వర్మ హిందీ, ఆంగ్ల కాపీలను అందజేయగా ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి కేంద్ర మంత్రి హర్‌దీప్ పురి ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ సభ్యులు మోహిందర్ సింగ్ కల్యాణ్, ఖగెన్ దాస్‌ల మృతికి రాజ్యసభ చైర్మన్ ఎం. వెంకయ్య నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. 1992, జూలై నుంచి 1998 జూలై వరకు రాజ్యసభలో పంజాబ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన కల్యాణ్ గత నవంబరులో మరణించారు. అయితే 1998, ఏప్రిల్ నుంచి 2002, ఫిబ్రవరి వరకు ఎగువ సభలో త్రిపుర రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన దాస్ ఈ నెల మొదట్లో మరణించారు.

ఈ నెల మొదట్లో ముంబై ఓఎన్జీసీ స్థలంలో ఇద్దరు పవన్‌హన్స్ పైలెట్లతో సహా మృతి చెందిన ఏడుగురికి, ఢిల్లీకి చెందిన బావన ప్రాంతంలో బాణసంచా యూనిట్‌లో అగ్ని ప్రమాదం సంభవించి ప్రాణాలు కోల్పోయిన 17 మందికి కూడా సభ నివాళి అర్పించింది. మరణించిన మాజీ సభ్యులకు, వేర్వేరు ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళిగా సభ్యులు మౌనం పాటించారు.

ఇటీవల టర్కీలో ఎఫ్ఐఎస్ ఆధ్వర్యంలో ఆల్పైన్ ఎజెడర్ 3200 కప్‌లో కాంస్య పతకం గెలుచుకున్న అంచల్ ఠాకూర్‌ను సభ అభినందించింది. సైయింగ్‌లో అంతర్జాతీయ పతకం సాధించిన తొలి భారతీయురాలిగా అంచల్ చరిత్ర సృష్టించింది. కాగా షార్జాలో అంధుల 5వ ప్రపంచ కప్ క్రికెట్‌ను గెలుచుకున్న భారత అంధుల క్రికెట్ టీమ్‌పై సభ్యులు ప్రశంసల జల్లు కురిపించారు. అంధుల క్రికెట్ టీమ్ విజయం ఇతరులకు స్ఫూర్తిదాయకమవుతుందని వెంకయ్య నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి 100వ ఉపగ్రహాన్ని ప్రయోగం ద్వారా ఇస్రో సాధించిన విజయం అంతరిక్ష పరిశోధనలో ఒక మైలురాయిగా నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. ఖండాతర క్షిపణి ప్రయోగంలో డీఆర్‌డీవో సాధించిన విజయాన్ని కీర్తిస్తూ, శాస్త్రవేత్తలను ప్రశంసించారు. సభ సమావేశం కావడానికి ముందు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వేర్వేరు పార్టీల సభ్యులను కలుసుకున్నారు. ప్రతిపక్ష సభ్యుల బెంచ్‌ల వద్దకు వెళ్లి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ప్రతిపక్ష నాయకుడు గులామ్ నబీ ఆజాద్, ఇతర విపక్ష నేతలు శరద్ పవార్, రాంగోపాల్ యాదవ్, ఎ.కె.ఆంటోనీ, ఆనంద్ శర్మలతో కరచాలనం చేశారు.

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్‌తో కలిసి వచ్చిన మోడీ, సీపీఎం నాయకుడు టి.కె.రంగరాజన్, రామచంద్ర ప్రసాద్ సింగ్(జేడీ-యు), దిలీప్ టిర్కే(బీజేడీ), మోతీలాల్ వోరా, జైరాంరమేష్(కాంగ్రెస్) కరచాలనం చేశారు. అటుతర్వాత పత్రాలు ప్రవేశపెట్టిన తర్వాత, చైర్మన్ సభను ఒక రోజుకు వాయిదా వేశారు. లోక్‌సభలో 2018-19 సంవత్సరానికి ఆర్థిక మంత్రి సాధారణ బడ్జెట్ సమర్పించిన తర్వాత రాజ్యసభ ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటన్నరకు తిరిగి సమావేశమవుతుంది.

ప్రతిష్టంభన పరిష్కరించుకుందాం

ఆప్ ఎమ్మెల్యేకు లెఫ్టినెంట్ గవర్నర్ లేఖ

న్యూఢిల్లీ : ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ (డీడీఏ) మాస్టర్ ప్లాన్ 2021 అమలుపై లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బాయిజాల్, ఆప్ ప్రభుత్వానికి మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆప్ ఎమ్మెల్యే సౌరభ్ భరద్వాజకు గవర్నర్ లేఖ రాయడంతో ఢిల్లీ వాసులకు మంచిరోజులు వస్తాయన్న ఆశాభావం కలుగుతోంది. గతవారం గ్రేటర్ కైలాష్‌కు చెందిన ఆప్ ఎమ్మెల్యే భరద్వాజ గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరుతూ మున్సిపల్ కార్పొరేషన్ విధివిధానాలను అతిక్రమించి చేపడుతున్న సీలింగ్ చర్యల సమస్యను పరిష్కరించుకుందామని లేఖ ద్వారా కోరడంతో గవర్నర్ సానుకూలంగా స్పందించారు. సీలింగ్ సమస్య క్లిష్టతరమైన అంశమని దానిని ఢిల్లీ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రితో చర్చలు జరపడం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. వీధుల్లోని ప్రభుత్వ, ప్రైవేటు భూములను నోటిఫికేషన్ల ద్వారా ఉపయుక్తంగా మార్చుకొని లక్షలాది మందికి జీవనం కల్పిస్తూ, ఢిల్లీని అభివృద్ధి చేయాలని గవర్నర్ కార్యాలయం తెలిపింది. రిటైల్ సెక్టార్‌లో ఎఫ్‌డీఐను వ్యతిరేకిస్తూ ఆప్ నాయకులు అశుతోష్ , దిలీప్ పాండే, ఇతర ఎమ్మెల్యేలు మార్చ్ నిర్వహిస్తుండగా పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆమ్‌ఆద్మీపార్టీ తప్పుపట్టింది. పార్లమెంటు పోలీసు స్టేషన్ నుంచి ఆందోళనాకారులు ముందుకు సాగడాన్ని పోలీసులు అనుమతించలేదు. ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ (డీడీఏ) మాస్టర్ ప్లాన్ 2021ను తక్షణమే మార్చి, ఢిల్లీలో సీలింగ్‌ను ఆపాలని భరద్వాజ డిమాండు చేశారు. డీడీఏకు లెఫ్టినెంట్ గవర్నర్ చైర్మన్‌గా ఉన్నారు.

లాయర్లపై దాడికేసులో హైకోర్టు సీరియస్

రెండు రోజుల్లో నివేదిక ఇవ్వండి పోలీసులను కోరిన హైకోర్టు

న్యూఢిల్లీ : లాయర్లపై దాడిచేసి వారి ఆస్తులను దహనం చేసిన కేసులో ఏం చర్యలు తీసుకుంటున్నారో రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ముగ్గురు లాయర్లపై దాడులు చేసిన నివేదికను సీనియర్ పోలీసు అధికారి సంతకంతో, ఢిల్లీ పోలీసు కమిషనర్‌కు చూపి ఫైలు చేయాలని ఆపధర్మ చీఫ్ జస్టిస్ గీతామిట్టల్, జస్టిస్ సి హరిశంకర్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పోలీసులకు ఆదేశించింది. లాయర్ల ఆస్తులు అగ్నికి ఆహుతికావడం తీవ్ర వేదనను కలిగిస్తోందని ధర్మాసనం తెలిపింది. బాధితులకు న్యాయం అందించే లాయర్లకే ఇలా జరగడం బాధాకరమైందని, జనవరి 25న విధిలో ఉన్న న్యాయవాదులపై పోలీసులు దాడులు జరపడంపై కోర్టు ఆగ్రహం వెలిబుచ్చింది. సీనియర్ లాయర్లయిన వికాస్ పాశ్వా, ఢిల్లీ హైకోర్టు బార్ అసోసియేషన్ (డీహెచ్‌సీబీఏ) అధ్యక్షుడు కీర్తి ఉప్పల్‌లకు సంబంధించిన కార్లు, ఇతర ఆస్తులను ఈనెల 9,24ల్లో దగ్ధం చేయడాన్ని డీహెచ్‌సీబీఏ ఖండిస్తూ తీర్మానం చేసింది. జనవరి 4న, అడ్వకేట్ రవిశర్మకు చెందిన మారుతీ స్విఫ్ట్, హోండా అమేజ్‌లను గుర్తుతెలియన వ్యక్తులు కాల్చి వేశారు. ఈ ముగ్గురు న్యాయవాదులు వారి సహచర మహిళా న్యాయవాదికి బంధువులతో ఉన్న ఆస్తి తగాదాల కేసును వాదిస్తున్నారు. కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా మహిళా న్యాయవాదిని బలవంతంగా బయటకు ఈడ్చి అరెస్టు చేశారని, జనవరి9న పాశ్వాకు చెందిన గ్రేటర్ కైలాష్ ఆఫీసు, కార్లను కాల్చివేసేందుకు పోలీసులు ప్రయత్నించారని నమోదు చేశారు. జనవరి 22న ఉప్పల్‌కు చెందిన హుండాయ్ కారును దహనం చేశారు. అడ్వకేట్ల భద్రతపై కోర్టు ఆధీనంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ను ఏర్పాటు చేసి దర్యాప్తు జరిపించాలని లాయర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



బస్సు కాల్వలోపడి నలుగురు మృతి

బహరంపూర్ : పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో సోమవారం ఉదయం బస్సు ప్రమాదం జరిగి నలుగురు మృతి చెందగా, మరో మరో ఏడుగురికి గాయాలయ్యాయి. వంతెన రెయిలింగ్‌ను ఢీకొట్టి ఘోగ్రా కాలువలో బస్సు పడటంతో ఈ ఘటన జరిగిందని పోలీసులు వెల్లడించారు. ప్రమాద ప్రదేశానికి పోలీసులు ఆలస్యంగా వచ్చారని స్థానికులు వారిపై దాడి చేసి, వాహనాన్ని దహనం చేశారు. పోలీసు వాహనాన్ని ఆర్పేందుకు కూడా అగ్నిమాపక దళం ఆలస్యం చేసిందని స్థానికులు అగ్నిమాపక శకటంపై దాడికి పాల్పడటంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి వారిని చెదరగొట్టారు. ఒక మహిళ కాల్వలో పడి మృతి చెందగా, మరో ఇద్దరు ఆసుపత్రిలో మరణించా రన్నారు. గాయాలపాలైన వారికి వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామన్నారు. బస్సులో 60 మంది వరకు స్థానికులు చెబుతుండగా అధికారులు మాత్రం దీనిపై స్పందించలేదు. కాల్వనీటి అడుగుభాగానికి బస్సు చేరుకుందని బాధితు లను పైకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఘటనాస్థలికి మమతా బెనర్జీ చేరుకుని సహాయక చర్యలను సమీక్షిస్తు న్నారు. ప్రమాద మృతుల కుటుంబానికి రూ.5లక్షలు, తీవ్రగాయాలైనవారికి రూ. 50 వేలు నష్టపరిహారం అందిస్తున్నట్లు ఆమె ప్రకటించారు. జిల్లాకలెక్టర్, సీనియర్ పోలీసు అధికారులు, ఎస్పీ ఘటనా స్థలానికి చేరుకున్నారు.

నిత్యానందపై మద్రాస్ హైకోర్టు ఆగ్రహం.. అరెస్ట్ వారెంట్ జారీ



చెన్నై: వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు స్వామి నిత్యానందకు మద్రాసు హైకోర్టులో చుక్కెదురైంది. కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారంటూ నిత్యానందపై జస్టిస్ ఆర్ మహదేవన్ మండిపడ్డారు. ఆయనేమీ చట్టానికి అతీతుడు కాదని.. న్యాయ వ్యవస్థకు లోబడే ఉండాలన్నారు. అరెస్ట్ వారెంట్ జారీచేసిన జస్టిస్.. బుధవారం కోర్టు ముందు ప్రవేశపెట్టాలని ఆదేశించారు. నిత్యానంద శిష్యుల వ్యవహారంపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టులో వాదనల సందర్భంగా ఇక్కడి సమాచారాన్ని సెల్‌ఫోన్‌లో చేరవేస్తున్న అతని అనుచరుణ్ని.. 'ఎవరిచ్చారా అధికారం.. ఇదేమైనా ప్లే గ్రౌండ్ అనుకుంటున్నావా' అని ప్రశ్నించారు. నిత్యానంద ఆశ్రమంపై ఇప్పటికే వందల ఫిర్యాదులు అందాయని, ఆశ్రమం కనపడకుండా చేస్తానని హెచ్చరించారు. తర్వాతి ఆదేశాలు వచ్చే వరకు ఆ వ్యక్తిని కస్టడీలోకి తీసుకోవాలంటూ కోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు. స్వామి నిత్యానంద బారి నుంచి మధురై మఠాన్ని రక్షించాలని, అతనిపై చర్యలు తీసుకొనేలా తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ ఎం. జగతాల ప్రథాపన్ అనే వ్యక్తి మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై వాదనల సందర్భంగా జడ్జి ఈ వ్యాఖ్యలు చేశారు.

'హస్తం' గుర్తును రద్దు చేయండి

ఈసీకి బీజేపీ ఫిర్యాదు

న్యూఢిల్లీ: హస్తం గుర్తును కాంగ్రెస్ పార్టీ నుంచి దూరం చేయాలని బీజేపీ భావిస్తున్నట్లు కనిపిస్తుంది. కాంగ్రెస్ పార్టీ గుర్తు హస్తాన్ని ఉపసంహరించాలని కోరుతూ బీజేపీ నేత అశ్వనీ ఉపాధ్యాయ్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఆ గుర్తును కేటాయించడం ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేనని ఆయన తన ఆరు పేజీల పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన స్వయంగా కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఓంప్రకాశ్ రావత్, ఎన్నికల సంఘం లీగల్ అడ్వయిజర్‌ను కలిశారు. కాంగ్రెస్ పార్టీ గుర్తును ఉపసంహరించుకోవాలంటూ ఆయన కొన్ని అంశాలను ఈసీ ముందుంచారు. కాంగ్రెస్ ఎన్నికల గుర్తు హస్తం.. మానవ శరీరంలోని ఒక భాగమని తెలిపారు. పోలింగ్ నాడు కాంగ్రెస్ నేతలు చేతులు ఊపుతూ.. చేతులు ఓటర్ల వైపు చూపుతూ.. ఎలక్షన్ సింబల్‌ను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. మానవ శరీరంలో విడదీయరాని భాగమైన హస్తాన్ని గుర్తుగా కేటాయించడంతో కాంగ్రెస్ నేతలు తమ గుర్తును దుర్వినియో గపరుస్తున్నారన్నారు. మానవ శరీరభాగానికి సంబంధించి.. ఎన్నికల గుర్తుగా ఉన్నది హస్తం మాత్రమేనని అన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు ఎన్నికల ప్రచారాన్ని ముగించాలని ప్రవర్తనా నియమావళి స్పష్టం చేస్తోందని, ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 ప్రకారం పోలింగ్ కేంద్రానికి వంద కిలోమీటర్ల దూరంలో ఎలక్షన్ సింబల్‌ను ప్రదర్శించడం నిషేధమని తెలిపారు. కానీ, కాంగ్రెస్ పార్టీ ఈ నిబంధనలను ఉల్లంఘిస్తూ.. ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత కూడా తమ గుర్తును ప్రదర్శిస్తూ దుర్వినియోగానికి పాల్పడుతోందని బీజేపీ నేత ఆరోపించారు.

సిక్కుల ఊచకోతలో రాజీవ్ హస్తం..!

సుక్బీర్‌సింగ్ సంచలన ఆరోపణ



న్యూఢిల్లీ : సిక్కుల ఊచకోతపై పంజాబ్ మాజీ డిప్యూటీ సీఎం సుక్బీర్ సింగ్ బాదల్ సంచలన ఆరోపణలు చేశారు. సిక్కుల ఊచకోత వెనుక మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హస్తం ఉందని ఆయన ఆరోపించారు. 1984లో జరిగిన సిక్కు అల్లర్లపై ఇటీవల కాంగ్రెస్ నేత జగదీశ్ టైట్లర్ కొన్ని వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. సుక్బీర్ సింగ్ సోమవారం కాంగ్రెస్ పార్టీపై ఘాటైన విమర్శలు చేశారు. రాజీవ్ కనుసన్నల్లోనే సిక్కుల హత్యలు జరిగినట్లు అకాలీదళ్ నేత ఆరోపించారు. సిక్కుల అల్లర్లు జరిగిన సమయంలో తనతో పాటు నగరమంతా రాజీవ్‌గాంధీ తిరిగారని ఇటీవల జగదీశ్ టైట్లర్ వెల్లడించారు. ఆ వ్యాఖ్యలను ఆధారం చేసుకున్న సుక్బీర్ తాజాగా ఈ ఆరోపణలు చేశారు. రాజీవ్ సూపర్‌విజన్‌లోనే హత్యలు జరిగినట్లు తెలుస్తున్నదని సుక్బీర్ బాదల్ అన్నారు. జగదీశ్ టైట్లర్ వెల్లడించిన అంశాల ఆధారంగా సీబీఐ విచారణ చేపట్టాలని ఆయన డిమాండు చేశారు. 1984 అక్టోబర్ 31వ తేదీన ఇందిరాగాంధీ హత్యకు గురయ్యారు. సిక్కు బాడీగార్డ్ ఆమెను హతమార్చారు. ఆ తర్వాత సిక్కులపై భారీస్థాయిలో మారణహోమం జరిగింది. ఢిల్లీ, యూపీ, హర్యానా, ఎంపీ, మహారాష్ట్రలో సుమారు 3325 మంది సిక్కులు మరణించారు. ఒక్క ఢిల్లీలోనే సుమారు 2733 మంది మరణించారు.

నదీజలాల్లో కర్ణాటక మోసం:గోవా

పనాజీ: మహాదాయి నదీజలాలను మలప్రభ నదికి మళ్లించడాన్ని నిరసిస్తు కర్ణాటకపై తీర్మానాన్ని ప్రతిపాదించనున్నట్లు గోవా డిప్యూటీ స్పీకర్ మైఖేల్ లోబో తెలిపారు. స్పీకర్ ప్రమోద్ సావంత్‌తో పాటు ఇద్దరు గోవా శాసనసభ్యులతో కర్ణాటకలోని కనకుంబీని సందర్శించిన అనంతరం లోబో ఈ వ్యాఖ్యలు చేశారు. అండర్ వాటర్ కాల్వలను ఏర్పాటు చేసి, కనకుంబీ వద్ద మహాదాయి నదీజలాలను కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా మళ్లిస్తుందని, అందువల్ల గోవాకు స్వల్పంగా మాత్రమే జలాలు వస్తున్నాయని ఆయన ఆరోపించారు.

మాజీ గవర్నర్ డీఎన్ సాహే కన్నుమూత

పాట్నా: ఛత్తీస్‌గఢ్, త్రిపురకు గవర్నర్‌గా సేవలందించిన దేవేశ్ నందన్ సాహే (82) మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆదివారం రాత్రి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో సహే తుది శ్వాస విడిచారు. 1936లో జన్మించిన సహే, ఇండియన్ పోలీసు సర్వీస్‌లో చేరి, అంచెలంచెలుగా ఎదుగుతూ బీహార్ డీజీపీ స్థాయికి చేరారు. పదవీవిరమణ అనంతరం సమతా పార్టీలో చేరారు. 2000లో ఛత్తీస్‌గఢ్ కొత్త రాష్ట్రంగా ఏర్పాడిన తర్వాత మొదటి గవర్నర్‌గా నియమితులయ్యారు.

లష్కరే తోయిబాపై చార్జిషీట్ దాఖలు..

శ్రీనగర్: 2017 జూలైలో అమర్‌నాథ్ యాత్రికులపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 8మంది ప్రాణాలు కోల్పోయిన కేసులో జమ్మూకాశ్మీర్ పోలీసులు లష్కరే తోయిబా (పాక్ ఉగ్రవాద సంస్థ) తోపాటు దాడి కుట్రకు పాల్పడిన 11మందిపై చార్జిషీట్ దాఖలు చేశారు. ఆరు నెలల్లో ఈ ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ జరిపి..వివిధ సెక్షన్ల కింద 1600 పేజీలతో కూడిన చార్జిషీట్ దాఖలు చేశారు. చార్జిషీట్ నమోదైన వారిలో ఓ మైనర్ ఉన్నట్లు దక్షిణ కాశ్మీర్ ఎస్పీ పాని తెలిపారు.

రిటైర్డ్ ఐపీఎస్ ఆత్మహత్య

హిస్సార్ : హర్యానాలోని హిస్సార్‌లో రిటైర్డ్ ఐపీఎస్ తన ఫాం హౌజ్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. గుర్గావ్ వాసి అయిన రాం సింగ్ బిష్ణో ఆదివారం సాయంకాలం తుపాకితో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ఆయనపై ఉన్న కొన్ని కోర్టు కేసుల గురించి ఆందోళన చెంది, ఈ ఘాతుకానికి పాల్పడ్డారని వారు పేర్కొన్నారు. తుపాకి శబ్దంలో దగ్గర్లోని పొలంలో పనులు చేసుకుంటున్న కొందరి రైతులు ఫాం హౌజ్‌కు చేరుకోగా, బిష్ణో రక్తం మడుగులో పడి ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

ఆఫీస్ బేరర్లను తొలగించిన అన్నాడీఎంకే

చెన్నై: కొంత విరామం తర్వాత అన్నాడీఎంకే మళ్లీ క్రమశిక్షణ కొరడాను ఝుళిపించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు 117 మంది ఆఫీస్ బేరర్లను తొలిగించింది. తమిళనాడు ముఖ్యమంత్రి కే. పళనిసామి, ఉప ముఖ్యమంత్రి ఓ.పన్నీర్ సెల్వం నేతృత్వంలోని కమిటీ, శివగంగా జిల్లా, దాని సబ్ యూనిట్లకు చెందిన ఆఫీస్ బేరర్లను పార్టీ నుంచి ఉద్వాసన పలికింది. వారిలో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు కేకే ఉమాదేవన్, చోళం సీటీ పలనిసామి కూడా ఉన్నారు.

యూపీలో 6 వేల సోలార్ ప్లాంట్లు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో రానున్న ఐదేళ్లలో 6 వేల సోలార్ ప్లాంట్లను నిర్మించనున్నట్లు అదనపు ఇంధన వనరుల శాఖ మంత్రి బ్రిజేష్ పాఠక్ తెలిపారు. 10,700 మెగావాట్ల విద్యుత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఈ సోలార్ ప్లాంట్ల నిర్మాణం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రానికి 22, 300 మెగావాట్ల సోలార్ ఎనర్జీ సామర్థ్యం ఉంది. 1985లో ఏర్పాటు చేసిన వైకల్పిక్ ఊర్జా విభాగ్‌ను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయంటూ మంత్రి వ్యాఖ్యలు చేశారు.

చెత్తబుట్టలో మృత శిశువు

న్యూఢిల్లీ : దక్షిణ ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో మార్చురీ చెత్త బుట్టలో ఓ ఆడ మృత శిశువును పోలీసులు కనుగొన్నారు. ఈ నెల 27న పుట్టిన ఆడ శిశువును ప్రాణం ఉండగానే ఆమె తండ్రికి అప్పగించగా, ఆడ పిల్ల పుట్టినందుకు మార్చురీకి సమీపంలోని చెత్త బుట్టలో పారేశాడని ఆసుపత్రి వర్గాలు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. చెత్తబుట్టలోనే శిశువు చనిపోయిందని, కేసును నమోదు చేసి విచారిస్తున్నట్లు వారు తెలిపారు.

మత ఘర్షణల అదుపులో విఫలం: ఎస్పీ ఉద్వాసన

లక్నో : పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో చెలరేగిన మత ఘర్షణలను అదుపు చేయడంలో విఫలమైనందుకు పోలీసు సూపరింటెండెంట్ సునీల్ కుమార్ సింగ్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. పశ్చిమ యూపీలోని కస్గంజ్‌లో గత వారం చెలరేగిన మత ఘర్షణల్లో మూడు దుకాణాలు, రెండు బస్సులు, ఒక కారు మంటలకు ఆహుతి కాగా అల్లర్లను అదుపు చేయడంలో జిల్లా ఎస్పీ విఫలం అయ్యారంటూ పలు విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఎస్పీని సీఎం యోగి ఆదిత్యనాథ్ బదిలీ చేశారు. నూతన ఎస్పీగా పియూష్ శ్రీవాస్తవను నియమించినట్టు సమాచారం.

'ఎంఆర్ఐ మిషన్' ఘటనపై విచారణకు ఆదేశం

ముంబై: 'ఎంఆర్ఐ మిషన్' ఘటనపై బ్రిహంముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో నగరంలోని అన్ని ఆసుపత్రులకు నిబంధనలను జారీ చేసినట్టు బీఎంసీ ప్రతినిధి తెలిపారు. ఈ దుర్ఘటనకు బాధ్యులైన నాయర్ ఆసుపత్రి నిర్వాహకులు విచారణలో తాము పోలీసులకు సహకరిస్తున్నట్టు తెలిపారు.

బెదిరింపులను పట్టించుకోను : మహిళా ఇమాం

మలప్పురం: మసీదులో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేసినందుకు బెదిరింపులను ఎదుర్కొంటున్న మహిళా ఇమాం జమితా(34) తాను ఎవరికీ బెదరనని, మసీదులో ప్రార్థనలను కొనసాగిస్తానని తెలిపారు. ఖురాన్ సున్నత్ సొసైటి కార్యదర్శి అయిన జమితా మలప్పురం జిల్లాలోని వండూర్ గ్రామంలో గత శుక్రవారం ప్రార్థనలను నిర్వహించారు. సాధారణంగా జుమా (శుక్రవారం) ప్రార్థనలు మగ వారే నిర్వహిస్తారు. జమితాపై సోషల్ మీడియాలో అనేక కామెంట్లు, బెదరింపులు పోస్ట్ అయాయి.

ఆర్గానిక్ వ్యవసాయానికి ఊతం: హిమాచల్ సీఎం

ధర్మశాల: ఆర్గానిక్ వ్యవసాయంతో రైతుల్లో ఆత్మవిశ్వాసం రెండింతలు అవుతుందని హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి జై రాం ఠాకూర్ అన్నారు. సోమవారం పాలంపూర్‌లో 'చౌదరి సర్వణ్ కుమార్ హిమాచల్ ప్రదేశ్ కృషి విశ్వవిద్యాలయ'లో జీరో బడ్జెట్ ప్రకృతి ఆధారిత వ్యవసాయం ప్రాజెక్ట్‌ను ముఖ్యమంత్రి ఆరంభించారు. రసాయనిక ఎరువులను ఉపయోగించడం మానాలని, సిక్కిం ను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పోలీస్ జీపులో వచ్చి యువతి కిడ్నాప్..

పన్నా(మధ్యప్రదేశ్): మధ్యప్రదేశ్‌లో కిడ్నాపర్లు బరితెగించారు. పోలీస్ జీప్‌లోనే ఓ యువతిని ఎత్తుకెళ్లారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. పన్నా జిల్లాలోని బాముర్హా గ్రామంలో ఈ కిడ్నాప్ జరిగింది. రోడ్డుపై ఓ వ్యక్తి పడి ఉన్నాడని డయల్ 100కు సమాచారమందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. జీపు నుంచి బయటకు వచ్చి రోడ్డుపై పడి ఉన్న వ్యక్తి దగ్గరకు వెళ్లారు. అప్పటి వరకు ఉలుకు పలుకు లేకుండా ఉన్న వ్యక్తి కాస్తా... ఒక్కసారిగా లేచి పోలీసులకు గన్ పాయింట్ చేశాడు. అక్కడే ఉన్న తన నలుగురు సహచరులను పిలిచాడు. వాళ్లందరూ కలిసి ఆ ఇద్దరు పోలీస్ సిబ్బందిని బందీలుగా చేసుకుని జీపు ఎక్కించారు. ఆ పోలీస్ జీపును నేరుగా సమీపంలోని ఓ యువతి ఇంటికి తీసుకువెళ్లారు. ఇంట్లో ఉన్న ఆమెను, ఆమె తండ్రిని బయటకు పిలిచి.. స్టేషన్‌కు రావాలంటూ జీపు ఎక్కించారు. మొదట వాళ్లు నిరాకరించినా.. బెదిరించడంతో జీపు ఎక్కక తప్పలేదు. యువతితో పాటు ఆమె తండ్రి, బాబాయి లోపల కూర్చున్నారు. జీపు కొద్ది దూరం వెళ్లిందో లేదో... ఆమె తండ్రిని, బాబాయిని బలవంతంగా కిందకు దింపేశారు. మరికొద్ది దూరం వెళ్లిన తర్వాత జీపును, పోలీస్ సిబ్బందిని వదిలేసి... వారు వేరే కారులో ఆ యువతితో ఉడాయించారు. దీనిపై అన్ని పోలీస్ స్టేషన్లను అలర్ట్ చేశామని తెలిపిన ఎస్పీ రియాజ్ ఇక్బాల్.. నిందితుల కోసం గాలింపు చేపట్టామన్నారు.



31 తర్వాత సమ్మెలోకి ముఠా కార్మికులు

ముఠా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : ముఠా కార్మికుల కూలీ రేట్ల పెంపు విషయంలో యాజమాన్యాల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈ నెల 31వ తేదీ తర్వాత ముఠా కార్మికులు సమ్మెలోకి వెళ్ళనున్నట్లు ముఠా కార్మిక సంఘం(ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన ఆంజనేయులు తెలిపారు. గుంటూరులోని రేగుల రాఘవయ్యభవన్‌లో సోమవారం బండ్ల బజారు స్టీల్ ముఠా కార్మికుల సర్వసభ్య సమావేశం పోనుగోటి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిధిగా చిన ఆంజనేయులు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయిన తరుణంలో ముఠా కార్మికుల కూలీ రేట్ల పెంపు విషయంలో యాజమాన్యాలు మొండి వైఖరి అవలంభించడం తగదన్నారు. నగరంలోని బండ్ల బజారు హోల్‌సేల్ (గ్రీన్స్ అండ్ జనరల్ మర్చంట్ అసోసియేషన్, ది మెటల్ ట్రేడర్ అసోసియేషన్(స్టీల్ విభాగం)లో పనిచేస్తున్న కార్మికులకు కూలీ రేట్ల అగ్రిమెంట్ డిసెంబర్‌తో ముగిసిందని, దీనిపై రెండు అసోసియేషన్లకు నోటీసులు పంపించినప్పటికీ స్పందన లేకపోవడంతో కార్మికులు ఆందోళనకు సిద్ధమవుతున్నారన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నగర సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు, బండ్ల బజారు ముఠా కార్మిక సంఘం నాయకులు ముసల లక్ష్మయ్య, ఆంజనేయులు, ఎస్.కె.హుస్సేన్, పి.వెంకటేశ్వరరెడ్డి, ఏ.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట



విశాలాంధ్ర-అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యంతనిస్తూ రూ.130 కోట్లు నాబార్డు నిధులతో భవనాల నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. విశాఖ జిల్లా అనకాపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో సోమవారం కిసాన్‌మేళాకు ఆయన హజరయ్యారు. అనంతరం సభలో సోమిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 43 లక్షల ఏకరాల్లో ఉద్యానవన పంటలు సాగు అవుతున్నాయని, బిందు సేద్యం కోసం రూ,1130 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఉత్తరాంధ్రలో దిగుబడులు తక్కువగా ఉన్నాయని, వరి ఉత్పత్తిలో నెల్లూరు మొదటి స్థానంలో ఉందన్నారు. వ్యవసాయ అనుబంధరంగాల్లో జాతీయ స్థాయిలో 2.5 శాతం వృద్ధి సాధించగా, రాష్ట్ర స్థాయిలో 25.6 శాతం ప్రగతి సాధించినట్లు వివరించారు. రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ సినియర్ రైతులను పరిశోధనాలలో భాగస్వామ్యులను చేయాలని సూచించారు. జిల్లాలోని నాలుగు షుగర్ ఫ్యాక్టరీల్లో తుమ్మపాల షుగర్‌ఫ్యాక్టరీ ఆధునీకరణకు కృషి చేయాలన్నారు. అరకు కాఫీ లాగే అనకాపల్లి బెల్లం పౌడర్ ప్రత్యేకతను ప్రజల్లోకి తీసుకువెళ్లాన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైరపర్సన్ లాలం భవానీభాస్కర్, చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ దామోదరనాయుడు, విస్తరణ సంచాలకులు రాజారెడ్డి, పరిశోధన సంచాలకులు వి.నాయుడు.ఏడీఆర్ డా॥ జె.కృష్ణప్రసాద్‌జీ, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు పి.శివప్రసాద్ పాల్గొన్నారు.



కీచక ప్రొఫెసర్‌ను సర్వీస్ నుంచి తొలగించాల్సిందే

విశాలాంధ్ర-కాకినాడ : జేఎన్‌టీయూకేలో విద్యార్థునులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ కె.బాబులును తక్షణం సర్వీస్ నుంచి తొలగించాలంటూ సోమవారం రాత్రి మరోసారి విద్యార్థులు ఆందోళనకు దిగారు. ప్రధాన గేటు వద్ద బైఠాయించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి సోమవారం మధ్యాహ్నం యూనివర్సిటీలో విచారణ చేపట్టారు. విద్యార్థినుల నుంచి వివరాలు స్వీకరించారు. ఎన్ని విచారణలు చేసినా సరైన న్యాయం జరిగే అవకాశాలు లేనందున తక్షణం బాబులును సర్వీస్ నుంచి తొలగించాల్సిందేనంటూ రాత్రి వర్సిటీ ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు కొందరు విద్యార్థులను కలెక్టర్ కార్తికేయ మిశ్రాతో చర్చించేలా వర్సిటీ వీసీ కుమార్, రాజ్యలక్ష్మి నేతృత్వంలో కలెక్టరేట్‌కు తీసుకువెళ్ళారు. విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ చట్టప్రకారం యూనివర్సిటీ వీసీ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉందని, తద్వారా పోలీసులు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటారని సూచించారు. మహిళా కమిషన్ తరపున కూడా పోలీసులకు సిఫార్సు చేయాలని కోరారు. రాత్రి తొమ్మిది గంటల వరకు విద్యార్థుల ఆందోళన కొనసాగడంతో స్వల్ప అలజడి రేగింది.

ప్రభుత్వాసుపత్రి మందుల స్టోర్స్‌లో అగ్నిప్రమాదం



విశాలాంధ్ర-కాకినాడ : కాకినాడలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మందుల పంపిణీ విభాగంలో సోమవారం ఉదయం ఆరు గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో ఆసుపత్రి ఆవరణలో ఒక్కసారిగా కలకలం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఆసుపత్రికి చేరుకుని మంటలను అదుపు చేశారు. మందుల పంపిణీ విభాగంలోని ఎనిమిది కౌంటర్లలోని ఒక కౌంటర్‌లో మందులు, ఏసీలు, కంప్యూటర్లు, ఇతర ఫర్నిచర్ కాలి బూడిదయ్యాయి. రూ.11లక్షల విలువైన మందులు, రూ.రెండు లక్షల విలువైన ఫర్నిచర్ మొత్తం రూ.13 లక్షల నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు. సోమవారం ఆసుపత్రిలో అవుట్ పేషెంట్లకు ఓపీ చీటీ ప్రకారం మందుల పంపిణీకి ఆటంకం ఏర్పడింది. అప్పటికప్పుడు ఆసుపత్రి అధికారులు ప్రత్యామ్నాయగా ఆసుపత్రి ఆవరణలో ఆరుబయట టెంట్‌లు వేసి రోగులకు మందులు పంపిణీ చేశారు.

రేపటి నుంచి వ్యవసాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్

విశాలాంధ్ర-విజయవాడ : వ్యవసాయశాఖ ఉద్యోగుల సేవా సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఈ నెల 31వ తేదీ నుంచి విజయవాడలోని జ్యోతి కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ తెలిపారు.

విజయవాడలోని ఎన్‌జీవో హోంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రారంభసభకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, పార్లమెంటు సభ్యులు కేశినేని నాని, వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్, కృష్ణాజిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం హాజరవుతారన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీన నూతన కార్యవర్గం ఎన్నిక ఉంటుందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వ్యవసాయశాఖ ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఏపీ అగ్రికల్చర్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ వీఎస్ ప్రసాద్, కోశాధికారి ఎ.శ్యామ్‌సుందర్ శ్రీనివాస్, కృష్ణా జిల్లా ఆధ్యక్షుడు పీవీ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన సమరయోధుని కుటుంబం

బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం ప్రాణాలొడ్డి పోరాడిన సమరయోధుల కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నాయి. నాటి పరిస్థితుల్లో ఆ చైతన్యమూర్తుల త్యాగాలు, జాతికి చేసిన సేవలను పట్టించుకోకుండా అవమానపర్చడం ఆందోళన కలిగించే పరిణామం. వృద్ధాప్యంలో మగ్గిపోతున్న పండుటాకులను సైతం పదేపదే ఆఫీసుల చుట్టూ తిప్పుకోవడం ఆవేదన కలిగిస్తోంది. ప్రభుత్వం ఇస్తానన్న భూమి కోసం 85 ఏళ్ల వయసులో ఓ స్వాతంత్ర్య సమరయోధుని సతీమణి విజయనగరం కలెక్టరేట్ వద్ద ప్రత్యక్ష ఆందోళనకు దిగడం అందరినీ కదలించింది.

–విశాలాంధ్ర బ్యూరో-విజయనగరం





విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన దెక్కత అప్పారావురెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడు. తన సహచరులు కూనిశెట్టి వెంకటనారాయణరావు, దారాముక్కల చిన్నారావు తదితరులతో కలిసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహంలో బ్రిటీష్ పోలీసుల లాఠీ దెబ్బలకు తల్లడిల్లారు. జైలు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతప్రభుత్వం అప్పారావురెడ్డికి స్వాతంత్ర్య సమరయోధుని పెన్షన్ మంజూరు చేసింది. ఇదే సమయంలో కొంత భూమి ఇస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదు. ప్రతి స్వాతంత్ర్య సమరయోధునికి 10 ఎకరాల మెట్ట భూమి, 500 గజాల ఇళ్ల స్థలం ఇస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. దీని కోసం రెడ్డి ఎన్నోసార్లు అధికారులకు దరఖాస్తూ ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. భూమి వస్తుందన్న ఆశతో ఆఖరిక్షణం వరకు నిరీక్షిస్తూ 2000వ సంవత్సరంలో కన్నుమూశారు. తమ కుటుంబానికి రావాల్సిన భూమి కోసం అప్పారావు భార్య రాంబాయమ్మ అప్పటి నుంచి దరఖాస్తులు చేయడంతోపాటు చేయని ప్రయత్నాలు లేవు. ఎన్నోసార్లు జిల్లా అధికారులకు విన్నవించారు. చివరకు ముఖ్యమంత్రి గ్రీవెన్స్ 'మీ కోసం'లో కూడా దరఖాస్తు ఇచ్చారు. అయినా ప్రయోజనం కానరాలేదు. ఆమెకు ఆరుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు. చిన్న కుమార్తె వివాహం చేసుకోకుండా తల్లికి తోడుగా ఉండిపోయింది. ఆ వృద్ధురాలికి నెలనెలా వచ్చే పెన్షన్ సొమ్ముతోనే తల్లీకూతురు జీవిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలం, భూమి వస్తే కుటుంబానికి ఆశరా అవుతుందని ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. ఫలితం లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో 85 ఏళ్ల వయసులో ఆమె సోమవారం విజయనగరం కలెక్టరేట్ వద్ద ప్రత్యక్ష ఆందోళనకు దిగారు. ఇకనైనా ప్రభుత్వం తమను ఆదుకోవాలని పాలకులను కోరుతున్నారు.

'అగ్రి' బాధితుల మరో పోరాటం

- ఒకటి నుంచి బాధితుల ఇల్లు సందర్శన
- 11 నుంచి జిల్లాల్లో విస్తృత సమావేశాలు
- 15,16 తేదీల్లో మండల స్థాయి జీపు జాతాలు
- 19 నుంచి మండలాల్లో బాధితుల రిలేదీక్షలు

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాథ్‌రెడ్డి



విశాలాంధ్ర- అనంతపురం అర్బన్ : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం కోసం ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకొచ్చేందుకు మరో పోరాటానికి సిద్ధమవుతున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి. విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతపురంలోని స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో సోమవారం అగ్రిగోల్డ్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు సిద్దేశ్వర అధ్యక్షతన బాధితుల సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా బి.విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులతో కలిసి గతంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరవధిక నిరహార దీక్ష, రాష్ట్రవ్యాప్త బస్సుయాత్ర ఫలితంగా గత ఏడాది మార్చి 23న అసెంబ్లీలో ముఖ్యమంత్రి అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయడంతోపాటు మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెలిస్తామని హామీ ఇచ్చారన్నారు. 10 నెలలు కావాస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రజాస్వామ్యం, న్యాయవ్యవస్థపై బాధితుల్లో నమ్మకం నడలుతోందన్నారు. బాధితుల డిపాజిట్ల చెల్లింపునకు ప్రత్యేక స్కీముతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తే కోర్టులకు అభ్యంతరం ఉండబోదన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల ఆత్మహత్యల నివారణకు బడ్జెట్‌లో రూ.4వేల కోట్లు కేటాయించడంతోపాటు ఈ సమస్యకు సత్వరమే పరిష్కారం చూపాలని కోరుతూ పోరాటాన్ని తీవ్రతరం చేయనున్నామన్నారు. దీనిలో భాగంగా ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 10 వరకు అగ్రిగోల్డ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏజెంట్లు, కస్టమర్లు బాధితుల గడపగడపకు వెళ్లి వారిలో ధైర్యం నింపుతామన్నారు. ఫిబ్రవరి 11 నుంచి 15వ తేదీ వరకు జిల్లాల్లో విస్తృత స్థాయి సమావేశాలు, 15,16 తేదీల్లో మండల స్థాయిల్లో జీపు జాతాలు ఉంటాయన్నారు. ఫిబ్రవరి 19,20,21 తేదీల్లో మండల కేంద్రాల్లో బాధిత కుటుంబ సభ్యులతో రిలే నిరహార దీక్షలు నిర్వహించాలని అసోసియేషన్ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అగ్రిగోల్డ్ బాధితులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అగ్రిగోల్డ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నారాయణప్ప, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు దస్తగిరి, ధనుంజయతో పాటు జిల్లా వ్యాప్తంగా అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.



గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం కీలకం

విశాలాంధ్ర - సి బెళగల్ : కర్నూలు జిల్లాలో సాగు, తాగునీటి సమస్య లేకుండా ఉండాలంటే తక్షణం గ్రుండేవుల వద్ద ప్రాజెక్టు నిర్మించాలని రాయలసీమ సాగునీటి సాధన కమిటీ అధ్యక్షులు దశరథరామిరెడ్డి అన్నారు. సాగునీటి సాధన కమిటీ, కేసీ కెనాల్ రైతుల ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు నుంచి గుండ్రేవుల వద్ద నదీతీరం వరకు దాదాపు వెయ్యిమందితో కలిసి చేపట్టిన పాదయాత్ర సోమవారం గుండ్రేవుల వద్దకు చేరుకుంది. రైతులతోపాటు ఆయన నదిని పరిశీలించారు. అనంతరం దశరథరామయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గుండ్రేవుల గ్రామం వద్ద తుంగభద్ర నదిపై ప్రాజెక్టు నిర్మాణం చేపడితే జిల్లాలో నీటి సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కృష్ణ, సమితి సభ్యులు శ్రీనివాసులు, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు శివనాగిరెడ్డితో కూడిన బృందం గుండ్రేవుల గ్రామంలో సాగునీటి సాధన కమిటీ సభ్యులను కలిసి సంఘీభావం ప్రకటించారు. గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణంతో రైతుల కష్టాలు తీరిపోతాయని. ప్రాజెక్టు నిర్మించే ముందు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. గ్రామంలోని రైతులు వారి పాదయాత్రను అనుసరించి సంఘీభావం తెలిపారు.

విదేశీలను బెదిరించిన ముగ్గురు కానిస్టేబుళ్లు సస్పెండ్

గుంటూరు జిల్లా ఇంటెలిజెన్సీ విభాగంలో కలకలం

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : విదేశీయులను బెదిరించి వారి నుంచి పెద్దమొత్తంలో నగదు దోచుకున్న ముగ్గురు స్పెషల్ ఇంటెలిజెన్సీ పోలీసులు సోమవారం ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. వేటు పడిన వారిలో కానిస్టేబుల్స్ శ్రీనివాసకుమార్, ప్రదీప్, రవితేజ ఉన్నారు. ఇటీవల అమెరికా, ఐర్లాండ్ నుంచి దాదాపు ఇరవై మంది విదేశీయులు గుంటూరు జిల్లా వచ్చారు. గుంటూరు రూరల్‌లోని చౌడవరంలో స్నేహితుని ఇంట్లో శుభకార్యం ముగించుకుని గుంటూరులోని ఒక లాడ్జిలో బస చేశారు. ఈ విషయం తెలుసుకున్న గుంటూరు స్పెషల్ ఇంటెలిజెన్సీ పోలీసులు తనిఖీల పేరుతో లాడ్జికి చేరుకున్నారు. పాస్‌పోర్టులు సరిగ్గా లేవంటూ రకరకాల ప్రశ్నలతో విదేశీ యులను భయాందోళనలకు గురిచేశారు. భయపడిన విదేశీయులు కొంత నగదును పోలీసులకు లంచంగా ఇచ్చారు. జేబులు నింపుకున్న పోలీసులు వెను దిరిగారు. విదేశీయులు వారి ప్రాంతాలకు చేరుకున్న తర్వాత గుంటూరు పోలీసుల మోసంపై ఆయా దేశాల ఎంబసీలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులను స్వీకరించిన ఎంబసీ అధికారులు భారతదేశంలోని సంబంధిత శాఖకు సమాచారం ఇచ్చారు. ఈ ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర డీజీపీ మాలకొండయ్య విదేశీయులను వేధించిన కానిస్టేబుళ్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా ఎస్పీని ఆదేశించారు. దీంతో గుంటూరు అర్బన్ జిల్లా ఎస్పీ విజయరావు ప్రాథమిక విచారణ అనంతరం స్పెషల్ ఇంటెలిజెన్సీ విభాగానికి చెందిన ముగ్గురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువరించారు.

900 ఎకరాల్లో వుడా టౌన్‌షిప్




విశాలాంధ్ర- విశాఖ : విశాఖపట్నంలో అంతర్జాతీయ స్థాయి టౌన్‌షిప్‌ల నిర్మాణం చేపట్టాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రణాళికలు సిద్ధం చేయాలని వుడాకు బాధ్యతలు అప్పగించింది. విదేశాల్లో 'వాక్ టు వర్క్' పేరుతో పనిచేస్తున్న కర్మాగారం, కార్యాలయానికి సమీపంలో నివాస గృహాలు ఉండేలా టౌన్‌షిప్‌ల నిర్మించాలన్నది లక్ష్యం. నగర శివారుల్లో పరిశ్రమలు, కార్యాలయాలకు సమీపంలో ఈ లేఅవుట్ వెలుస్తున్నాయి. ఐదారు గ్రామాలకు అందుబాటులో లంకెలపాలెం వద్ద 900 ఎకరాల్లో టౌన్‌షిప్ నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ఆటోనగర్, గాజువాక, గంగవరం, పెదముషిడివాడ, సబ్బవరం ప్రాంతాల్లోని ఉద్యోగులు, కార్మికులకు అనుకూలంగా సిద్ధం చేశారు. దీనిలో 150 ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ కూడా రానుంది. టౌన్‌షిప్ పక్కన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌తో పాటు కమర్షియల్ భవనాలు, విద్యాసంస్థలు ఉండే లా చూస్తున్నారు. విదేశాల్లో ఇలాంటి విధా నం విజయవంతం కావడంతో ఇక్కడ అమలు చేయాలని చూస్తున్నారు. సమయాభావం, ట్రాఫిక్ సమస్యలు, ఇంధనం ఖర్చుతగ్గడానికి టౌన్‌షిప్‌లు దోహదపడతాయని ప్రభుత్వం భావిస్తుంది. అనకాపల్లిలోని చెర్లోపల్లి లేఅవుట్‌లో 55 ఎకరాల్లో రూపు దిద్దుకున్న నేపథ్యంలో త్వరలో లబ్ధిదారులకు ఆక్షన్ ద్వారా కేటాయించనున్నారు. లంకెలపాలెం టౌన్‌షిప్ విజయవంతమైతే మరికొన్ని నిర్మించాలని ప్రభుత్వం భావిస్తుంది.

వెలుగొండ ప్రాజెక్టుకు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర - ఒంగోలు బ్యూరో : ప్రతిష్టాత్మక పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు సోమవారం విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ప్రాజెక్టుకు సంబంధించి టన్నల్ వన్ కు రూ. 4 కోట్లు, టన్నల్ టూ కు రూ. 3 కోట్లు విద్యుత్ బకాయిలు పేరుకుపోవడంతో సరఫరా నిలిపి వేసినట్లు విద్యుత్‌శాఖ అధికారులు వెల్లడించారు. ఇప్పటికే కాంట్రాక్టర్లకు విద్యుత్ బకాయిలపై నోటీసులు ఇచ్చినప్పటికీ బిల్లులు చెల్లించలేదు. ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదల కాలేదని తెలుస్తోంది. రూ.7 కోట్ల బకాయి ఉండటంతో సరఫరా చేస్తే మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఉన్నతాధికారులు ఆదేశాలతో ప్రాజెక్టుకు నిలిపి వేసినట్టు అధికారులు వెల్లడించారు. ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాలకు ఎంతో ఉపయోగపడే పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం రూ. 5,150 కోట్లతో చేపట్టిన విషయం విధితమే. 2018

- రూ.7 కోట్ల విద్యుత్ బకాయిలు
- ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదంటున్న కాంట్రాక్టర్లు
- ఈ ఏడాది మొదటి టన్నల్ పూర్తి కావడం కష్టమే

నాటికి సొరంగం పనులు పూర్తి చేస్తామంటూ మ్యుమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. రాష్ట్ర జలవనరులశాఖమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి శిద్దా రాఘవరావు కూడా ఇటీవల ప్రాజెక్టును సందర్శించి 2018 కల్లా మొదటి దశ నిర్మాణం పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందిస్తామని చెప్పారు. అయితే నిధులు విడుదల చేయకుండా తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం జిల్లా ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపుతోందనే విమర్శ వినిపిస్తోంది. ఫలితంగా



నేడు ప్రాజెక్టుకు ఏకంగా పవర్ కట్ చేశారు. గతంలోనూ రెండుసార్లు విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో జిల్లా కలెక్టర్, మంత్రి ఉమామహేశ్వరరావు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో సరఫరా పునరుద్ధరించారు. ప్రస్తుతం ప్రాజెక్టు నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో సుమారు రూ.250 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం. తక్షణం రూ. 7 కోట్ల బిల్లులు చెల్లిస్తేనే విద్యుత్ సరఫరాను పునరుద్ధించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో కీలకమైన వెలుగొండ ప్రాజెక్టుకు మళ్లీ విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జిల్లావ్యాప్తంగా చర్చాంశనీయంగా మారింది.

వెలుగొండ ప్రాజెక్టును 2018 లోపే పూర్తి చేస్తామంటూ ముఖ్యమంత్రి నుంచి మంత్రులు చేస్తున్న ప్రకటనలకు, క్షేత్ర స్థాయిలో పనుల పురోగతికి ఎంతో వ్యత్యాసం కనబడుతోంది. 2018 లోపే మొదటి టన్నల్ పనులు పూర్తి చేసి కొంత మేరకైనా రైతులకు సాగునీరు అందించాలంటే వచ్చే బడ్జెట్ సమావేశాల్లో రూ.1,500 కోట్ల నుంచి రూ. 2 వేల కోట్లు కేటాయిస్తేనే సాధ్యమవుతుందని నిపుణులు అభిప్రాయం. గత ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో వెలుగొండ ప్రాజెక్టుకు రూ. 250 కోట్లు కేటాయించారు.అరకొర నిధులు కేటాయిస్తూ పనులు ముందుకు సాగడం లేదంటూ కాంట్రాక్టర్లపై ఒత్తిడి చేస్తున్న ప్రభుత్వ తీరు విమర్శలకు దారితీస్తోంది. కాంట్రాక్టర్లను మార్చే ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తుందనే ప్రచారం సాగుతోంది.

ధర్మవరం చేనేతకు అంతర్జాతీయ గుర్తింపు : పవన్



విశాలాంధ్ర ప్రతినిధి-అనంతపురం : ధర్మవరం చేనేతకు అంతర్జాతీయ గుర్తింపు లభించేందుకు కృషి చేస్తానని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో ధర్మవరం, హిందూపురంలలో నిర్వహించిన ఆఖరిరోజు యాత్రలో భాగంగా ఆయన ప్రసంగిస్తూ ధర్మవరం పట్టు చీరను అంతర్జాతీయస్థాయికి తీసుకెళతామన్నారు. అక్కడి వారు కోరుకున్న డిజైన్ల అనుగుణంగా వాటిని తయారుచేసి అక్కడ మార్కెటింగ్ చేయించి వారికి అధికంగా ఐలోపేటం అయ్యేలా చేస్తామన్నారు. తాను పవర్ లూమ్స్ వ్యతిరేకం కాదని, మరింత సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా అభివృద్ధి సాధించి జీవన విధానం పెరిగేందుకు దోహదపడుతుందన్నారు. చేనేత సమస్యలు తెలుసుకున్నానని, రానున్న 2019 ఎన్నికల మేనిఫెస్టోలో వారి సమస్యలను ఆమోదిస్తామన్నారు. హంద్రీ నీవా త్వరితగతిన పూర్తి చేసి హిందూపురం ప్రజల దాహార్తి తీర్చడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానన్నారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తానన్నారు. పార్టీ సరైన విధి విధానాలు, అంకితభావం లేకపోతే నష్టపోతుందని, అందుకే జన సైనికులు ప్రజా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికంటే ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలన్నది నిర్ణయించుకోలేదని, మన ఆలోచన, విధి విధానాలు నచ్చిన వారితో పొత్తుపై ఆలోచన చేస్తామన్నారు. తెలంగాణ సాధనలో అన్ని రాజకీయ పార్టీలు ఏకమై రాష్ట్రాన్ని సాధించుకున్నాయని, అయితే రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదాపై రాజకీయ పార్టీలు ఒక్కో విధానాన్ని అవలంబిస్తున్నాయన్నారు. దీనిపై అధికార టీడీపీ, బీజేపీ లు చర్చించుకుని ప్యాకేజీపై హోదాపై ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జగన్ పాదయాత్ర @ 1000 కిమీ



విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర 74వ రోజు సోమవారం గూడూరు నుంచి ప్రారంభమై గోగినేనిపురం, చెన్నూరు క్రాస్ రోడ్, వెంకటగిరి క్రాస్ రోడ్స్, ఊర్లపుంట్ల క్రాస్ రోడ్స్ మీదుగా సైదాపురం వరకు కొనసాగింది. వెంకటగిరి క్రాస్ రోడ్స్ వద్ద నియోజకవర్గంలోకి ప్రవేశించిన జగన్ సాయంత్రం సైదాపురం శివారు చేరడంతో 1000 కి.మీ మైలురాయి దాటారు. అక్కడి కైవల్య నది వద్ద నిర్మించిన 25 అడుగుల 'విజయ సంకల్ప స్థూపం'ను జననేత ఆవిష్కరించారు. ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త బి.రాఘవేంద్రరెడ్డి రూ.10 లక్షల వ్యయంతో ఆ స్థూపం నిర్మించారు. స్థూప ఆవిష్కరణ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి సంఘీభావం ప్రకటించారు. పెద్ద సంఖ్యలో రైతులు వచ్చి ఆయనను కలిశారు. తొలుత గోగినేనిపురం చేరుకున్న జగన్ కు స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. జగన్‌ను చూసేందుకు రహదారికి ఇరువైపులా జనం బారులు తీరారు. మరోవైపు పెద్ద సంఖ్యలో మహిళలు తరలి వచ్చి మంగళహారతులతో స్వాగతించారు. పాదయాత్రలో 1000 కి.మీ ప్రస్థానానికి గుర్తుగా ప్లకార్డులు పట్టుకున్న పలువురు యువకులు జగన్ వెంట నడిచారు. 1000 కి.మీ పాదయాత్రకు గుర్తుగా, స్థూపం వద్ద 1000 కొబ్బరికాయలు కొట్టారు. దీంతో 'జై జగన్', 'జోహార్ వైయస్సార్' అన్న నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. ప్రజా సంకల్ప యాత్ర 1000 కి.మీ పూర్తి చేసుకున్న సందర్భంగా అన్ని చోట్లా 'వాక్ విత్ జగనన్న' నిర్వహించారు.



ఎంపీ గల్లా జయదేవ్‌కు అరుదైన గౌరవం

విశాలాంధ్ర బ్యూరో- న్యూఢిల్లీ : గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్‌కు ప్రపంచ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. టీడీపీకి చెందిన జయదేవ్ ప్రముఖ పారిశ్రామిక వేత్త కూడా. సీఎం చంద్రబాబుతోపాటు ఏపీ ప్రభుత్వ బృందం పెట్టుబడుల కోసం దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సుకు వెళ్లిన విషయం విదితమే. అమరరాజా గ్రూపుతో ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారంలో అనుభవం గడించిన జయదేవ్‌ను ఎలక్ట్రిసిటీ ఇండస్ట్రీస్ గవర్నర్‌గా, గ్లోబల్ బ్యాటరీ అలయన్స్ ప్రిన్సిపల్‌గా ఆర్థిక సదస్సు నియమించింది. భవిష్యత్తు ప్రపంచ ఆర్థిక సదస్సులలో జయదేవ్ ఈ హోదాల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. దావోస్ సదస్సులో జయదేవ్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వస్తువులు వాడకం ఎక్కువైందని, వాటి నుంచి ఈ-వేస్ట్ ఎక్కువగా వస్తుందని తెలిపారు. ప్రస్తుతం 15 శాతమే ఈ రీసైక్లింగ్ జరుగుతుందని, పూర్తిస్థాయిలో రీసైక్లింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా గల్లా జయదేవ్‌కు అత్యున్నత గౌరవం దక్కడంపై ఆయన అభిమానులు, సన్నిహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అన్యమతం పేరుతో
టీటీడీ ఉద్యోగులపై వేధింపులా?

విశాలాంధ్ర బ్యూరో - తిరుపతి : అన్యమతం పేరుతో టీటీడీ ఉద్యోగులను వేధించడం, 14 మందికి నోటీసులు ఇవ్వడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. లౌకిక రాజ్యంలో మతాల పేరుతో ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. బీజేపీ నేతకు దేవాదాయశాఖ మంత్రి పదవి అప్పగించడంతో ప్రతిచోటా మతాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు. జనవరి 1న దేవాలయాలకు జీఓలు జారీ చేయడం వెనుక దేవాదాయమంత్రి ఒత్తిడి ఉందన్నారు. సోమవారం స్థానిక గంధమనేని శివయ్య భవన్‌లో విలేకరుల సమావేశంలో కె.రామకృష్ణ మాట్లాడారు. సొంత జిల్లాలో సొంత నిర్ణయాలు తీసుకునే పరిస్థితి చంద్రబాబుకు లేదని అన్నారు. ప్రతిష్ఠాత్మకమైన తిరుమల తిరుపతి దేవస్థానంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని చొప్పించాలని ప్రయత్నిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నారో? ఎవరు ప్రతిపక్షంలో ఉన్నారో? చెప్పలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. చంద్రబాబుకు ధైర్యం ఉంటే బీజేపీతో తెగతెంపులు చేసుకోవాలని రామకృష్ణ సూచించారు. రాష్ట్ర విభజన బిల్లులో పొందుపర్చిన అంశాలన్నీ అమలుచేయాలని డిమాండు చేశారు. విశాఖ రైల్వేజోన్ లోటు బడ్జెట్ 16 వేల కోట్లు ఇప్పటి వరకు ఇవ్వకపోగా, అన్నీ చేశామని బీజేపి నాయకులు చెప్పుకోవడం, సుప్రీంకోర్టుకు వెళతామని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు చేతగానితనంతోనే రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందన్నారు. దేశంలో, రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించేందుకు ఏప్రిల్ 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కడపలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని, మహాసభల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పవన్‌కల్యాణ్ రాజకీయ యాత్రపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ పాజిటివ్ పాలిటిక్స్ చేస్తానని ముందుకొస్తున్నాడు కాబట్టి స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రానికి బీజేపీ చేసిన అన్యాయంపై ప్రశ్నించడం హర్షించదగ్గ విషయమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ టీటీడీ అధికారుల ఉన్మాదం తలకెక్కిందని, ప్రపంచ వింతల్లో ఒకటైన తాజ్‌మహల్ ఫొటోను కేలండర్‌లో ప్రచురించారని, వాటిని కొండపైకి తీసుకెళ్లేందుకు వీల్లేదని అడ్డుకోవడమే దీనికి ఉదాహరణ అన్నారు. టీటీడీ బోర్డు కాలపరిమితి ముగిసి నెలలు గడుస్తున్నా దానిని ఏర్పాటు చేసుకునే స్థితిలో చంద్రబాబు లేరన్నారు. బోర్డులో ఐదుగురు బీజేపీ నేతలకు అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ ఒత్తిడి తేవడంతోపాటు ఛైర్మన్ అభ్యర్థిగా అనధికారికంగా ప్రకటించినప్పటికీ క్రైస్తవ సభల్లో పాల్గొన్నారన్న అభియోగాలతో నిలిపివేశారన్నారు. తుడా మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తున్నాం.. అభివృద్ధి చేస్తున్నాం... అంటూ పదేళ్లుగా కాలయాపన చేస్తున్నారే తప్ప ఆచరణలో ఎక్కడా చేసిందేమీ లేదన్నారు.

ఫ్లైఓవర్‌లు, బ్రిడ్జిల నిర్మాణాలను తక్షణం చేపట్టాలని డిమాండు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ చిత్తూరు జిల్లాలో ఓ ఫ్యాక్టరీని మూతవేయడం ఆనవాయితీగా మారిందని మండిపడ్డారు. ఫిబ్రవరి 21వ తేదీ నుంచి చిత్తూరులో జరిగే పార్టీ జిల్లా మహాసభల్లో జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చించి తీర్మానాలు చేసి ప్రభుత్వాలపై పోరాటాలు సాగిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలపై ఎంపీల ఇంటి ముందు నిరసన : కె.రామకృష్ణ



2న మంత్రివర్గ సమావేశం

విశాలాంధ్ర-అమరావతి: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఫిబ్రవరి 2న జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన సచివాలయంలోని 1వ బ్లాకులో ఉన్న సమావేశ మందిరంలో సాయంత్రం 3 గంటలకు మంత్రివర్గ సమావేశం జరుగుతుందని అధికారులు తెలిపారు.

భారత్‌పర్వ్‌లో తెలుగు కళాకారుల నృత్య హేల

విశాలాంధ్ర బ్యూరో- న్యూఢిల్లీ: భాషా, సాంస్కృతిక వికాసంలో తెలంగాణ జాతి ఖ్యాతిని ప్రపంచానికి చూపించాలనే సంకల్పానికి ఈ సాంస్కృతిక ఉత్సవాలు ఎంతగానో దోహదం చేస్తాయని, దేశ సంస్కృతి, సంప్రదాయాల్లో తెలంగాణ రాష్ట్రానిది ప్రత్యేక ఆకర్షణ అని తెలంగాణ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి అన్నారు. సోమవారం ఢిల్లీలోని ఎర్రకోట ముందు ఏర్పాటు చేసిన భారత్ పర్వ్ లో తెలంగాణ సంస్కృతి, కళా రూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దేశ వ్యాప్తంగా విభిన్న కళలు, సంస్కృతులు, సంప్రదాయాలను ఒక్క చోటుకి చేర్చే లక్ష్యంతో కేంద్ర పర్యాటక శాఖ భారత్ పర్వ్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జనవరి 26 నుంచి జనవరి 31 వరకు భారత్‌పర్వ్-2018 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు.



ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్

విశాలాంధ్ర-అనంతపురం టౌన్ : ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. సోమవారం అనంతపురం ఆర్డీవో కార్యాలయం ఎదుట రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్‌తో పాటు పలువురు ప్రముఖులు సంఘీభావం ప్రకటించారు. ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, వెన్నపూసగోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ప్రతి నెల శాఖల వారిగా సమస్యలను పరిష్కరిస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. 2018 జూలై నాటికి 11వ పీఆర్‌సీ అమలుల్లోకి రావాల్సి ఉందని, అయితే 10వ పీఆర్‌సీ అరియర్స్ ఊసే లేదన్నారు. డీఏ బకాయిలు సాధారణ సమస్యగా మార్చివేశారన్నారు. 2008 డీఎస్సీ హామీ పత్రాల ద్వారా నియమింపబడిన ఉపాధ్యాయుల పే ఫిక్సేషన్ తేదా, రూ.398తో పని చేసిన స్పెషల్ టీచర్ల నోషనల్ ఇంక్రిమెంట్ల సమస్య ఆర్థిక శాఖ వివరాలు కోరడం, విద్యాశాఖకు పంపడంతోనే ఏళ్లు గడిచాయన్నారు. ఉన్నత పాఠశాలలో 3వ వంతు పండిత, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ కాకుండా మిగిలిపోయాయన్నారు. సీనియార్టీతో సంబంధం లేకుండా పైరవీలతో విద్యాశాఖలో ఉన్నతస్థాయి పోస్టులు భర్తీ చేస్తున్నారని మండిపడ్డారు. పాఠాలు చెప్పడానికి వీలులేనన్ని బోధనేతర పనులతో ఉపాధ్యాయులను సతమతం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 10వ తరగతి పరీక్షలు వస్తే వందశాతం ఉత్తీర్ణత రావాలని ఒత్తిడి తెస్తారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి డి.జగదీష్ మాట్లాడుతూ డ్యాష్ బోర్డు ద్వారా రాష్ట్రంలో ప్రజలు, ఉద్యో గుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నా వాస్తవంగా అది అమలు కావడం లేదన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించా లని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కె.కులశేఖర్‌రెడ్డి, కో చైర్మన్‌లు ఎస్‌వి.వి రమణయ్య, జె.రామన్న, వియం సుబాన్, ఎ.వెంకటేసులు, డిప్యూటీ కార్యదర్శులు ఎస్.పెద్దన్న, సి.లింగమయ్య, కోశాధికారి సి.ఎర్రి స్వామి, కార్యదర్శులు కె. వెంకటరత్నం, బి.రాజశేఖర్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సి.జాఫర్, కార్యదర్శివర్గ సభ్యుడు సి.వేమయ్య యాదవ్, ఎస్టీయూ నాయకులు బి.గోవిందు, సూర్యనారాయణగౌడ్, రమణారెడ్డి, చంద్రశేఖర్‌తో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొండా భూ వివాదంపై
చంద్రబాబు సీరియస్

- భూ వివాదాలపై నిఘా నివేదిక
- సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశం
- ఉమా అనుచరుల నుంచి బెదిరింపులు బాధితుడు సురేష్



విశాలాంధ్రబ్యూరో-అమరావతి:స్వాతంత్ర్య సమర యోధుని కుటుంబానికి చెందిన భూమికి తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమించుకున్న ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ భూ వివాదంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు భార్య సుజాతపైనా సీఐడీ పోలీసులు కేసు నమోదు చేయటంతో ఈ వ్యవహారం కలకలం సృష్టించింది. సుజాత నిర్వహిస్తున్న డెవలప్‌మెంట్ సంస్థ విజయవాడ శివారు అజిత్‌సింగ్‌నగర్‌లో 5.16 ఎకరాల స్థలాన్ని బొండా ఉమా అండ్ కో ఆక్రమించి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించింది. స్వాతంత్ర్య సమరయోధుని వారసులు ఆ స్థలం వద్దకు వెళితే ఉమా అనుయాయులు దాడికి పాల్పడటంతో బాధితులు సీఐడీని ఆశ్రయించారు. దీనిపై బొండా ఉమా భార్య సుజాత సహా ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. భూ యజమానిగా చూపించి రామిరెడ్డి కోటేశ్వరరావు కూడా బొండా ఉమా, అనుచరుల నుంచి ప్రాణహాని ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. దీంతో చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ వ్యవహారంపై ఆయన పోలీసు, సీఐడీ ఉన్నతాధికారులతో సోమవారం ప్రత్యేకంగా చర్చించారు. తక్షణమే భూ వివాదంపై ఆయన విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. ఈ విషయంలో సమగ్ర నివేదికను అందజేయాలని పోలీసు ఉన్నతాధికారులకు సీఎం సూచించారని సమాచారం. మరో వైపు బొండా ఉమా భూ వివాదంతోపాటు గతంలో ఆయనపై వచ్చిన భూ కబ్జాలకు సంబంధించి ప్రత్యేకంగా ఒక నివేదికను సీఎంకు ఇంటెలిజెన్స్ అధికారులు అందజేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. బొండా ఉమా, ఆయన సోదరుడు, కుటుంబ సభ్యుల సెటిల్‌మెంట్‌లు, కుమారుల బైక్ రేసులు, ఏడాది క్రితం మాదంశెట్టి శివశ్రీ ఫ్లాట్ ఆక్రమణతోపాటు రవాణాశాఖ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యంను పరుషపద జాలంతో దూషించిన వైనంపై నిఘా అధికారులు సీఎంకు నివేదించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో విజయవాడ నగరంలో బొండా ఉమా భూ కబ్జాలు, దౌర్జన్యాలపై రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చే జరుగుతోంది.

తహసిల్దార్, సబ్ రిజిస్ట్రార్ పాత్ర...

బొండా ఉమా అండ్ కో సృష్టించిన దొంగ పత్రాల వ్యవహారంలో ఒక తహసిల్దార్‌తోపాటు సబ్ రిజిస్ట్రార్ పాత్ర ఉన్నట్లు బాధితుడు కె సురేష్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన తాత ఆస్తి పంపకం జరగకుండానే జరిగినట్లుగా నకిలీ పత్రాలు సృష్టించారని, దానిని రామిరెడ్డి వెంకటేశ్వరరావు నుంచి కొనుగోలు చేసి, అభివృద్ధికి ఇచ్చినట్లుగా డాక్యుమెంట్‌లు సృష్టించారని పేర్కొన్నారు. భూ కబ్జాపై నిలదీస్తే మాగంటి బాబు చంపుతామంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడైన తన తాత కేసిరెడ్డి సూర్యనారాయణకు 1952లో ప్రభుత్వం 10.16 ఎకరాల భూమిని అజిత్‌సింగ్‌నగర్‌లో కేటాయించిందన్నారు. ఆ స్థలాన్ని బొండా ఉమా అనుచరులు ఆక్రమించుకున్నారని బాధితులు సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఆరు నెలల క్రితం ఫిర్యాదు చేశారు. అయితే స్థానికంగా ఎమ్మెల్యే ప్రభావంతో పోలీసులు ఆ కేసును సీరియస్‌గా తీసుకోలేదు. దీంతో బాధితులు సీఐడీని ఆశ్రయించటంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సూర్యనారాయణకు వెంకటేశ్వరరావు, రామకృష్ణ కుమారులుండగా, వారిలో వెంకటేశ్వరరావుకు వివాహం కాలేదు. కుటుంబ ఖర్చుల నిమిత్తం ఐదు ఎకరాలు విక్రయించగా, 5.16 ఎకరాల స్థలం మిగిలింది. అయితే అది ఖాళీగా ఉండటంతో బొండా ఉమా అండ్ కో కన్నేసింది. 5.16 ఎకరాల భూమి విలువ సుమారు రూ.50 కోట్లపైనే ఉంటుందని అంచనా. భూ యజమానిగా పత్రాల్లో ఉన్న రామిరెడ్డి వెంకటేశ్వరరావును సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేయటంతో అసలు విషయం బట్టబయలైంది. తనను బెదిరించి విజయవాడ గాంధీనగర్, విజయవాడ శివారు నున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సంతకాలు పెట్టించుకున్నారని వెంకటేశ్వరరావు సీఐడీకి వివరించారు. బొండా ఉమా అనుచరుడు, కార్పొరేటర్ మహేష్‌తోపాటు మాగంటి బాబు తదితరుల నుంచి బెదిరింపులు వస్తుండటంతో ఆయన విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్‌ను కలిసి బొండా ఉమా అనుచరుల నుంచి ప్రాణహాని ఉన్నట్లు ఫిర్యాదు చేశారు.

నాకు తెలియదు : కోటేశ్వరరావు

కేసిరెడ్డి సూర్యనారాయణకు చెందిన స్థలం తాను కొనుగోలు చేయలేదని సీఐడీ నమోదు చేసిన కేసులో ఏ-2గా ఉన్న రామిరెడ్డి కోటేశ్వరరావు చెప్పారు. విజయవాడలోని సీపీఐ కార్యాలయం దాసరి భవన్‌లో పార్టీ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్‌తో కలిసి ఆయన విలేకరుతో మాట్లాడారు. లారీ డ్రైవర్‌గా పనిచేసే తనకు విజయవాడలో 5.16 ఎకరాల భూమి కొనుగోలు చేసే శక్తి లేదన్నారు. సీఐడీ అధికారులు వచ్చే వరకు తన పేరున 5.16 ఎకరాల భూమి ఉన్న విషయం తెలియదని చెప్పారు. తమ ఇల్లు తనఖా పెట్టుకుని అప్పు కోసం కార్పొరేటర్ గండూరి మహేష్ వద్దకు వెళ్లగా, తప్పుడు పత్రాలపై సంతకాలు చేయించుకున్నారని తెలిపారు. అంతకుమించి తనకు ఏమీ తెలియదన్నారు. సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారని, ఆ భూమి తాను కొనుగోలు చేసి, తిరిగి డెవలప్‌మెంట్‌కు ఇచ్చినట్లు చెప్పాలని, లేకపోతే ఎమ్మెల్యే బొండా ఉమాకు చెప్పి హత్య చేయిస్తామని బెదిరిస్తున్నారని కోటేశ్వరరావు తెలిపారు. తనకు ప్రాణహాని ఉందని కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేశానని, అయినా స్పందించలేదన్నారు. నిరంతరం మహేష్, ఫణికు రమేష్ తనను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో నగర పోలీసు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశానని, తన ఇంటి వద్ద ఒక కానిస్టేబుల్‌ను రక్షణగా పెట్టారని చెప్పారు.

బొండా ఉమాను ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలి : దోనేపూడి

కేసిరెడ్డి సూర్యనారాయణకు చెందిన సుమారు రూ.50 కోట్ల విలువైన భూమిని తప్పుడు పత్రాలతో స్వాహా చేసిన భూ కబ్జాల సూత్రధారి బొండా ఉమామహేశ్వరరావును తక్షణం ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండు చేశారు. ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించిన మహేష్‌ను కేసులో ముద్దాయిగా చేర్చాలని సీఐడీ అధికారులను కోరారు. బొండా ఉమా ఇప్పటికే నగరంలో పలు భూ కబ్జాలకు సూత్రధారిగా ఉన్నారని, ఇప్పటికైనా చంద్రబాబు జోక్యం చేసుకుని ఆయనపై చర్యలు తీసుకోవాలని శంకర్ డిమాండు చేశారు.

మరో టౌన్ కంట్రీత్రీ

(మొదటిపేజీ తరువాయి)

ఏసీబీ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. సుమారు రూ.50 కోట్లకుపైగానే అక్రమాస్తులున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. మూడున్నర దశాబ్దాలుగా పట్టణాభివృద్ధి శాఖలో పని చేస్తూ పెద్ద మొత్తంలో అక్రమ ఆస్తులను కూడబెట్టినట్లు ఏసీబీకి సమాచారం అందింది. పట్టణాభివృద్ధి సంస్థలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన ప్రదీప్ కుమార్ అంచలంచెలుగా పదోన్నతులు పొంది అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్ స్థాయికి ఎదిగారు. 28 రోజుల క్రితం వుడా అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్‌గా డిప్యుటేషన్‌పై బాధ్యతలు స్వీకరించిన ప్రదీప్ కుమార్‌పై గతంలో అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. పక్కా సమాచారంతో ఏసీబీ డీజీపీ ఆర్‌పీ ఠాకూర్ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఏకకాలంలో 12 బృందాలతో ప్రదీప్‌కుమార్ ఇళ్లల్లోనూ, కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలోనూ తనిఖీలు చేయించారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ మొత్తంలో అక్రమాస్తులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. విశాఖ నగరంలోని దస్పల్లా హిల్స్‌లోని నటరాజ్ టవర్స్‌లో విశాఖ రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఎస్‌వీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. తన కుమా రుడు హెచ్‌ఎస్ కుమార్ పేరుతో హెచ్‌ఎస్ కనస్ట్రక్షన్స్‌ను కూడా ప్రదీప్‌కుమార్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. రాష్ట్రం లోని విశాఖతోపాటు విజయవాడ, హైదరాబాద్, ఒంగోలు, అనంతపురం, కర్నూలులో ఏసీబీ అధికారులు ప్రదీప్ కుమార్ తండ్రి ఇంటిలోనూ, సోదరులు, బావమరుదులు, మామ, ఇతర బంధువుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దస్తావేజుల కట్టలు, నగదు, బంగారు, వెండి ఆభరణాలతోపాటు బ్యాంకు పాసు పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రదీప్‌కుమార్‌కు మూడు బ్యాంక్ లాకర్లు ఉన్నాయని, వాటిని ఓపెన్ చేస్తే మరిన్ని అక్రమాస్తులు వెలుగులోకి వస్తాయని ఆర్‌పీ ఠాకూర్ తెలిపారు. ఇప్పటికే ఆయనకు సంబంధించిన అన్ని బ్యాంకు లావాదేవీలను స్తంభింప చేశామన్నారు. సోదాల్లో భాగంగా ఐదు ఖాళీ ఇళ్ల స్థలాలు, నాలుగు ఫ్లాట్‌లతోపాటు 9.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రదీప్ కుమార్‌ను అరెస్టు చేసి విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఇదిలావుండగా ప్రదీప్ కుమార్ భార్య లత పేరుతో పెద్ద మొత్తంలో ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించగా, ఆమె ప్రస్తుతం సింగపూర్ పర్యటనలో ఉన్నారు.

పదోన్నతి పొందిన కొద్ది రోజులకే..

టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్‌లో పని చేస్తున్న ప్రదీప్‌కుమార్ కొత్త సంవత్సరంలో కొద్ది రోజుల క్రితమే జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం వుడాలో అడిషనల్ చీఫ్ అర్బన్ ప్లానర్‌గా డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం చక్రాలకు చెందిన ప్రదీప్‌కుమార్ 1984 మే ఐదో తేదీన బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. తొలుత అనంతపురం జిల్లా గుంతకల్ మున్సిపాల్టీలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి 1991లో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా, 1999లో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా, 2010 అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా, 2013లో డిప్యూటీ సిటీ ప్లానర్‌గా (డిప్యూటీ డైరెక్టర్), 2018లో జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. 2015 నుంచి 2016 వరక విజయవాడ కార్పొరేషన్‌లో ఇన్‌చార్జి సిటీ ప్లానర్‌గా కూడా పని చేశారు. అంతకుముందు కూడా పలు హోదాల్లో విజయవాడలో పని చేసిన ఆయన 2016లో దేవీనగర్‌లో 166 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇదిలావుండగా గత సంవత్సరం ఆగస్టులో విజయవాడలోని నాక్ కల్యాణ మండపంలో ప్రదీప్‌కుమార్ తన కుమారుడి వివాహం చేశారు. దీంతో విజయవాడ ఏసీబీ అధికారులు నాక్ మండపం నిర్వాహకుల నుంచి కూడా కొన్ని వివరాలు సేకరించారు. కల్యాణ మండపానికి సమీపంలోనే ఒక ఫ్లాట్‌ను కొనుగోలు చేసినట్లు సమాచారం ఉన్నప్పటికీ, అందుకు సంబంధించిన ఆధారాలు లభించలేదు.

ఏసీబీ గుర్తించి చరాస్తులు

ఏసీబీ సోదాల్లో పెద్ద మొత్తంలో చరాస్తులను గుర్తించారు. విశాఖలోని నటరాజ్ టవర్స్‌లోని ప్రదీప్‌కుమార్ ఇంట్లో రూ.4 లక్షల నగదును అధికారులు సీజ్ చేశారు. బ్యాంకులో రూ.3 లక్షల నగదు, భార్య లత పేరుతో రూ.18 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు, బీమా రశీదులు రూ.10 లక్షలు, రూ.21 లక్షల విలువైన గృహోపకరణాలను గుర్తించారు. అలాగే రూ.70 లక్షల విలువైన 2.7 కేజీల బంగారం, రూ.4 లక్షల విలువైన 12.5 కేజీల వెండి, కుమారుడు హెచ్‌ఎస్ కుమార్ పేరుతో నడుస్తున్న హెచ్ కన్‌స్ట్రక్షన్స్‌లో రూ.10 లక్షల పెట్టుబడికి సంబంధించిన పత్రాలు, ఒక బ్రీజ్ కారు, రెండు ద్విచక్ర వాహనాలను ఏసీబీ అధికారులు గుర్తించారు.

అక్రమాస్తులు ఇవే

- విశాఖ నగరంలోని మధురవాడలో 500 చదరపు గజాల స్థలాన్ని 2005లో కొనుగోలు చేశారు. ప్రస్తుతం దీని మార్కెట్ విలువ రూ.2.40 లక్షలు
- విశాఖపట్నంలోని కిర్లంపూడిలోని శ్రీపాద నిలయంలో 2012లో రూ.40 లక్షలతో ఫ్లాట్ కొనుగోలు
- అనంతపురంలోని శివాజీ నగర్‌లో 2010లో రూ.19 లక్షలతో ఇల్లు కొనుగోలు

భార్య లత పేరిట ఆస్తులు

- విశాఖ నగరంలోని మధురవాడలో 2006లో రూ.3.11 లక్షల విలువైన 311 చదరపు గజాల స్థలం, మరో రూ.7.78 లక్షలతో 2007లో 311 చదరపు గజాల ఖాళీ స్థలం కొనుగోలు
- విజయవాడ నగరంలోని దేవీనగర్‌లో 2016లో రూ.56.74 లక్షలతో 166 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేసి ట్రెండ్‌సెట్ బిల్డర్స్‌తో అగ్రిమెంట్
- భార్య లత పేరుతోనే 2005లో కడప జిల్లా మైదుకూరు గ్రామంలో 4.08 ఎకరాల వ్యవసాయ భూమిని రూ.1.37 లక్షలతో కొనుగోలు
- అనంతపురం జిల్లా మారుతీనగర్‌లో 4.5 ఎకరాల భూమిని రూ.2.85 లక్షలతో 2005లో కొనుగోలు
- కృష్ణాజిల్లాజి.కొండూరు మండలం వెలగలేరులో రూ. 1.60 లక్షలతో 1.07 ఎకరాల వ్యవసాయ భూమిని 2007లో కొనుగోలు

తండ్రి పి.వెంకటరాజు పేరుతో (లేటు)

- తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని నరసింహారావుపేటలో 253 చదరపు గజాల ఖాళీ ఇంటి స్థలం
- బావమరిది బి.కృష్ణమోహన్ పేరుతో 2006లో రూ.8.98 లక్షలతో విశాఖ నగరం మధురవాడలో 599 చదరపు గజాల స్థలం
- తన తండ్రి కుటుంబానికి చెందిన పసుపర్తి నారాయణ రాజు పేరుతో విశాఖలోని మధురవాడలో 200 చదరపు గజాల స్థలాన్ని రూ.60 లక్షలతో ఈ ఏడాది కొనుగోలు.

జల సంరక్షణ ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. రుతుపవనాలు రాక ముందు కనీసం 8 మీటర్లు, ఆ తర్వాత 3 మీటర్ల మట్టానికి భూగర్భ జలాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూగర్భాన్ని జలాశయంగా మలచాలనేది తన ఆశయమని తెలిపారు. ఎంత సాగునీరు అవసరం అనేది వ్యవసాయ శాఖ సహకారంతో అధ్యయనం చేసి అందుకు తగ్గట్టు జలవనరుల శాఖ ప్రణాళికాబద్ధంగా పని చేయాలని స్పష్టం చేశారు.ఈ ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని తలపెట్టిన 28 ప్రాధాన్య ప్రాజెక్టులలో ఇప్పటికే ఏడింటిని ప్రారంభించగా మరో 6 ప్రాజెక్టులు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. పోగొండ రిజర్వాయర్, పెదపాలెం ఎత్తిపోతల పథకం, గోరకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, జీఎన్‌ఎస్‌ఎస్ మొదటి దశలో భాగమైన అవుకు టన్నెల్, పులి కనుమ ఎత్తిపోతల పథకం, చినసాన ఎత్తిపోతల పథకం పూర్తయ్యాయి. మిగిలిన 15 ప్రాజెక్టు పనులు ఎంతవరకు పురోగతి సాధించాయో అధికారులను అడిగి ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ రెండో దశలో భాగమైన కుప్పం బ్రాంచ్ కెనాల్ నిర్మాణం పూర్తిచేసి మార్చి 15 కల్లా కుప్పానికి నీరు తరలించాలని సూచించారు. చిత్తూరుకు నీరందించేలా ఏప్రిల్ 15 కల్లా అడవిపల్లి రిజర్వాయర్ సిద్ధం చేయాలని చెప్పారు. మార్చి నాటికి కొండవీటి వాగుకు 5 పంపులు బిగిస్తామని అధికారులు సీఎంకి తెలిపారు. రాజధాని భవిష్యత్ తాగునీటి అవసరాల దృష్ట్యా కృష్ణా నదిపై వైకుంఠపురం దగ్గర బ్యారేజ్ నిర్మించాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి ఇందుకు సంబంధించి వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) ఫిబ్రవరి 5 కల్లా అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రకాశం బ్యారేజ్‌కు 23 కి.మీ. ఎగువున, పులిచింతల ప్రాజెక్టుకు 60 కి.మీ. దిగువున వైకుంఠాపురం బ్యారేజ్ నిర్మాణం కానుంది. మొత్తం బ్యారేజ్ పొడవు 3.068 కి.మీ ఉంటుందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పనులను ప్రత్యక్ష ప్రసారం ద్వారా పరిశీలించిన ముఖ్యమంత్రి, పనులు జరుగుతున్న తీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ముఖ్యమంత్రి కార్యదర్శి గిరిజా శంకర్, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, ట్రాన్స్‌ట్రాయ్, త్రివేణి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐసీసీ అండర్-19
దాయాదితో సెమీస్

- గెలుపు అంత వీజీ కాదు
- విజయం కోసం ఉవ్విళ్లూరుతున్న కుర్రాళ్లు
- అతి విశ్వాసానికి పోతే.. అంతే...!



క్రైస్ట్‌చర్చ్ (న్యూజిలాండ్):
ఇండియన్ ప్రీమియర్ లీగ్ వేలంలో రాత్రికి రాత్రే కోటీశ్వరులయ్యారు భారత అండర్-19 క్రికెట్ జట్టు సభ్యులు. వారు పట్టరాని ఆనందంలో ఉన్నారిప్పుడు! ఇదే ఉత్సాహంలో న్యూజిలాండ్‌లో జరుగుతున్న అండర్-19 వన్డే ప్రపంచకప్ సెమీస్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తుచేసి తుదిపోరుకు అర్హత సాధించాలని అందరూ కోరుకుంటున్నారు. బెంగళూరులో రెండు రోజుల పాటు జరిగిన ఐపీఎల్ వేలంలో భారత యువ క్రికెటర్లు మంచి ధరే పలికారు. సరాసరి 150 కిలోమీటర్ల వేగంతో బంతులు విసిరే ఎడమచేతి వాటం పేసర్ నాగర్‌కోటిని రూ.3.2 కోట్లు, మరో బౌలర్ శివమ్ మావిని రూ.3 కోట్లు పెట్టి కోల్‌కతా నైట్‌రైడర్స్ కొనుగోలు చేసింది. ఇక బ్యాటింగ్ సంచలనం, అండర్-19 సారథి పృథ్వీషాను ఢిల్లీ డేర్‌డెవిల్స్ రూ.1.2 కోట్లు, శుభ్‌మన్‌గిల్‌ను కోల్‌కతా రూ.1.8 కోట్లు పెట్టి సొంతం చేసుకున్నాయి.ఎడమచేతి వాటం స్పిన్నర్ అంకుల్‌రాయ్‌ను రూ.20 లక్షలు పెట్టి ఢిల్లీ, అభిషేక్ శర్మను రూ.55 లక్షలు పెట్టి ముంబై కొనుగోలు చేశాయి. మన్‌జ్యోత్‌ను రూ.20 లక్షలకు ఢిల్లీనే కొన్నది.

నల్లేరుపై నడక కాదు!
మంగళవారం పాకిస్థాన్‌తో జరిగే సెమీస్‌లో విజయం సాధించాలని కుర్రాళ్లు ఉవ్విళ్లూరుతు న్నారు. భారత్ మూడుసార్లు ప్రపంచకప్ గెలవగా పాక్ రెండుసార్లు కైవసం చేసుకుంది. దాయాది దేశాలు కావ డంతో పోరుపై అమితాసక్తి ఏర్పడింది. వరుస విజయాలతో సెమీస్ చేరిన పృథ్వీషా సేనకు పాక్‌ను ఓడించడం పెద్ద కష్టమేమీ కాదు గానీ అతి విశ్వాసానికి పోతే మాత్రం పరాభవం తప్పదు! ప్రారంభ మ్యాచ్‌లో అఫ్గాన్ చేతిలో ఓడి పాక్ ఆ తర్వాత వరుస విజయాలతో సెమీస్ చేరింది. అయితే అవన్నీ కొద్దిపాటి తేడాతోనే. ఆ జట్టులో బౌలర్ షాహీన్ అఫ్రిది, మిడిలార్డర్‌లో అలీ జర్యబ్ బాగా ఆడు తున్నారు. నాలుగు మ్యాచుల్లోనే 11 వికెట్లు తీసిన అఫ్రిదితో భారత బ్యాట్స్‌మెన్ జాగ్రత్తగా ఉండాలి. అతడు ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్లు తీశాడు. సెమీస్ జరిగే హెగ్లే ఓవల్ మైదానంలో పరిస్థితులు పాక్‌కు బాగా తెలుసు. క్వార్టర్స్‌లో ఆ జట్టు ఆడింది ఇక్కడే. ఈ సందర్భంగా పాక్‌తో జరిగే మ్యాచ్‌లో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకోవాలని కోరుకుంటున్నట్టు శుభ్‌మన్ గిల్ అన్నాడు.

జట్లు:
భారత్ : పృథ్వీషా (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, ఆర్యన్ జుయల్, అభిషేక్ శర్మ, అర్షదీప్ సింగ్, హార్విక్ దేశాయ్, మన్‌జ్యోత్ కార్లా, కమలేశ్ నాగర్‌కోటి, పంకజ్ యాదవ్, రియాన్ పరాగ్, ఇషాన్ పోరెల్, హిమాన్షు రాణా, అంకుల్ రాయ్, శివమ్ మావి, శివ సింగ్

పాక్ :
హసన్ ఖాన్ (కెప్టెన్), రొహైల్ నజీర్, మహ్మద్ అలీ ఖాన్, అలీ జర్యబ్, అమ్మద్ ఆలమ్, అర్షద్ ఇక్బాల్, ఇమ్రాన్ షా, మహ్మద్ తహా, మోషిన్ ఖాన్, మహ్మద్ ముసా, మహ్మద్ జైద్, మునీర్ రియాజ్, షాహీన్ అఫ్రిది, సులేమాన్



టెస్టు చరిత్రలో ఇదే తొలిసారి..!

జొహానెస్‌బర్గ్:
రెండు రోజుల క్రితం భారత్-దక్షిణాఫ్రికా జట్ల మూడు టెస్టుల సిరీస్ ముగిసిన సంగతి తెలిసిందే. చివరిటెస్టులో టీమిండియా 63 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ కాకుండా తప్పించుకుంది. అయితే ఇరు జట్ల మధ్య జరిగిన ద్వైపాక్షిక మూడు టెస్టుల సిరీస్‌లో అరుదైన రికార్డు నమోదైంది. ఈ సిరీస్‌లో భారత్-దక్షిణాఫ్రికాలు ప్రతీ ఇన్నింగ్స్‌లోనూ ఆలౌట్ కావడంతో టెస్టు క్రికెట్ చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించబడింది. మూడు టెస్టుల సిరీస్‌లో ఇరు జట్లు 12 సార్లు ఆలౌట్ కావడం టెస్టు చరిత్రలో ఇది మొదటిసారి మాత్రమే. మొత్తంగా 120 వికెట్లు కుప్పకూలడంతో సరికొత్త చరిత్రకు నాంది పలికింది. మరొకవైపు విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌లో భారత్ ప్రత్యర్థి వికెట్లన్నీ కుప్పకూల్చడం ఇది రెండోసారి మాత్రమే. గతంలో 1986లో ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లో భారత్ ఆరు ఇన్నింగ్స్‌లోనూ ప్రత్యర్థిని ఆలౌట్ చేసింది. ఇదిలా ఉంచితే, భారత్ తరపున అత్యధిక టెస్టు విజయాలు సాధించిన కెప్టెన్ల జాబితాలో కోహ్లి రెండో స్థానంలో ఉన్నాడు. తొలి స్థానంలో ధోని(27 విజయాలు) కొనసాగుతున్నాడు.



లారాను దాటిన కోహ్లి

దుబాయ్:
భారత కెప్టెన్ విరాట్ కోహ్లి ఆల్‌టైమ్ కెరీర్ అత్యుత్తమ ర్యాంకింగ్స్‌లో వెస్టిండీస్ దిగ్గజం బ్రియాన్ లారాను అధిగమించాడు. తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అతడు రెండో స్థానాన్ని నిలుపుకున్నాడు. ర్యాంకింగ్స్ పాయింట్లను 900 నుంచి 912కు పెంచుకున్న కోహ్లి.. అత్యుత్తమ కెరీర్ ర్యాంకింగ్ పాయింట్లలో బ్రియాన్ లారా (911)ను దాటేశాడు. సునీల్ గవాస్కర్ (916)కు చేరువయ్యాడు. తాజా ర్యాంకింగ్స్‌లో స్టీవ్ స్మిత్ (947) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

తొలి మ్యాచ్‌లోనే హ్యాట్రిక్



ఢాకా:
బంగ్లాదేశ్-జింబాబ్వే-శ్రీలంకల ట్రైసిరీస్‌లో శ్రీలంకకు చెందిన 22ఏళ్ల బౌలర్ అదరగొట్టాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన బౌలర్ శేషన్ మధుశంకా తన తొలి మ్యాచ్‌లోనే హ్యాట్రిక్ సాధించి వన్డే చరిత్రలో మొదటి మ్యాచ్‌లోనే హ్యాట్రిక్ సాధించిన నాలుగో ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లంక 50 ఓవర్లలో 221 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన బంగ్లా జట్టు తొలుత కాస్త తడబడిన మహ్మదుల్లా(76) చెలరేగిపోవడంతో విజయం దిశగా అడుగులు వేసింది. అయితే జట్టుకు అండగా నిలిచిన మహ్మదుల్లాను మధుశంకా తన తొలి వికె ట్‌గా పెవిలియన్ బాటపట్టించాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన మోర్తజా(0), హోస్సైన్(0) వికెట్లు వెనువెంటనే తీసి హ్యాట్రిక్ సాధిం చాడు. బంగ్లాదేశ్ 142 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ కావడంతో శ్రీలంక 79 పరుగుల తేడాతో ఫైనల్‌లో విజయం సాధించింది.



ఇండియన్ ఓపెన్ సూపర్ సిరీస్

సైనా, సింధునే ఫేవరేట్లు

హైదరాబాద్:
ఇండియన్ ఓపెన్ సూపర్ సిరీస్ మంగళవారం నుంచి ప్రారంభం కానున్నది. స్టార్ షట్లర్లు సైనా నెహ్వాల్, పీవీ సింధునే ఈ మ్యాచ్‌లకు ఫేవరేట్లుగా నిలవ నున్నారు. అంతేకాదు వీరికి తోడుగా మరో షట్లర్ కిదాంబి శ్రీకాంత్ కూడా తోడవనున్నాడు. 2015 సైనా నెహ్వాల్ ఇండియన్ ఓపెన్ సూపర్ సిరీస్‌ను దక్కించుకుంది. చీల మండల గాయం నుంచి కోలుకున్న సైనా.. ఇండోనేషియా మాస్టర్స్ చాంపియన్ షిప్‌లో ఫైనల్‌కు చేరుకుంది. రియో ఒలింపిక్స్ తరువాత గాయపడ్డ సైనా పాల్గొనబోయే మెగా టోర్నీ కూడా ఇదే కావడం గమనార్హం. 2017లో ఫిట్‌నెస్ లోపం కారణంగా సెకండ్ రౌండ్‌కు కూడా చేరలేనని అప్పట్లోనే గ్రహించింది. నాలుగోసీడ్‌లో ఉన్న సైనానెహ్వాల్ డెన్మార్క్‌కు చెందిన సోఫియా థల్‌ను తన ప్రారంభ మ్యాచ్‌లో ఎదుర్కోనున్నది. అలాగే క్వార్టర్ ఫైనల్స్‌లో బీవెన్ జాంగ్‌తో తలపడే అవకాశం ఉంది. మరోవైపు సింధు ప్రత్యర్థిగా డెన్మార్క్‌కు చెందిన నటాలియా రోడ్ తలపడనున్నది. శ్రీకాంత్ హాంగ్‌కాంగ్‌కు చెందిన లీ చుక్ ఇయుతో తలపడనున్నాడు. వీరందరితోపాటు హెచ్ఎస్ ప్రణయ్ రాయ్, సింగపూర్ ఓపెన్ చాంపియన్ బి సాయి ప్రణీత్ కూడా ఈ టోర్నీలో భాగం పంచుకోనున్నారు. ఇక డబుల్స్‌లో ఇండోనేషియా మస్టర్స్ సెమీఫైనలిస్ట్ సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ సెట్టిలు హాంగ్‌కాంగ్‌కు చెందిన చాంగ్ తక్ చింగ్, హీ చున్ మక్‌లతో, సుమీత్‌రెడ్డి, మను అత్రిలు మలేసియాకు చెందిన ఆరోసీడ్ ఆంగ్ యూ సింగ్, టియో ఇ వైలతో తలపడనున్నారు.



ఖేలో ఇండియా శకటమే బెస్ట్..!

న్యూఢిల్లీ:
69వ గణతంత్ర వేడుకల సందర్భంగా రాజ్‌పత్‌లో జరిగిన పరేడ్‌లో పాల్గొన్న వివిధ మంత్రిత్వశాఖల శకటాల్లో 'ఖేలో ఇండియా' నేపథ్యంతో రూపొందించిన క్రీడా మంత్రిత్వశాఖ శకటాన్ని ఉత్తమమైనదిగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రక్షణశాఖ మంత్రి నిర్మల సీతారామన్ చేతుల మీదుగా క్రీడాల శాఖ కార్యదర్శి రాహుల్ భట్నాగర్ బహుమతిని అందుకున్నారు. ఖేలో ఇండియా.. జో ఖేలేగా వో ఖిలేగే(ఎవరైతే ఆడుతారో.. వాళ్లు వికసిస్తారు) నేపథ్యంలో ఈ శకటాన్ని రూపొందించారు. మల్‌ఖంబ్, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ ఆటలతో పాటు క్రికెట్, బాక్సింగ్, ఫుట్‌బాల్ కలయికతో ఓ ప్రతిమను రూపొందించి ఈ శకటంపై ప్రదర్శించారు. భారత్‌లో అన్ని క్రీడలకు తగిన ప్రాధాన్యత లభించాలనే ఉద్దేశంతోనే 'ఖేలో ఇండియ' ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ శకటానికి అవార్డు రావడంపై క్రీడా మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ స్పందించారు. "రిపబ్లిక్ డే పరేడ్‌లో ఉత్తమ శకటంగా నిలిచినందుకు అభినందనలు. క్రీడామంత్రిత్వ శాఖకి ఇది ఎంతో గర్వకారణంగా ఉంది. ఈ అవార్డు మమ్మల్ని ఎంతో ప్రోత్సాహిస్తుంది. మాపై ప్రేమ చూపిన అందరికి ధన్యవాదాలు" అని ట్వీట్ చేశారు.

ప్రొటీస్‌లో వర్ణవివక్ష..?

జొహానెస్‌బర్గ్:
భారత్‌తో జరిగిన మూడు టెస్టు మ్యాచుల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది సఫారీ జట్టు. వాండరర్స్ మైదానంలో చివరి టెస్టు అనంతరం సఫారీ జట్టు ట్రోఫీ అందుకుని సంబరాలు చేసుకుంది. ఇదే ఇప్పుడే వారి కొంపముంచింది. ఈ ఫొటోను జగ్రత్తగా గమనిస్తే.. ఇందులో ఒక పక్క డుప్లెసిస్, ఎల్గర్, డివిలియర్స్, మోర్కెల్, మోరిస్, డీకాక్, స్టెయిన్ తదితరులు ఉండగా.. మరోపక్క రబాద, ఎంగిడి, ఫిలాండర్, కేశవ్ మహారాజ్, ఫెలుక్వాయో ఉన్నారు. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆటగాళ్లు కావాలని అలా నిల్చున్నారో.. ఎందుకు అలా నిల్చున్నారో తెలియదు గానీ ఈ ఫొటో ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. దేశం తరపున ఆడుతోన్న ఆటగాళ్ల మధ్య వర్ణ వివక్ష ఉందని ఈ ఫొటో రుజువు చేసిందని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన ఫిలాండర్, ఎంగడి, రబదాలను కలుపుకోలేకపోయారని ట్వీట్ల వర్షం కురిపించారు. దీనిపై ఇప్పుడు అక్కడ పెద్ద చర్చే జరుగుతోంది. 'ఆటగాళ్ల మధ్య ఎలాంటి వివక్ష లేదని, వారంతా ఒకటేనని' ఆ దేశ క్రికెట్ బోర్డు సీఈవో తబాంగ్ మోరోయ్ తెలిపారు. దీనిపై ఆయన తాజాగా మాట్లాడుతూ..'జట్టులో ఆటగాళ్ల మధ్య ఎలాంటి తేడాలు లేవు. అందరూ దేశం తరపునే ఆడారు. ఓ మ్యాచ్‌లో రబాద కీలక వికెట్ తీసినప్పుడు సారథి డూప్లెసిస్ అతడ్ని నుదురుపై ముద్దుపెట్టుకోవడం మనందరం చూశాం. ఇలాంటి సంఘటనలు గురించి ఎందుకు మాట్లాడరు. జట్టు ఎంపిక విషయంలో ఏమాత్రం నియమాలను ఉల్లంఘించడం లేదు. తుది పదకొండులో ఇద్దరు నల్ల ఆఫ్రికన్లు ఉండాలనే నియయాన్ని అనుసరిస్తూనే ఉన్నాం' అని తబాంగ్ స్పష్టం చేశాడు.



ఎవ్వరేమన్నా... పట్టించుకోను : శుక్లా



బెంగళూరు:
విమర్శకులు ఇండియన్ ప్రీమియర్ లీగ్ గురించి ఏమన్నా తమకు బాధలేదని ఐపీఎల్ చైర్మన్ రాజీవ్ శుక్లా అన్నారు. వీక్షకుల సంఖ్య, ఆదాయం క్రమంగా పెరుగుతున్నంత వరకూ పర్వాలేదని పేర్కొన్నారు. ఐపీఎల్ మనీ లాండరింగ్‌కు వేదికగా మారిందని, వేలంలో కోట్లు పెట్టి ఆటగాళ్లను కొంటున్నారని మాజీ క్రికెటర్ బిషన్ సింగ్ బేడీ చేసిన వ్యాఖ్యలపై శుక్లా స్పందించారు. 'వాళ్లు (బేడీ సహా) ఏమనుకుంటున్నారో అనుకోనీయండి. ఏటా ఐపీఎల్‌ను వీక్షిస్తున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. వ్యూయర్‌షిప్, ఆదాయం పెరుగుతూనే ఉంది' అని బెంగళూరులో రెండో రోజు వేలం జరుగుతున్న సందర్భంగా శుక్లా అన్నారు. భారత మాజీ క్రికెటర్లు ఎంతో మంది ఐపీఎల్ ద్వారా ప్రయోజనం పొందారని బేడీ గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. 'మీరు చూసినట్టయితే మాజీ క్రికెటర్లు ఎంతో మంది ఐపీఎల్ నుంచి లబ్ధి పొందారు. ఒకే దఫాలో వారికి ప్రయోజనం దక్కింది. వాటిని వారు స్వీకరించారు. బేడీ దాన్ని గుర్తుంచుకోవాలి' అని శుక్లా అన్నారు. బహిరంగంగా వ్యాఖ్యలు చేసే ముందు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని రాజస్థాన్ రాయల్స్ చైర్మన్, సీఈవో రంజిత్ బర్తకుర్ అన్నారు. 'భారత్‌లో అపరిమితంగా మాట్లాడే స్వేచ్ఛ ఉంది. అయితే మనం మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఆలోచించి మాట్లాడాలి. అందరి దృష్టిని ఆకర్షించాలని కాదు. ఆయన్ను మేం గౌరవిస్తాం. అయితే అలాంటి వ్యాఖ్యలకు ఆయన దూరంగా ఉండాలని కోరుకుంటాం' అని బేడీనుద్దేశించి రంజిత్ పేర్కొన్నారు.

షమీ కుటుంబానికి చేదు అనుభవం




న్యూఢిల్లీ:
భారత జట్టు తరపున ఆడుతున్నా రంటే సదరు క్రీడాకా రుడు లేదా క్రీడాకారిణికి ఎంతో గౌరవం ఉం టుంది. ఎక్కడికి వెళ్లినా వారికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. కానీ, భారత క్రికెటర్ మహమ్మద్ షమి కుటుంబసభ్యులకు తాజాగా ఓ చేదు అనుభవం ఎదురైంది. అవార్డు ఇస్తామని పిలిచి దాన్ని అందజేయలేదు సరికదా కనీసం వారిని గుర్తించిన వారు కూడా లేదు. అసలేం జరిగిందంటే.. కోల్‌కతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో ఆటగాళ్లను అభినందించే కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమ నిర్వాహకులు మహమ్మద్ షమికి 'ఖేల్ సమ్మన్' అవార్డును గతంలో ప్రకటించారు. ఈ అవార్డు అందుకోవడానికి షమి అందుబాటులో లేడు. ప్రస్తుతం అతడు దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్నాడు. దీంతో అతనికి బదులు ఆయన భార్య హసిన్ జహన్‌తో పాటు కుటుంబసభ్యులు వెళ్లారు. కానీ, అక్కడ పట్టించుకున్న వాళ్లు ఒక్కరు కూడా లేదు. అంతేకాదు అసలు ఎందుకు పిలిచారో కూడా మరిచారు. అవార్డు అందించడానికి వారిని వేదికపైకి కూడా పిలవలేదట. దీంతో వారు ఇక చేసేది ఏమీలేక తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తోన్న ఓ క్రీడాకారుడి కుటుంబానికి ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాజాతో ఉత్తరాంధ్ర చర్చా వేదిక నేతల భేటీ

- టీడీపీ ఎంపీలు అవంతి శ్రీనివాస్, కింజరపుతోనూ చర్చలు
- ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, ఉత్తరాంధ్రకు రూ.15వేలకోట్ల ప్యాకేజీ

విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ:
ఆంధ్రప్రదేశ్‌కు విభజన చట్టంలో పేర్కొన్న హామీల అమలుకు సంబంధించి ఉత్తరాంధ్ర చర్చా వేదిక నేతలు సోమవారం న్యూఢిల్లీలో పలు రాజకీయ పార్టీల నేతల్ని కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఏపీకి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, విశాఖపట్నంకు రైల్వే జోన్ వంటి వాటితో పాటు 25 డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు సమర్పిస్తూ తాము చేస్తున్న పోరాటానికి సహకరించాలని కోరారు. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ నేతృత్వంలో ఉత్తరాంధ్రా చర్చ వేదిక నేతలు కణితి విశ్వనాథంలతో పాటు 60 మంది సభ్యుల బృందం సీపీఐ నేత డి రాజాను కలిసి విభజన చట్టంలో పేర్కొన్న హామీల అమలు పై చర్చించారు. అనంతరం టీడీపీ ఎంపీలు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అవంతి శ్రీనివాస్‌లతో పాటు పలువురు ఎంపీలను కలిసి సమస్యలపై వివరించారు. కేంద్రంపై చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ.15వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలని వినతి పత్రంలో డిమాండు చేశారు. విశాఖలో రైల్వే జోన్, హైకోర్టు బెంచ్, గిరిజన విశ్వవిద్యాలయం, విశాఖకు ఎయిమ్స్ హాస్పిటల్ వంటి డిమాండ్ల కేంద్ర ముందు పెట్టనున్నట్లు మాజీమంత్రి కొణతల రామకృష్ణ మీడియాకు చెప్పారు. ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలను, రాజకీయ పార్టీలను కలిసి తాము అభ్యర్ధించామని అన్నీ పార్టీల నేతలు కూడా సానుకూలంగా స్పందించాని వివరించారు. ఉత్తరాంధ్రకు జరుగుతున్న అన్యాయంపై కేంద్రంతో పోరాటం చేస్తున్నామన్నారు. అనంతరం డి రాజా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలు అమలు చేయడంలో కేంద్రం విఫలమైందన్నారు. ఏపీని కేంద్రం ఆర్థికంగా ఆదుకోవాలని, విభజన హామీలను నెరవేర్చాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. ప్రజా సమస్యలపై పోరాడేందుకు సీపీఐ ఎప్పుడూ ముందుంటుందని వివరించారు. పేద ప్రజల సంక్షేమాన్ని ఎన్డీఏ సర్కారు విస్మరించిందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజల సమస్యలపై పోరాడే వారికి ఎప్పుడూ తమ మద్దతు ఉంటుందని వివరించారు. టీడీపీ ఎంపీ రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ విభజన హామీలపై పార్లమెంటులోని ఉభయ సభల్లో కూడా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే తమ పార్టీ కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులతో కూడా తమ పార్టీ ఎంపీలు ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతున్నారని, విభజన హామీలపై ఒత్తిడి తెస్తున్నారని గుర్తుచేశారు. తొలుత ఉత్తరాంధ్ర చర్చా వేదిక నేత కొణతాల రామకృష్ణతో పాటు ఇతర నేతలు ఏపీ భవన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద దీక్షను విరమించారు.



200 విశాలాంధ్ర చందాల చేర్పింపు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్:
ఖమ్మం జిల్లా విశాలాంధ్ర జర్నలిస్టులు 200 విశాలాంధ్ర సంవత్సర చందాలు చేర్పించారు. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని ఖమ్మం జిల్లా బ్యూరో మొహినుద్దీన్ విశాలాంధ్ర సంపాదకులు ముత్యాల ప్రసాద్‌కు సోమవారం విశాలాంధ్ర హైదరాబాద్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యూస్ నెట్‌వర్క్ ఇన్‌చార్జ్ షఫీ, ఎడిషన్ ఇన్‌చార్జ్ రామారావు, కొత్తగూడెం విశాలాంధ్ర విలేకరి వాహిద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొహినుద్దీన్‌కు ముత్యాల ప్రసాద్ ఆత్మీయ సత్కారం చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.